సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
సూర్య www.suryaa.com 19 వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com
సంపుటి 19 | సంచిక 82
ఆదివారం | 11 జనవరి 2026 | హైదరాబాద్
| పేజీలు 10+8 | వెల: రూ. 8.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - హేమంతరుతువు, పుష్య మాసం బహుళ పక్షం అష్టమి మ.12.22, చిత్త రా.8.25, వర్జ్యం మ.2.31 నుండి 4.15 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం ఉ.4.07 నుంచి 4.51 వరకు

## ఈడీ, బెంగాల్ ప్రభుత్వం మధ్య ముదిరిన వివాదం



6 లో

- సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసిన టీఎంసీ సర్కార్
- ఐప్యాక్ కేసులో సుప్రీంకోర్టును ఈడీ ఆశ్రయించవచ్చనే ఊహాగానాలు
- ఈ నేపథ్యంలో ఈడీ కంటే ముందుగానే సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమత సర్కార్



## చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలి

- శక్తిమంతమైన భారత్‌ను నిర్మించడమే లక్ష్యం
- అవమానం, నాశనం, అణచివేత చరిత్రను మర్చిపోవద్దన్న జాతీయ భద్రతా సలహాదారు
- యువతలో ఆవేశం, తపన అవసరమని సూచించిన అజిత్ ధోబాల్

వివరాలు-6లో

### తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు

# ఆర్థిక సాయం చేయండి

- జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలి
- రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలి
- రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది
- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి
- హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలి
- ప్రి బడ్జెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




2 లో

తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం నాడు న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

### మాతృభాషను

# ప్రోత్సహించాలి

- స్వదేశీ వస్తువులను ఉపయోగించాలి
- రాజస్థాన్ జోధ్‌పూర్‌లో జరిగిన మహేశ్వరి గ్లోబల్ కన్వెన్షన్‌లో ప్రసంగించిన అమిత్ షా

స్వదేశీ వస్తువులకు, మాతృభాషకు ఉన్న ఔనత్యాన్ని కేంద్ర హెూంమంత్రి అమిత్ మరోసారి నొక్కిచెప్పారు. ప్రజలు స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని, అలాగే ఇంట్లో మాతృభాషలోనే మాట్లాడాలని కోరారు.



6 లో

మనం ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే, ఆత్మనిర్భర్ ఏకైక మార్గమని అన్నారు. అయితే దాన్ని విజయవంతం చేయాడానికి ఏకైక మార్గం స్వదేశీ తెలిపారు. 2047 నాటికి భారత్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని, స్వదేశీ వస్తువులను తయారు చేయడానికి వ్యాపారులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### ఎరువుల లోటు

# లేకుండా చూడాలి

- ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధే లక్ష్యం
- మంత్రి పొన్నం హుస్నాబాద్‌లో సుడిగాలి పర్యటన
- అధికారులతో సమీక్షా సమావేశాలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన




2 లో

## మేడారంలో మూడు ఆసుపత్రులు



2 లో

- 30 మెడికల్ క్యాంపులు.. అత్యవసర సేవలకు 35 అంబులెన్సులు
- భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దు
- ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు.

### సినీ ఇండస్ట్రీని

## పట్టించుకోవడం మానేశా



2 లో

**టికెట్ ధరల పెంపునకు నేను అనుమతి ఇవ్వలేదు : మంత్రి కోమటిరెడ్డి**

రాష్ట్రంలో గతంలోనూ, ప్రస్తుతం సినిమా టికెట్ ధరలు పెంచేందుకు తాను ఎప్పుడూ అనుమతి ఇవ్వలేదని తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన పలు అంశాలపై విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా వస్తున్న సినిమా టికెట్ ధరల పెంపు అంశంపై విలేకరులు ఆయన్ని ప్రశ్నించారు.

### అంతా ఇంతే!




పోలీసుల భార్యకే దిక్కులేదు
ఇక మనలాంటి వాళ్లెంత?

### హైదరాబాద్‌లో అంతర్జాతీయ

# చలన చిత్రోత్సవం

- రాజ్‌భవన్ వేదికగా ప్రారంభమైన మూడవ ఎడిషన్
- భారీగా పాల్గొన్న చలన చిత్రనిర్మాతలు, కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు




2 లో

సినిమా, సృజనాత్మకత మరియు శక్తివంతమైన కథనంలకు సంబంధించిన రెండు రోజుల ఉత్సాహభరితమైన వేడుకకు నాంది పలుకుతూ, హైదరాబాద్‌లోని రాజ్ భవన్ సంస్కృతి ఆడిటోరియంలో నిరి9 అంతర్జాతీయ చలనచిత్రోత్సవం మూడవ ఎడిషన్ విజయవంతంగా ప్రారంభిం చబడింది. ఈ గొప్ప ప్రారంభోత్సవ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న చలన చిత్రనిర్మాతలు, కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు, సినిమా ప్రేమికులను ఒకచోట చేర్చి, ఉత్సవానికి స్ఫూర్తిదాయకమైన స్వరాన్ని అందించింది

### పోటీల విజయవంతంలో

## క్రీడా సంఘాల సహకారం ముఖ్యం

- సీఎం కప్ 2025 లో క్రీడా సంఘాల భాగస్వామ్యం
- రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



2 లో

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్న రెండవ విడత సీఎం కప్ 2025 విజయవంతంలో క్రీడా సంఘాల సహకారం,సమన్వయం ఎంతో ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ తెలంగాణ స్పోర్ట్స్ అథరిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులో జరిగిన ఒలంపిక్ అసోసియేషన్ మరియు క్రీడా సంఘాల సమన్వయ సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామీణ, మండల అసెంబ్లీ నియోజకవర్గం జిల్లా స్థాయి రాష్ట్రస్థాయిలో 44 క్రీడాంశాల్లో 5అంచల్లో జరుగుతున్న క్రీడా పోటీలు విజయవంతం కావాలంటే క్రీడా సంఘాల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు.

### మీ నమ్మకాన్ని

# వమ్ము చేయడం లేదు

- అభివృద్ధి.. సంక్షేమంలో ఎక్కడా తగ్గడం లేదు
- పాలేరు నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



2 లో

"రెండేళ్ల క్రితం మీరు ప్రజా ప్రభుత్వం కావాలని నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.. ఆనాడు మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గంలో ఎక్కడా తగ్గకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

### ప్రి బడ్జెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం నాడు న్యూఢిల్లీలోని అశోకా హెూటల్లో ప్రి బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

తెలంగాణ ప్రభుత్వం తరపున, నా తరపున.. రాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఒక దేశం కేంద్ర–రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నేను నమ్ముతున్నాను. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నాను.

ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి. రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఖీ=దీవీ పరిమితుల నుంచి మినహాయించాలి.తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి.

మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. విద్య: హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. విమానాశ్రయాలు: పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం దీనిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి.ఇతర నిధులు: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలి. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# మేడారంలో మూడు ఆసుపత్రులు

- 30 మెడికల్ క్యాంపులు.. అత్యవసర సేవలకు 35 అంబులెన్సులు
- భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దు
- ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ



తెలంగాణ బ్యూరోప్రతినిధిః మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్–రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ -- మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు. గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌అబశ్రీశ్రీ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

# ఎరువుల లోటు లేకుండా చూడాలి

- ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధే లక్ష్యం
- మంత్రి పొన్నం హుస్నాబాద్‌లో సుడిగాలి పర్యటన
- అధికారులతో సమీక్షా సమావేశాలు, పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఎరువుల లోటు లేకుండా చూడాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధే లక్ష్యమని పేర్కొన్నారు.

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృత పర్యటన చేపట్టారు. వ్యవసాయం, పర్యావరణం, సాగునీరు రంగాల్లో కీలక నిర్ణయాలతో అభివృద్ధికి కొత్త ఊపునిచ్చారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా ఎరువుల లోటు రాకుండా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మూడు జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. రైతులు క్యూలైన్లలో నిలబడే పరిస్థితి రావద్దని స్పష్టం చేశారు. రైతు వేదికలు, సహకార సంఘాలు, మహిళా సంఘాల ద్వారా ఎరువుల సరఫరా జరగాలని, రైతుల సమస్యలు, పంటల విధానం, యాంత్రీకరణ, అనుబంధ పథకాల అమలుపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. నర్మేటలో నిర్మితమైన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి ముందే రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఐదు ఎకరాల పైగా ఉన్న రైతులకు ప్రత్యేక సదస్సులు, ఆయిల్ ఫామ్ కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. హుస్నాబాద్‌లో ప్రతి ఇంటికి పాడి గేదె ఉండేలా కార్యాచరణ రూపొందించాలని, పశువులకు టీకాలు, సంతానోత్పత్తి శిబిరాలు తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. జిల్లలగడ్డ వద్ద అర్బన్ ఫారెస్ట్ పార్క్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఎల్లమ్మ చెరువు, మహాసముద్రం గండి, రాయికల్ వాటర్ ఫాల్స్‌తో కలిసి అర్బన్ ఫారెస్ట్‌ను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్ మార్గాలు, చిల్డ్రన్ జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

సర్వాయి పాపన్న చరిత్ర ఉన్న ఈ ప్రాంతానికి ఆయన పేరుతో అర్బన్ ఫారెస్ట్ పార్క్ నామకరణం చేయాలని సూచించారు.




**గౌరవెల్లి కాలువలపై బైక్ తనిఖీ :** గౌరవెల్లి ప్రాజెక్ట్ కుడి కాలువను 16.5 కిలోమీటర్ల మేర బైక్‌పై వెళ్లి మంత్రి పరిశీలించారు. కాలువలు పూర్తైతే 57 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ప్రాజెక్ట్ పూర్తి చేయడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. సాగునీరు వస్తే హుస్నాబాద్ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలపాలన్న ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో జిల్లాల సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ జరిగితే ప్రజల మనసుకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని వెల్లడించారు.



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కొత్త సాంకేతికతలపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవను వివరిస్తూ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు శనివారం బిట్స్ పిలానీ అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల బృందంతో మాట్లాడారు. హైదరాబాద్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రపంచ స్థాయి కేంద్రంగా

# తెలంగాణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్‌లో భాగస్వాములు కావాలి

### బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వంతో చేతులు కలపాలని ఆయన వారిని కోరారు. హైదరాబాద్‌లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పిలానీ క్యాంపస్‌లో జరిగిన 'బీజీఎమ్ఓ 26 (బీజీఎం 26) సమ్మేళనం రెండో రోజు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు పెన్సాండో సిస్టమ్స్ కో–ఫౌండర్ ప్రేమ్ జైన్, బీజీఎం 2026 చైర్‌పర్సన్ అనిత సాకురు, మ్యాప్‌మై ఇండియా ఫౌండర్, ఛైర్మన్ రాకేష్ వర్మ, బీజీఎం 2026 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మయూర్ పట్నాల పాల్గొన్నారు. ఈ సెషన్‌లో బిట్స్ పిలానీ ఛాన్సలర్ డాక్టర్ కుమార్ మంగళం బిర్లా వర్చువల్‌గా ప్రసంగించడం విశేషం. రాష్ట్ర దార్శనికతకు బిట్సియన్ ప్రవాసుల నైపుణ్యం ఒక చోదక శక్తిగా పనిచేస్తుందని , ఇక్కడి ఆవిష్కరణల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ కుమార్ మంగళం బిర్లా వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొని "బిట్సియన్ స్పిరిటు గురించి, వేగంగా మారుతున్న సాంకేతిక విప్లవ కాలంలో నైతిక నాయకత్వం ఆవశ్యకత గురించి ప్రసంగించారు. ఈ సంస్థ వారసత్వం కేవలం విద్యా నైపుణ్యం మీద మాత్రమే కాకుండా, ఇక్కడి పట్టభద్రుల స్థితిస్థాపకత, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మలుచుకునే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందని ఆయన నొక్కిచెప్పారు. శనివారం నాడు జరిగిన చర్చలు ప్రధానంగా "మానవ ప్రయోజనాలకు ఉపయోగపడే ఏఐ" దేశాభివృద్ధికి అవసరమైన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంపై సాగాయి. ఈ కార్యక్రమంలో సివిల్ సర్వీసెస్‌లో ఉన్న బిట్స్ పూర్వ విద్యార్థుల అనుభవాలు, 90 రోజుల్లో స్టార్టప్‌ను ప్రారంభించే వర్క్‌షాప్, సామాజిక సేవా కార్యక్రమం 'ఇంపాక్ట్ డాల్ఫిన్స్' వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బిట్సా (బిఐటీఎస్‌ఏఏ) అంతర్జాతీయ నెట్‌వర్క్ భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తుండగా, ఈ మూడు రోజుల సమ్మేళనం చివరి దశకు చేరుకుంది. ఈ సమావేశాలు నేడు ఆదివారం ముగియనున్నాయి.

## మహిళా ఐఏఎస్ అధికారులపై వచ్చిన అసభ్య, అనుచిత ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మహిళా ఐఏఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు, కొన్ని మీడియా వేదికలు అసభ్యంగా, అనుచితంగా, దూషణాత్మకంగా వార్తలు, వ్యాఖ్యలు చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజాసేవలో నిమగ్నమైన మహిళా ఐఏఎస్ అధికారుల గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె అన్నారు. మహిళలు ఉన్నత స్థాయిలకు చేరితే వాటిని తట్టుకోలేని ఫ్యూడల్ మానసికతే ఈ రకమైన దుష్ప్రచారాలకు మూలమని ఆమె విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందని, అటువంటి పరిస్థితుల్లో మహిళా అధికారులను కించపరిచే వ్యాఖ్యలను, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రచారాన్ని సహించబోమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా ఐఏఎస్ అధికారులు తమ బాధ్యతలను ధైర్యంగా, నిబద్ధతతో నిర్వహిస్తున్నారని, వారి వెనుక రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా నిలుస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ తరహా దూషణలు, అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలపై ద్వేషం, అవమానంతో కూడిన ప్రచారానికి సమాజం మొత్తం వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్యాన్ని, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం

- రాజ్‌భవన్ వేదికగా ప్రారంభమైన మూడవ ఎడిషన్
- భారీగా పాల్గొన్న చలన చిత్రనిర్మాతలు, కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు




హైదరాబాద్ : సినిమా, సృజనాత్మకత మరియు శక్తివంతమైన కథనంలకు సంబంధించిన రెండు రోజుల ఉత్సాహభరితమైన వేడుకకు నాంది పలుకుతూ, హైదరాబాద్‌లోని రాజ్ భవన్ సంస్కృతి ఆడిటోరియంలో నిరి9 అంతర్జాతీయ చలనచిత్రోత్సవం మూడవ ఎడిషన్ విజయవంతంగా ప్రారంభించబడింది. ఈ గొప్ప ప్రారంభోత్సవ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న చలన చిత్రనిర్మాతలు, కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు, సినిమా ప్రేమికులను ఒకచోట చేర్చి, ఉత్సవానికి స్ఫూర్తిదాయకమైన స్వరాన్ని అందించింది.ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ జాతీయ అవార్డు గ్రహీత, బాలీవుడ్ నటి సీమా బిశ్వాస్, తెలుగు చిత్ర దర్శకుడు ఎస్.వి.కృష్ణారెడ్డి, ప్రముఖ గాయని మరియు సాంస్కృతిక చిహ్నం లౌ మాజా, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన నటి కార్లిటామౌహిని, గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ అజిత్ బోర్తాకూర్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.ఎల్.ఆర్. కిషోర్ బాబు, తెలుగు మరియు అస్సామీ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ చిత్రనిర్మాతలు, దర్శకులు, సృజనాత్మక నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరి9 అంతర్జాతీయ చలనచిత్రోత్సవం యొక్క అధికారిక సావనీర్‌ను గౌరవనీయులైన సినిమాటోగ్రఫీ మంత్రి కె. వెంకట్ రెడ్డి వీడియో సందేశం ద్వారా విడుదల చేశారు, రెండు రోజుల పాటు, హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఫీచర్ ఫిల్మ్, షార్ట్ ఫిల్మ్, షార్టర్ ఫిల్మ్ మరియు డాక్యుమెంటరీతో సహా బహుళ విభాగాలలో ఎంపిక చేయబడిన చిత్రాలు పోటీపడతాయి. మొదటి రోజు మరియు 2వ రోజు అధికారికంగా ఎంపిక చేయబడిన దహిని, జుయిఫుల్, కుహిపత్, ఘర్, ధోంగులోయి, ది ఎలిఫెంట్ హెవెన్, గోల్డెన్త్రెడ్, పాపా, చోరి, ఇలిష్, అబాసేషాట్, మనితాశుభవం, క్యారెక్టర్, బియాండ్ ది అన్‌ఫినిష్డ్, ది అగ్లీ గ్రీన్ ప్లానెట్, ఓమ్నిప్రెజెంట్, శేష్ చితి, పా పోటీ విభాగంలో మరియు విమర్శకుల ప్రశంసలుపొందిన చిత్రం ' కూకీ' , అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఫీచర్ ఫిల్మ్ ' ది వాయిస్ ఆఫ్ హింద్ రజబ్ణ వంటి సినిమాల వరుస ప్రదర్శనలు ఉంటాయి.ప్రపంచవ్యాప్తంగా చలనచిత్ర నిర్మాతలకు స్ఫూర్తినిచ్చేలా నగదు అవార్డులను అందించే 15 చలనచిత్రోత్సవాలలో ఈ ఉత్సవం ఒకటి.ఈ ఉత్సవంలో రూ. 4,30,000 నగదు బహుమతులు, ప్రత్యేక గుర్తింపులు మరియు వ్యక్తిగత అవార్డులతో పాటు ప్రదానం చేస్తారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన గౌరవం, ఉత్తమ చలనచిత్రంగా డాక్టర్ జుబీన్గార్గ్ స్మారక అవార్డును ఈ ఉత్సవంలో అత్యుత్తమ చలనచిత్రానికి ప్రదానం చేస్తారు.




# మీ నమ్మకాన్ని వొమ్ము చేయడం లేదు

- అభివృద్ధి.. సంక్షేమంలో ఎక్కడా తగ్గడం లేదు
- పాలేరు నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః "రెండేళ్ల క్రితం మీరు ప్రజా ప్రభుత్వం కావాలని నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.. ఆనాడు మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గంలో ఎక్కడా తగ్గకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పాలేరు నియోజక వర్గంలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని విద్యానగర్‌లో రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులకు మంత్రి గారు శంకుస్థాపన చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో రూ. కోటి రెండు లక్షల యాభై వేల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు, బస్ షెల్టర్, జంక్షన్ అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నడిమితండాలో రూ. 77.10 లక్షలు, గొల్లగూడెంలో రూ. 37.20 లక్షలు, జలగంనగర్‌లో రూ. 29.30 లక్షలు, బారుగూడెం లో రూ. 24.27 లక్షలు, ఆటోనగర్‌లో రూ. 17.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాడి కష్టాలను పట్టించుకోలేదని, రేషన్ కార్డులు అడిగితే మొహం చాటేశారని మండిపడ్డారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులే ఇవ్వకుండా దగా చేసిన గత పాలకుల తీరును ఎండగడుతూ.. తమ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ కార్డులు అందజేయడమే కాకుండా, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా తెలంగాణలో సన్నబియ్యం అందిస్తు న్నామని చెప్పారు.గతంలో హాస్టళ్లలో పేద పిల్లలకు సరైన తిండి పెట్టలేదని, తమ ప్రభుత్వం వచ్చాక డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను ఏకంగా 200 శాతం పెంచి పేద విద్యార్థులకు అండగా నిలిచామని వివరించారు. ?సొంత ఇల్లు లేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని, ఈ ప్రక్రియ దఫాలవారీగా నిరంతరం కొనసాగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. పేదవారికి ఎల్లవేళలా అండగా ఉండే విధంగానే ఈ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, రాబోయే ఎన్నికల్లోనూ ప్రజల దీవెనలు ఇలాగే కొనసాగాలని కోరారు.

# సినీ ఇండస్ట్రీని పట్టించుకోవడం మానేశా

### టికెట్ ధరల పెంపునకు నేను అనుమతి ఇవ్వలేదు : మంత్రి కోమటిరెడ్డి

తెలంగాణ బ్యూరోప్రతినిధి: రాష్ట్రంలో గతంలోనూ, ప్రస్తుతం సినిమా టికెట్ ధరలు పెంచేందుకు తాను ఎప్పుడూ అనుమతి ఇవ్వలేదని తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన పలు అంశాలపై విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా వస్తున్న సినిమా టికెట్ ధరల పెంపు అంశంపై విలేకరులు ఆయన్ని ప్రశ్నించారు. ఇందుకు ఆయన సమాధానమిస్తూ సినీ ఇండస్ట్రీని పట్టించుకోవడం మానేశానని తెలిపారు. 'సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేశాను. 'పుష్ప2' తర్వాత బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ ధరలను పెంచమని నా వద్దకు రావొద్దని చెబుతూనే ఉన్నా. ఆ మధ్య వచ్చిన రెండు సినిమాలు, తాజాగా వచ్చిన సినిమా, సంక్రాంతికి రాబోయే చిత్రాలకు సంబంధించి ఏ ఫైలూ నా దగ్గర రాలేదు. అప్లికేషన్ పెట్టుకోవద్దని నేనే చెబుతున్నా. నన్ను ఎవరూ కలవడం లేదు. సంధ్య థియేటర్ ఘటనలో ఒక మహిళ చనిపోయింది. ఎందుకు పర్మిషన్ ఇచ్చానా?అనిపించింది. సంఘటన జరిగిన వెంటనే ఆస్పత్రి వాళ్లు, డీఎంహెచ్‌వో తదితరులతో మాట్లాడి, ప్రతీక్ ఫౌండేషన్ తరఫున రూ.25లక్షల చెక్ ఇచ్చాను. అప్పటికి నిర్మాత కూడా ఎవర్ని పంపలేదు. ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదల కావాలంటే ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది. ప్రమాదంలో గాయపడిన అబ్బాయిని పెంచి, చదివిస్తానని ఆ తండ్రికి హామీ కూడా ఇచ్చాను" ఇక తెలంగాణలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరలు పెంచబోమని ఆ మరుసటి రోజే అసెంబ్లీలో చెప్పాను. ఆ మాటకు కట్టుబడి ఇప్పటివరకూ ఒక్క సంతకం కూడా పెట్టలేదు. నల్గొండకు సంబంధించిన అభివృద్ధి పనులు చూసుకుంటూ, వాటిని సమీక్షించుకుంటూ రాత్రే వచ్చాను. నేను సినిమా పరిశ్రమపై దృష్టి పెట్టదలుచుకోలేదు. సమస్యలు పరిష్కరించాలని కార్మికులు వస్తే, పేద కళాకారుల విషయంలో మాత్రమే నేను జోక్యం చేసుకున్నా. అంతే తప్ప, రేట్లు, బెనిఫిట్‌లకు సంబంధించి ఎలాంటి సంబంధం లేదు. టికెట్ ధరల పెంపు గురించి వస్తున్న జీవోలకు నాకు ఎలాంటి సంబంధం లేదు" అని అన్నారు.

## పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల సహకారం ముఖ్యం

- సీఎం కప్ 2025 లో క్రీడా సంఘాల భాగస్వామ్యం
- రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న రెండవ విడత సీఎం కప్ 2025 విజయవంతంలో క్రీడా సంఘాల సహకారం,సమన్వయం ఎంతో ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ తెలంగాణ స్పోర్ట్స్ అథరిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులో జరిగిన ఒలంపిక్ అసోసియేషన్ మరియు క్రీడా సంఘాల సమన్వయ సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామీణ, మండల అసెంబ్లీ నియోజకవర్గం జిల్లా స్థాయి రాష్ట్రస్థాయిలో 44 క్రీడాంశాల్లో 5అంచల్లో జరుగుతున్న క్రీడా పోటీలు విజయవంతం కావాలంటే క్రీడా సంఘాల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. దాదాపు దశాబ్ద కాలం పాటు నిర్లక్ష్యానికి గురైన క్రీడారంగం సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రెండేళ్లలోనే రెట్టింపు అభివృద్ధి వైపు కొనసాగుతుందని అన్నారు. వివిధ క్రీడా సంఘాలు వివిధ జిల్లా సంఘాలునిర్వహించే క్రీడా కార్యక్రమాలలో పాల్గొనడానికి రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ,గత సంవత్సరం నిర్వహించిన సీఎం కప్ 2024 విజయవంతంలో క్రీడా సంఘాల సహకారం ఎంతో ఉందని అదే క్రీడా స్ఫూర్తితో క్రీడా సంఘాలు తమ సొంత కార్యక్రమంలా భావించి సహకరించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు మరియు తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ 2025 నిర్వహణలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు క్రియాశీలకంగా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో వివిధ క్రీడా సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రిగారి సమక్షంలో ఇంకో ప్రత్యేక సమావేశాన్ని త్వరలో నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథరిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్ వేణుగోపాల చారి,కార్యదర్శి మల్లారెడ్డి కోశాధికారి సతీష్ గౌడ్ వివిధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మరియు స్పోర్ట్స్ అథరిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




### ప్రెస్ క్లబ్ జర్నల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ రూపొందించిన ప్రెస్ క్లబ్ జర్నల్ ను మంత్రి సచివాలయంలో శనివారం ఆవిష్కరించారు. తెలుగు ఇంగ్లీష్ భాషల్లో ప్రతినెల ప్రెస్ క్లబ్ జర్నలను రూపొందించడం అభినందనీయమని పొంగులేటి సందర్భంగా ప్రశంసించారు. ఈ జర్నల్లో జర్నలిస్టులకు సంబంధించిన సమకాలిన అంశాలు పొందుపరచడం సంతోషకరమని పొంగులేటి గారు చెప్పారు. ప్రెస్ క్లబ్ నూతన పాలకమండలి ఏర్పడి మూడు నెలలు అయినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధికి వివిధ కార్యక్రమాలను రూపొందించామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయకుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మంత్రికి వివరించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రికి వివరించారు. జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ జర్నల్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రెస్ క్ల బ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు శంకర్ శీగ, ఎన్ . ఉమాదేవి, రచన ముడుంబై, వనం నాగరాజు, అమిత్ బట్టు తదితరులు పాల్గొన్నారు.

### పత్రికారంగానికి లక్ష్మణ రావు చేసిన సేవలు మరువలేనివి

**సంతాపసభలో పలువురు వక్తలు**




తెలంగాణ బ్యూరోప్రతినిధిః పత్రికారంగంలో గొప్ప స్థానం సంపాదించుకుని గ్రామీణ లక్ష్మణుడిగా ముద్ర వేసుకున్న సీనియర్ పాత్రికేయుడు కీర్తి శేషులు టీకే లక్ష్మణ్ రావు మరణం పత్రికా రంగానికి, జర్నలిస్టులకు తీరని లోటని పలువురు సీనియర్ పాత్రికేయులు పేర్కొన్నారు. లక్ష్మణ్ రావు సేవలు ఎనలేనివని, ఆయన జీవివితం రాబోయే తరం జర్నలిస్టులకు ఆదర్శం అని కొనియాడారు. శనివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో కీర్తి శేషులు టీకే లక్ష్మణ్ రావు సంతాపసభ జరిగింది. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సంతాపసభలో సీనియర్ సంపాదకులు సతీష్ చంద్ర, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర కో–కన్వీనర్లు బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు తదితరులు పాల్గొని లక్ష్మణ రావు చిత్రపటానికి పూలమాల వేసీ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ చంద్ర మాట్లాడుతూ, పాత్రికేయులలో తాను, ఏబీకే ప్రసాద్, సజ్జల రామకృష్ణా రెడ్డి అత్యంత ఇష్టపడే వ్యక్తులలో లక్ష్మణ రావు ప్రధానుడని చెప్పారు. లక్ష్మణ రావు ప్రధాన పత్రికల్లో ఏ హోదాలో ఉన్నా చిన్న పెద్ద బేధం లేకుండా అందరితో స్నేహంగా ఉండేవాడని, తెలుగు బాషపట్ల పట్టు కలిగిన ప్రతిభావంతుడని అన్నారు. వృత్తిలో ఎంత ఒత్తిడి ఉన్నా ఆయనలో చిరునవ్వే కనిపించేదని,అందరినీ నవ్వించేవారని గుర్తు చేశారు. అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ, తాను సాక్షి పత్రికలో లక్ష్మణ రావుతో కలిసి పనిచేస్తున్నప్పుడు ఆయనతో అనేక మంచి విషయాలను పంచుకోవడం జరిగిందని, జర్నలిస్ట్ ఫెడరేషన్ స్థాపనలో మాతో కలిసి పనిచేశారని అన్నారు. లక్ష్మణ రావు ఆత్మాభిమానం ఉన్న వ్యక్తి అని, సౌమ్యుడు,నిజాయితీపరుడని, జర్నలిస్టుల్లో అలాంటి వ్యక్తులు అరుదు అని మామిడి సోమయ్య అన్నారు. పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ, లక్ష్మణ రావు సేవలను కొనియాడారు. ఈ సంతాపసభలో జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు దామెర జగదీశ్వర్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగరాజు గౌడ్, కుత్బుల్లాపూర్ కార్యదర్శి గోవింద రావు, సంజీవ్ కుమార్, హైదరాబాద్ జిల్లా నాయకులు రవికుమార్, పద్మారావు, నంబి పర్వతాలు, కరుణాకర్ రెడ్డి, బాల్ రాజ్ పటేల్ తదితరులు పాల్గొని లక్ష్మణ రావు చిత్రపటానికి నివాళులర్పించారు.

### ఈ ఏడాది 73 మంది రాజ్యసభ సభ్యుల పదవీ విరమణ

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం ఆరుగురు
- ఏపీలో నాలుగు స్థానాలను కూటమి సర్కార్
- తెలంగాణలో రెండు స్థానాలను గెలుచుకోనున్న కాంగ్రెస్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఈ ఏడాది మార్చ్ నుంచి నవంబర్ మధ్య 73 మంది రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఇక, దీనిపై రాజ్యసభ సచివాలయం బులిటెన్ విడుదల చేసింది. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి 10 మంది, మహారాష్ట్ర నుంచి ఏడుగురు, తమిళనాడు నుంచి ఆరుగురు, పశ్చిమ బెంగాల్, బీహార్ నుంచి ఐదుగురి చొప్పున ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి నలుగురి చొప్పున, అస్సాం, మధ్యప్రదేశ్, రాజస్థాన్ల నుంచి ముగ్గురి చొప్పున, తెలంగాణ, ఛత్తీస్ గఢ్, హర్యానా, ఝూరా?ండ్ ల నుంచి ఇద్దరి చొప్పున, హిమాచల్ దేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, ఉత్త రాఖండ్ల నుంచి ఒక్కొక్కరి చొప్పున పదవీ విరమణ చేయనున్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వైసీపీ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబో స్ తో పాటు టీడీపీ సభ్యుడు సానా సతీష్ బాబు ఈ జాబితాలో ఉన్నారు.

ఇక, ఈసారి ఏపీ నుంచి నాలుగు స్థానాలు కూటమి ప్రభుత్వానికి దక్కనున్నాయి. కాగా, తెలంగాణ నుంచి బీఆర్ఎస్ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి కేశవరావు రాజీనామాతో జరిగిన ఉప ఎన్నికలో ఎన్నికైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ పదవీ విరమణ చేస్తారు. ఇక, తెలంగాణలో రెండు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవడానికి అవకాశం ఉంది.

### అంబర్‌పేట్ ఎస్సై భాను ప్రకాష్ రెడ్డి అరెస్ట్

**చంచల్‌గూడ జైలుకు తరలింపు**

తెలంగాణ బ్యూరోప్రతినిధి: అంబర్‌పేట్ ఎస్సై భాను ప్రకాష్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బెట్టింగ్ అప్పులు తీర్చేందుకు రికవరీకి సంబంధించిన సొత్తును కాజేసి తాకట్టు పెట్టిన వ్యవహారంలో భాను ప్రకాష్ రెడ్డి పాత్ర వెలుగులోకి రావడంతో అరెస్ట్ చేశారు. అంతేకాకుండా తన సర్వీస్ రివాల్వర్‌ను ఎక్కడో పోగొట్టుకున్నట్లు భాను ప్రకాష్ వెల్లడించారు. ట్రైన్‌లో ప్రయాణిస్తున్న సమయంలో రివాల్వర్ పోయిందని అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చిన ఆయన, ఎంత వెతికినా ఆయుధం దొరకలేదని కన్ఫెస్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సర్వీస్ రివాల్వర్ లాంటి కీలక ఆయుధం గల్లంతు కావడం భద్రతాపరంగా తీవ్ర అంశంగా మారడంతో విచారణ మరింత లోతుగా కొనసాగుతోంది. భాను ప్రకాష్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్––2 ఉద్యోగం కూడా పొందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడికి రిలీవ్ చేయాలని ఇప్పటికే రిక్వెస్ట్ పెట్టుకున్నట్లు సమాచారం అందింది. అయితే ఈ కేసులో అరెస్టు కావడంతో ఆ ప్రక్రియపై కూడా అనిశ్చితి నెలకొంది. భాను ప్రకాష్ రెడ్డిపై నమోదైన ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతుందని, అవసరమైతే మరిన్ని కేసులు నమోదు చేసే అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేశారు.

# రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం

- బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మరు
- కాంగ్రెస్ పాలన ఫలితాలే తాజా ఎన్నికల విజయాలు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, రాజకీయ ప్రత్యర్థులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌కు "సిస్టర్ స్ట్రోకు, బావ హరీష్ రావుకు "మరదల్ స్ట్రోకు తగిలి మతిభ్రమించిందని వ్యాఖ్యానించారు. దమ్ముంటే కవిత లేవనెత్తిన ప్రశ్నలకు అన్న కేటీఆర్, బావ హరీష్ రావు సమాధానాలు చెప్పాలని సవాల్ విసిరారు. అవినీతి, పార్టీ పేరు మార్పు అంశాలపై కవిత అడిగిన ప్రశ్నలకు ఇప్పటివరకు బీఆర్ఎస్ నుంచి సమాధానాలు లేవని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ 70 శాతం పైగా స్థానాలను గెలుచుకుందని, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో 25 వేలకుపైగా మెజార్టీతో విజయం సాధించిందని గుర్తు చేశారు. ఈ ఫలితాలన్నీ కాంగ్రెస్ ప్రజాపాలనలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం పైగా మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పక్కా ప్రణాళికలతో, సమన్వయ లోపం లేకుండా ఎన్నికల బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో విద్య, వైద్యం, క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్స్ కారణంగా తమ మద్దతుదారులు కొంతమేర కోల్పోయామని, దాంతో బీఆర్ఎస్, బీజేపీ మద్దతుదారులు లబ్ధి పొందారని అన్నారు. ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపు మేరకు కుల సర్వే నిర్వహించామని వెల్లడించారు. వ్యక్తిగత ప్రతిష్ఠ భంగం కలిగించే విధంగా వెలువడుతున్న వార్తా కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నానని, వాస్తవాలకు దూరంగా కథనాలు ప్రచురించడం శ్రేయస్కరం కాదని హెచ్చరించారు. బీజేపీ నేతలు జిల్లా పేరు మార్పు అంశం పక్కన పెట్టి తాము చేపట్టిన అభివృద్ధి పనుల గురించి మాట్లాడాలని సూచించారు. కవిత ఆరోపణలకు బాధ్యతగా కేటీఆర్, హరీష్ రావు సమాధానాలు చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చర్చకు సిద్ధమా? అంటూ ప్రశ్నించారు. నిరుద్యోగుల ఉసురు తగిలే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని వ్యాఖ్యానించారు. సినిమా టికెట్లు సామాన్యులకు అందుబాటులో ఉండాలన్నారు. హైదరాబాద్ భూములు అమ్మిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని, అసలు రియల్టర్ కేటీఆర్ అని విమర్శించారు. దేవుడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.

# బీసీల రిజర్వేషన్లపై ఎందుకీ మౌనం

- కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల నాన్చుడు ధోరణి
- రిజర్వేషన్లు దయ కాదు -- రాజ్యాంగబద్ధమైన హక్కు
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం



తెలంగాణ బ్యూరోప్రతినిధిః దేశంలో, రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న బీసీ వర్గాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నాన్చుడు ధోరణిపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీలు, సభల్లో పొగడ్తలు తప్ప అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్ సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ, కేంద్రం గానీ రాష్ట్రం గానీ స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం లేదని ఆరోపించారు. కులగణన, న్యాయపరమైన అడ్డంకులు అంటూ అంశాన్ని కావాలనే నాన్చుతూ బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా బీసీల జనాభా లెక్కలు తేల్చేందుకు కులగణన అవసరమని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం కావాలనే వెనక్కి తగ్గుతోందని ఆరోపించారు. కులగణన లేకుండా న్యాయమైన రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇది బీసీల హక్కులను కాలరాసే చర్యగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చినా, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బీసీ రిజర్వేషన్లు లేకుండానే నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.

**రిజర్వేషన్లు దయ కాదు -- రాజ్యాంగ హక్కు :** బీసీలకు రిజర్వేషన్లు ప్రభుత్వాల దయాదక్షిణలు కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కులని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. ఆర్టికల్ 15(4), 16(4) ప్రకారం సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేశారు. అయినా నిర్లక్ష్యం కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని గుజ్జ సత్యం ఆరోపించారు.

**బీసీలు ఐక్యంగా ఉద్యమించాలి**

ఇకపై మౌనంగా ఉండే పరిస్థితి లేదని గుజ్జ సత్యం హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీలు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులు సాధించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీసీల డిమాండ్లను పట్టించుకోని పార్టీలకు తగిన రాజకీయ గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు వెంటనే అమలు చేయాలి. 42% రిజర్వేషన్లపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలి. లేదంటే బీసీల ఆగ్రహం రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతుందని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నామని గుజ్జ సత్యం తెలిపారు.

## పంచాయతీ ఎన్నికలు

# గెలిచిన వారికి కొత్త పరేషాన్




- ఎన్నికల ఖర్చు సమర్పణలో అభ్యర్థుల సతమతం
- నిబంధనలకు మించి ఖర్చు చేసిన సర్పంచ్, వార్డు సభ్యులు
- మూడు విడతల్లో గెలుపొందిన వారికి 45 రోజుల గడువు
- సరైన లెక్కలు సమర్పించకపోతే పదవికి గండం

తెలంగాణ బ్యూరోప్రతినిధిః గ్రామాల్లో కొత్త పంచాయతీల పాలకవర్గం కొలువుదీరింది. గత నెల డిసెంబరు 11, 14, 17 తేదీల్లో మూడు విడుతల్లో ఎన్నికలు జరిగాయి. ఎక్కడా ఏ చిన్న లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. గ్రామాల్లో ఎన్నికైన నూతన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఇప్పటికే పదవీ ప్రమాణ స్వీకారం చేసి పాలన సాగిస్తున్నారు. అయితే, ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన అభ్యర్థులు ఎంత ఖర్చు చేశారో వివరాలు తెలపాలంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు జరిగిన రోజు నుంచి 45 రోజుల్లో లెక్కల వివరాలు సమగ్రంగా ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు సతమతమవుతున్నారు. వివరాలు ఎలా ఇవ్వాలోననే ఆందోళనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. లెక్కకు మించి ఖర్చు చేసిన అభ్యర్థులు ఏమివ్వాలో.. ఎలా ఇవ్వాలో అని తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొంత మేరకే ఖర్చు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. 5వేలకు పైబడిన జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.2.50లక్షలు, వార్డు సభ్యులు రూ.50వేలు, 5వేల లోపు జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.1.50 లక్షలు, వార్డు సభ్యులు రూ.30వేలు మాత్రమే ఖర్చు చేయాలనే నిబంధన ఉంది. కానీ, ఈ నిబంధన ఏ పంచాయతీలో అమలైన పరిస్థితి లేదనే చర్చ జరుగుతోంది. మేజర్ గ్రామ పంచాయతీల్లో పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు సైతం ఖర్చు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక వార్డు సభ్యులు సుమారు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల మేర ఖర్చు చేశారనే విమర్శలు లేకపోలేదు.

ఈ నేపథ్యంలో ఖర్చుల వివరాలు నిబంధనల ప్రకారం ఎలా సర్దాలా అని పోటీలో గెలిచిన సర్పంచ్, వార్డు సభ్యులు ఆలోచనలో పడ్డట్లుగా తెలుస్తోంది. నిబంధనల ప్రకారం కాకి లెక్కలు సమర్పించి మమ అనిపించాలనే ప్రయత్నంలో కొత్త పాలకవర్గం ఆలోచన చేస్తున్నట్లు తీవ్ర చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో ఖర్చు చేసిన వివరాలు సమర్పించేందుకు గడువు సమీపిస్తోంది. రాష్ట్రంలో మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో.. భాగంగా కేవలం 45 రోజుల గడువును ఎన్నికల సంఘం విధించింది. ఈ గడువు లోపే వివరాలు ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలి. తొలి విడతలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు జనవరి 24వ తేదీ లోపు, రెండో విడతలో గెలుపొందిన వారు 27వ తేదీ లోపు, 3వ విడతలో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు జనవరి 30వ తేదీలోగా వివరాలు అందించాలని ఎన్నికల సంఘం జిల్లాల ఎన్నికల అధికారితో పాటు ఆయా మండలాల ఎంపీడీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయా మండలాల ఎంపీడీవోలు గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులకు నోటీసులు పంపినట్లు తెలిసింది. మొత్తంగా గెలుపొందిన అభ్యర్థులు ఈ నెలాఖరులోగా వారి ఖర్చుల వివరాలు లెక్కలతో సహా సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేశాం.. గెలుపొందాం.. ఇంకేం అవుతదిలే అనుకుంటే పొరపాటే.. ప్రతీ ఒక్కరి వివరాల సేకరణను ఎన్నికల సంఘం పరిశీలిస్తుందని అధికారులు అంటున్నారు. అయితే, ఈ విషయంలో గెలుపొందిన అభ్యర్థులు అలసత్వం వహించి సకాలంలో వివరాలు సమర్పించకపోతే అనర్హత వేటు పడనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులు సైతం వారి ఖర్చుల వివరాలు సమర్పించాలి. లేదంటే వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఉండదు. మూడేళ్ల పాటు వారంతా పోటీకి అనర్హులవుతారని అధికారులు వెల్లడించారు. కాగా, ఇప్పటికే గెలుపొందిన ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో పాటు ఓటమి చెందిన అభ్యర్థులకు సంబంధిత మండలాల ఎంపీడీవోల నుంచి నోటీసులు సైతం వెళ్లాయి.

# భూ భారతి పేరుతో ఏజెంట్ల దందా

- స్లాట్ బుకింగ్ ఏజెంట్ల అక్రమ దందా
- అమాయకులే లక్ష్యంగా అడ్డగోలు దోపిడీ
- తప్పిదాలుంటే తహసీల్దార్ల పేర్లతో వసూళ్లు
- పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా రేట్లు
- భూ భారతి అక్రమాలకు అధికారుల అండ?

తెలంగాణ బ్యూరోప్రతినిధిః గతంలో ధరణి.. ప్రస్తుతం భూ భారతి.. పేరు ఏదైతేనేం వారి వసూళ్లకు అంతు ఉండదు. తాము చేసిందే స్లాటు, చెప్పిందే రేటు అన్నట్లుగా వైఖరి ఉంటుంది. డాక్యుమెంట్ రైటర్లు, స్లాట్ బుకింగ్ ఏజెంట్లు, మీ సేవా కేంద్రాలు. చేసే పని ఒకటే అయినా వసూళ్లలో మాత్రం ఎవరి తీరు వారిదే. భూముల క్రయ విక్రయాల్లో వారిదే కీలకం. అధికారులకు, యవిక్రయదారులకు వారదిగా ఉంటూ అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. భూ భారతి పోర్టల్ ద్వారా అక్రమాలకు పాల్పడ్డ వైనం జిల్లాలో వెలుగుచూడగా స్లాట్ బుకింగ్ కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో వసూళ్లు, వాటి పని తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. భూముల క్రయ విక్రయాలకు వచ్చే అమాయకులు, అవసరార్థులే లక్ష్యంగా కొందరు డాక్యుమెంట్ రైటర్లు, స్లాట్ బుకింగ్ ఏజెంట్లు అక్రమ దందాకు తెరలేపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. భూముల క్రయవిక్రయాలు జరగాలంటే మొదటగా తమకు అనుకూలమైన తేదీలో స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ స్లాట్‌లను సొంతంగానూ చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ, చాలా మందికి అవగాహన లేకపోవడంతో డాక్యుమెంట్ రైటర్లను, మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తుంటారు. వీరు స్లాట్ బుక్ చేసి డాక్యుమెంట్ ఫైల్ తయారు చేసి తహసీల్దార్ వద్దకు పంపిస్తారు. తహసీల్దార్ దీనిని పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. కాగా, ఈ పనికి మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రూ.200 చొప్పున తీసుకోవాల్సి ఉంటుంది. కొన్ని చోట్ల మీసేవా కేంద్రాల్లో జీఎస్టీ, ఇతర ట్యాక్స్‌ల పేరుతో రూ.300 వరకు తీసుకుంటుండగా ప్రైవేటుగా పెట్టుకున్న స్లాట్ బుకింగ్ కేంద్రాల నిర్వాహకులు మాత్రం రూ.1000 నుంచి రూ. 1500 పైనే తీసుకుంటున్నారన్న ప్రచారం ఉంది. జిల్లాలో కొన్ని చోట్ల స్లాట్ బుకింగ్ ఏజెంటు చలాన్ రశీదులను ఎడిట్ చేసి ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంపు డ్యూటీకి సంబంధించిన ప్రింట్ అవుట్ తీసిన తర్వాత ఉదాహరణకు దానిపై రూ.10వేలు ఉంటే దానిని స్కాన్ చేసి రూ.20వేలుగా మార్చి తిరిగి ప్రింట్ తీసి ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీల ఛార్జీలపై పూర్తిగా అవగాహన లేని వారి విషయంలో ఈ విధంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. దీనితో పాటు ఆధార్ కార్డులో తప్పిదాలున్నాయని, వాటిని సరిచేయాలంటే ఎక్కువ డబ్బులు కావాలంటూ అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో కొన్ని చోట్ల తహసీల్దార్ల పేర్లు చెప్పి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారి స్లాట్ బుక్ అయితే ఆ రోజుకు రిజిస్ట్రేషన్ జరగాల్సిందే. లేనిపక్షంలో స్లాట్ రద్దవుతుంది. స్లాట్ రద్దు అయితే ఒకసారి చెల్లించిన రిజిస్ట్రేషన్ చార్జీలు తిరిగి రావు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు క్రయ విక్రయదారులను భయపెట్టి మరీ అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ ఆగుతుందన్న భయంతో అడిగినంత ఇస్తున్నారన్న ప్రచారం ఉంది. ఒక్కో డాక్యుమెంట్ బయటకు రావాలంటే కొందరు ఏకంగా రూ.3000 వరకు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఆయా మండలాల తహసీల్దార్లు, అధికారుల అండతోనే స్లాట్ బుకింగ్ ఏజెంట్ల దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్లాట్ బుకింగ్ ఏజెంట్ల ద్వారా వెళ్తేనే రిజిస్ట్రేషన్ సాఫీగా జరుగుతుందన్న ప్రచారం ఉంది. పాసు పుస్తకాల్లో తప్పిదాలు, సరైన పత్రాలు లేకపోవడం వంటి కారణాలను చూపుతూ చేసిన వసూళ్లలో అధికారులకు సైతం వాటాలు పోతున్నాయన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మీసేవా కేంద్రాల్లో అదనపు వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ ఉండగా ప్రైవేటు స్లాట్ బుకింగ్ ఏజెంట్లపై పూర్తిగా లేదు. వీరిపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో వీరు ఆడిందే ఆటగా సాగిందన్న చర్చ జరుగుతోంది. జిల్లాలో భూ భారతి పోర్టల్ ద్వారా జరిగిన స్కామ్ బయటపడడంతో స్లాట్ బుకింగ్ కేంద్రాల్లో అధిక వసూళ్లపై కూడా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. కాగా.. స్లాట్ బుకింగ్ కేంద్రాల్లో అధిక వసూళ్ల వ్యవహారంపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను వివరణ కోరగా.. అధిక వసూళు చేసినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాల్సిందే

- పూలే దంపతులకు భారతరత్న అవార్డులు ఇచ్చి కేంద్రం గౌరవించాలి
- పార్లమెంటులో సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలు నెలకొల్పాలి
- బీసీ రిజర్వేషన్లు 42 శాతం మించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి
- సావిత్రిబాయి జయంతి ఉత్సవ సభలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీసీ మహిళలకు ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లు ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వానికి బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ పట్టణంలోని న్యూ అంబేద్కర్ ఆడిటోరియంలో బీసీ ఉపాధ్యాయ సంఘం నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195వ జయంతి ఉత్సవాలను జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు ఆర్ భూపతిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారికి విఠల్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి సావిత్రిబాయి పూలే జయంతి రోజైన జనవరి మూడో తేదీని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం అధికారికంగా ప్రకటించిందని, అదేవిధంగా హైదరాబాదులో పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు, ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా సామాజిక సంఘసంస్కర్త అయినటువంటి మహాత్మ జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే పుణ్య దంపతులకు భారతరత్న అవార్డులు ప్రకటించి గౌరవించాలని అలాగే వారి విగ్రహాలను భారత పార్లమెంటులో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో చట్టసభలలో మూడోవంతు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్లో చట్టం చేసిందని, ఈ చట్టం వలన బీసీ మహిళకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన తెలిపారు ప్రస్తుతం అసెంబ్లీలో కొనసాగుతున్న అగ్రకులాలే తరతరాలుగా తిష్ట వేశారని, మహిళా బిల్లు పేరుతో వారి భార్యలు వారి కుటుంబ సభ్యులు మాత్రమే చట్టసభలోకి రాగలుగుతారని అవమానాలను, వివక్షత ఎదుర్కొన్నటువంటి బీసీ మహిళలకు బీసీలకు సబ్ కోటా కూడా లేకపోవడంతో చట్టసభలోకి వచ్చే అవకాశం లేదన్నారు. బీసీల విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని, ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఎజెండాగా చేసుకునేలా అన్ని పార్టీలపై ఒత్తిడి పెంచామని ఆయన వెల్లడించారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సహకార ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పూలే సావిత్రిబాయి పూలే ఆశయాలను బీసీ సమాజం ముందుకు తీసుకుపోవాలని ఊరికి ఒక మహాత్మ పూలే, ఇంటికొక సావిత్రిబాయి పూలేలు కావాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు ఇచ్చారు. నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు ఆర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే తెలంగాణలో కులగనని నిర్వహించి బీసీల జనాభా 56% ఉందని అధికారికంగా వెల్లడించామని బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన కేంద్రంలో కొద్దిగా కూడా చలనం లేదని, బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత బిజెపి నేతలపై ఉన్నప్పటికీ అది విస్మరించి, బీసీ రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంలో అర్థం లేదని ఆయన అన్నారు. జయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాలలో అత్యంత ప్రతిభ కనబరిచిన మహిళలకు, సామాజిక సేవ లో నిమగ్నమైన మహిళలకు సావిత్రిబాయి పూలే అవార్డులతో సత్కరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్,గోపాల కృష్ణ చారి, నరాల సుధాకర్, శ్రీలత, యన్ విజయలక్ష్మి, బుస్స ఆంజనేయులు, శ్రీనివాస్, రమణ, కరిపే రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## దాంపత్యం 'యుద్ధక్షేత్రం'గా మారుతోందా?

ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు, ముఖ్యంగా భార్యాభర్తల మధ్య అనుబంధాలు అత్యంత క్లిష్టంగా మారుతున్నాయి. ఒకప్పుడు పవిత్రమైన బంధంగా భావించబడిన వివాహం, నేడు అహాలు మరియు చట్టపరమైన పోరాటాల వేదికగా మారుతోంది. భర్తల క్రూరత్వం ఒకవైపు కుటుంబాలను బాధిస్తుంటే, మరోవైపు మహిళల రక్షణ కోసం రూపొందించబడిన చట్టాలను కొందరు భార్యలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం, భర్తను మరియు అతని కుటుంబాన్ని వేధించడానికి అస్త్రాలుగా వాడుకుంటున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో న్యాయస్థానాలు వెలువరిస్తున్న తీర్పులు సమాజంలోని ఈ చేదు నిజాలను కళ్లకు కడుతున్నాయి. ముఖ్యంగా సెక్షన్ 498ఏ వంటి వరకట్న వేధింపుల చట్టం దుర్వినియోగం అవుతున్న తీరును సుప్రీంకోర్టు "లీగల్ టెర్రరిజం"గా అభివర్ణించడం గమనార్హం. అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ వంటి కేసుల్లో న్యాయస్థానం స్పందిస్తూ, అరెస్టు అధికారాన్ని భర్త కుటుంబాన్ని బెదిరించడానికి వాడకూడదని స్పష్టం చేసింది. ఇది చట్టం రక్షణ కవచం నుండి ఆయుధంగా మారుతున్న వైనాన్ని ఎత్తి చూపుతోంది. మరోవైపు, వివాహేతర సంబంధాల విషయంలో మారుతున్న సామాజిక దృక్పథం కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జోసెఫ్ షైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు వివాహేతర సంబంధాన్ని నేరంగా పరిగణించే సెక్షన్ 497ను రద్దు చేస్తూ, అది కేవలం విడాకులకు ఒక ప్రాతిపదిక మాత్రమేనని, నేరం కాదని తీర్పునిచ్చింది. ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించినప్పటికీ, నైతిక విలువల పతనానికి దారితీస్తోందని విమర్శలు ఉన్నాయి. భార్యాభర్తల మధ్య అనుమానాలు, వివాహేతర సంబంధాల వివరకు మానసిక క్రూరత్వానికి దారితీస్తున్నాయి. శోభారాణి వర్సెస్ మధుకర్ రెడ్డి వంటి కేసుల్లో సుప్రీంకోర్టు వివరించినట్లుగా, క్రూరత్వం అంటే కేవలం భౌతిక హింస మాత్రమే కాదు, ఎదుటి వ్యక్తి మనశ్శాంతిని దెబ్బతీసే ప్రతి చర్య మానసిక క్రూరత్వం కిందికే వస్తుంది. భార్య పుట్టింటి వారితో మాట్లాడకుండా అడ్డుకోవడం లేదా భర్తను నిరంతరం అనుమానించడం వంటివి కూడా ఈ పరిధిలోకి వస్తాయని కోర్టులు స్పష్టం చేస్తున్నాయి.

విడాకుల ప్రక్రియలో ఇచ్చే మనోవర్తి విషయంలో కూడా అనేక దోపిడీ ధోరణులు కనిపిస్తున్నాయి. భార్య విద్యావంతురాలు అయ్యి, సొంతంగా సంపాదించుకోగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ, కేవలం భర్తను ఆర్థికంగా దెబ్బతీయడానికి మనోవర్తిని ఒక సాధనంగా వాడుకుంటున్న సందర్భాలు పెరుగుతున్నాయి. రజనీష్ వర్సెస్ నేహా కేసులో సుప్రీంకోర్టు మనోవర్తికి సంబంధించి సమగ్రమైన మార్గదర్శకాలను విడుదల చేస్తూ, ఇరుపక్షాలు తమ ఆస్తులు మరియు ఆదాయ వివరాలను కచ్చితంగా వెల్లడించాలని ఆదేశించింది. ఇది ఒకరు మరొకరిని ఆర్థికంగా దోచుకోకుండా అడ్డుకోవడానికి తీసుకున్న చర్య. అయినప్పటికీ, కోర్టుల్లో తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేయడం, ఆదాయాన్ని తక్కువగా చూపడం వంటి ధోరణులు కొనసాగుతూనే ఉన్నాయి.

చట్టపరమైన రక్షణలు బాధితులకు అండగా ఉండాలి కానీ, అవి పగ తీర్చుకోవడానికి లేదా ఎదుటివారి జీవితాన్ని నాశనం చేయడానికి ఉపయోగపడకూడదు. భార్యాభర్తల బంధం అనేది చట్టాల మీదో, కోర్టు తీర్పుల మీదో కాకుండా పరస్పర గౌరవం మరియు సహనం మీద ఆధారపడి ఉంటుంది. ఆధునిక కాలంలో పెరిగిన వ్యక్తివాదం మరియు ఓర్పు లేకపోవడం వల్ల చిన్నపాటి మనస్పర్థలు కూడా పెద్ద వివాదాలుగా మారి కోర్టు మెట్లు ఎక్కుతున్నాయి. చట్టాలు ఎన్ని విప్లవాత్మక మార్పులు తెచ్చినా, విడిపోయిన మనసులను అవి అతికించలేవు. భార్యలు తమ హక్కులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం, భర్తలు తమ ప్రవర్తనలో క్రూరత్వం లేకుండా చూసుకోవడం ద్వారానే భారతీయ కుటుంబ వ్యవస్థ తన ప్రాభవాన్ని నిలుపుకోగలదు. న్యాయస్థానాలు కూడా ప్రతి కేసును కేవలం చట్టపరమైనదే కాకుండా, సామాజిక మరియు మానవీయ కోణంలో పరిశీలించడం నేటి అవసరం.ప్రస్తుత సమాజంలో వివాహ బంధంలో వస్తున్న విపరీత మార్పులను విశ్లేషిస్తే, గతంలో ఎన్నడూ లేని విధంగా పరస్పర ఫిర్యాదులు, వ్యక్తిగత గోప్యతపై వివాదాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య ఫోన్ కాల్స్ రికార్డ్ చేయడం లేదా ఒకరి అనుమతి లేకుండా మరొకరి వ్యక్తిగత సంభాషణలను వినడం వంటి చర్యలు రాజ్యాంగం కల్పించిన గోప్యత హక్కును భంగం కలిగిస్తున్నాయని న్యాయస్థానాలు ఇటీవల ఘాటుగా హెచ్చరిస్తున్నాయి. అనుమానమే పెనుభూతంగా మారి, డిజిటల్ సాక్ష్యాల కోసం ఒకరిపై ఒకరు గూఢచర్యం చేసుకోవడం వల్ల అనుబంధం లోని పవిత్రత నశిస్తోంది. చట్టం ప్రకారం క్రూరత్వం అంటే కేవలం కొట్టడం కాదు, భాగస్వామిపై నిరంతరం నిఘా ఉంచడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం కూడా తీవ్రమైన నేరంగా పరిగణించబడుతోంది. భర్త వేధించడం ఒక కోణమైతే, భర్తను తన తల్లిదండ్రులకు దూరం చేయాలని భార్య ఒత్తిడి చేయడం కూడా క్రూరత్వం కిందకే వస్తుందని సుప్రీంకోర్టు ఒక కీలక తీర్పులో పేర్కొంది. మరోవైపు, వైవాహిక అత్యాచారం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. భార్య సమ్మతి లేకుండా భర్త శారీరక సంబంధం పెట్టుకోవడం ఆమె హక్కులను భంగం కలిగించడమేనని పలు హైకోర్టులు అభిప్రాయపడుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా వివాహం అనేది ఒక యజమాని-బానిస సంబంధం కాదని, అది ఇద్దరు సమాన వ్యక్తుల మధ్య జరిగే ఒప్పందమని కోర్టులు నొక్కి చెబుతున్నాయి. అయితే, ఇక్కడే మరో సమస్య తలెత్తుతోంది. కొన్ని సందర్భాల్లో భార్యలు చట్టం కల్పించిన ఈ వెసులుబాటును అడ్డం పెట్టుకుని, భర్తను బ్లాక్ మెయిల్ చేయడం లేదా తప్పుడు కేసులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అమాయక పురుషులు ఇటువంటి కేసుల వల్ల సామాజికంగా భ్రష్టుపట్టి, ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలు కూడా మనం చూస్తున్నాం. దీనిని గమనించిన న్యాయస్థానాలు, ఇప్పుడు ప్రతి ఫిర్యాదును గుడ్డిగా నమ్మకుండా ప్రాథమిక విచారణను తప్పనిసరి చేస్తున్నాయి.

నేటి తరం దంపతుల్లో సహనం మరియు త్యాగం అనే గుణాలు తగ్గిపోయి, 'నేను' అనే అహం పెరిగిపోతోంది. కెరీర్, ఆర్థిక స్వేచ్ఛ మరియు వ్యక్తిగత ఆశయాల వేటలో కుటుంబం అనే పునాది కదులుతోంది. విడాకులు తీసుకోవడం అనేది ఒకప్పుడు అవమానంగా భావించేవారు, కానీ నేడు అది ఒక పరిష్కారంగా మారిపోయింది. కానీ ఈ పోరాటంలో ఎక్కువగా నలిగిపోతున్నది పిల్లలే. తల్లిదండ్రుల మధ్య జరిగే చట్టపరమైన యుద్ధాలు పిల్లల మనస్తత్వంపై పెను ప్రభావం చూపుతున్నాయి. న్యాయస్థానాలు సైతం "పిల్లల సంక్షేమమే అత్యున్నతమైనది" అని భావిస్తూ, గార్డియన్ షిప్ కేసుల్లో సున్నితంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రులు విడిపోయినా, పిల్లలకు ఇద్దరి ప్రేమ అందేలా కోర్టులు మార్గదర్శకాలు ఇస్తున్నాయి. అంతిమంగా, చట్టం కేవలం ఒక మార్గదర్శి మాత్రమే. అది భార్యాభర్తల గదిలోకి ప్రవేశించి వారి మనసులను మార్చలేదు. అనుబంధాలు నిలబడాలంటే చట్టపరమైన తీర్పుల కంటే, మానవీయ విలువలతో కూడిన సర్దుబాటు ధోరణి అత్యవసరం.కుటుంబ వ్యవస్థలో వస్తున్న మరో ప్రధాన మార్పు 'లివ్-ఇన్' సంబంధాలు. వివాహం చేసుకోకుండా కలిసి ఉండటం నేరం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినప్పటికీ, అటువంటి సంబంధాల్లో పుట్టిన పిల్లల హక్కుల విషయంలో కోర్టులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రులు పెళ్లి చేసుకోకపోయినా, వారి మధ్య ఉన్న అనుబంధం వల్ల పుట్టిన బిడ్డకు తండ్రి ఆస్తిలో మరియు సంరక్షణలో పూర్తి హక్కులు ఉంటాయని న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి. ఇది మారుతున్న సామాజిక పోకడలకు న్యాయ వ్యవస్థ ఇస్తున్న గుర్తింపు. కానీ, ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని కొందరు బాధ్యతల నుండి తప్పించుకోవాలని చూడటం సమాజానికి ఒక హెచ్చరిక. హక్కుల గురించి మాట్లాడే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను కూడా గుర్తుంచుకున్నప్పుడే న్యాయస్థానాల పరిష్కారం తగ్గుతుంది. ముగింపుగా చెప్పాలంటే, భార్యాభర్తల బంధం అనేది కేవలం చట్టపరమైన పత్రాల మీద సంతకాలతో ముడిపడి ఉన్నది కాదు; అది రెండు మనసుల నమ్మకం మరియు గౌరవం మీద ఆధారపడిన వ్యవస్థ. చట్టాలు బాధితులకు అండగా ఉండటానికి, తప్పు చేసిన వారిని శిక్షించడానికి మాత్రమే ఉపయోగపడాలి తప్ప, వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి లేదా ఎదుటివారి జీవితాన్ని చిన్నాభిన్నం చేయడానికి కాదు. న్యాయస్థానాలు ఎన్ని విప్లవాత్మక తీర్పులు ఇచ్చినా, అవి సమాజంలోని నైతిక విలువలను పునరుద్ధరించలేవు. భార్య భర్తను, భర్త భార్యను ఒక వ్యక్తిగా గౌరవించినప్పుడు మాత్రమే కోర్టు మెట్లు ఎక్కే అవసరం ఉండదు. చట్టపరమైన విజయం కంటే కుటుంబ శాంతి గొప్పదని గుర్తించినప్పుడే, మారుతున్న ఈ కాలంలో మానవ సంబంధాలు పటిష్టంగా నిలబడతాయి.

# ఆర్థిక వికాసమా? వినాశనమా?

- కరెన్సీలను ముద్రించే అధికారం ఆయా దేశాల కేంద్ర బ్యాంకులదే
- అంతర్జాతీయ డిమాండ్‌ను వాడుకుని సంక్షభ సమయాల్లో భారీగా ముద్రిస్తున్న అమెరికా
- పేదదేశాలు ఆ పనిచేస్తే ద్రవ్యోల్బణం సుడిగుండంలో చిక్కుకోవటం తథ్యం
- తద్వారా ఆర్థికంగా ఆయాదేశాలు కుప్పకూలిపోయి పతనావస్థకు చేరే ప్రమాదం



తేజస్విని
హైదరాబాద్

ప్రపంచ పటంలో ప్రతి దేశానికి తనకంటూ ఒక గుర్తింపు ఉన్నట్లే, ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సొంత కరెన్సీ ప్రాణవాయువులా పనిచేస్తుంది. కరెన్సీ అనేది కేవలం వస్తు మార్పిడికి ఉపయోగపడే సాధనం మాత్రమే కాదు, అది ఒక దేశం యొక్క ఆర్థిక శక్తికి మరియు రాజకీయ సార్వభౌమాధికారానికి ప్రతీక. భారతదేశానికి రూపాయి, బ్రిటన్‌కు పౌండ్, జపాన్‌కు యెన్ ఎలాగో.. అమెరికాకు డాలర్ అలాగే. అయితే, ఈ కరెన్సీలను ముద్రించే అధికారం ఆయా దేశాల కేంద్ర బ్యాంకుల వద్ద ఉంటుంది. ఒక దేశం ఆర్థిక సంక్షభంలో ఉన్నప్పుడు లేదా అభివృద్ధి పనుల కోసం నిధులు కావాల్సి వచ్చినప్పుడు "మరిన్ని నోట్లు ముద్రించి సమస్యను పరిష్కరించుకోవచ్చు కదా?" అనే ప్రశ్న సామాన్యుడికి రావడం సహజం. కానీ, ఈ నిర్ణయం వెనుక ఉండే ఆర్థిక సమీకరణాలు అత్యంత సంక్లిష్టమైనవి.

కరెన్సీ ముద్రణ విషయంలో ప్రపంచం రెండు వర్గాలుగా విడిపోయి కనిపిస్తుంది. ఒకవైపు అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు తమ కరెన్సీకి ఉన్న అంతర్జాతీయ డిమాండ్‌ను వాడుకుని సంక్షభ సమయాల్లో భారీగా నిధులను ముద్రిస్తుంటాయి. మరోవైపు, అభివృద్ధి చెందుతున్న మరియు పేద దేశాలు అదే పని చేస్తే, అవి ద్రవ్యోల్బణం అనే సుడిగుండంలో చిక్కుకుని ఆర్థికంగా కుప్పకూలిపోయే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, యూరోపియన్ యూనియన్ వంటి కూటమికి ఒకే కరెన్సీ (యూరో) ఉన్నప్పటికీ, అందులోని అన్ని దేశాలు తమ ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోలేవు.

**ద్రవ్యోల్బణం -కరెన్సీ ముద్రణ: జింబాబ్వే పాఠాలు :** ఆర్థికవేత్తలు ఎప్పుడూ ఒక హెచ్చరిక చేస్తుంటారు: "అవసరానికి మించి డబ్బు ముద్రించడం విషంతో సమానం". ప్రభుత్వం తన అప్పులు తీర్చుకోవడానికి విపరీతంగా నోట్లు ముద్రిస్తే, మార్కెట్లో డబ్బు ప్రవాహం పెరుగుతుంది కానీ వస్తువుల ఉత్పత్తి పెరగదు. దీనివల్ల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, కరెన్సీ విలువ సున్నాకి పడిపోతుంది. దీనినే 'హైపర్ ఇన్‌ఫ్లేషన్' అంటారు.

చరిత్రలో జింబాబ్వే (2008) ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. అక్కడి ప్రభుత్వం తన ఖర్చుల కోసం విపరీతంగా డబ్బు ముద్రించింది. ఫలితంగా ఒకానొక సమయంలో అక్కడ ద్రవ్యోల్బణం 231 మిలియన్ శాతానికి చేరుకుంది. ప్రజలు ఒక రొట్టె ముక్క కొనడానికి కూడా బస్తాల కొద్దీ డబ్బు తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఒక జింబాబ్వే డాలర్ ఉన్న వస్తువు, ఏడాది తిరిగేసరికి 23 కోట్ల డాలర్లకు చేరింది. ఇలాంటి చేదు అనుభవాల వల్లే చాలా దేశాలు డబ్బు ముద్రణ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటాయి.

**క్వాంటిటేటివ్ ఈజింగ్ : అమెరికా వ్యూహం :** 2008 ఆర్థిక మాంద్యం మరియు 2020 కోవిడ్-19 సమయంలో అమెరికా 'క్వాంటిటేటివ్ ఈజింగ్' అనే పద్ధతిని వాడింది. ఇది ఒక రకమైన నియంత్రిత కరెన్సీ ముద్రణ. ఫెడరల్ రిజర్వ్ ట్రిలియన్ల డాలర్లను సృష్టించి, వాటితో ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేస్తుంది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలోకి నగదు ప్రవాహం పెరుగుతుంది.

అమెరికా కోవిడ్ సమయంలో సుమారు 3 ట్రిలియన్ డాలర్లను ఇలాగే సృష్టించింది. తనపౌరులకు ఉద్దీపన ప్యాకేజీల రూపంలో నేరుగా డబ్బులు పంపిణీ చేసింది. అమెరికా ఇలా చేయగలిగింది ఎందుకంటే డాలర్ అనేది ప్రపంచ రిజర్వ్ కరెన్సీ. ప్రపంచవ్యాప్తంగా 60% పైగా వ్యాపారం డాలర్లలోనే జరుగుతుంది. కాబట్టి అమెరికా ముద్రించిన అదనపు డాలర్లను ప్రపంచ మార్కెట్ సులభంగా స్వీకరించగలిగింది.

**యూరోపియన్ యూనియన్ - యూరో :** యూరోపియన్ యూనియన్ కథ కొంచెం భిన్నంగా ఉంటుంది. యూరో అనేది 20 దేశాలకు ఉమ్మడి కరెన్సీ. ఇక్కడ ఒక దేశం సంక్షభంలో ఉంటే (ఉదాహరణకు గ్రీస్), ఆ దేశం తన ఇష్టానుసారం యూరోలను ముద్రించలేదు. దీనిని నియంత్రించేది 'యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్' (ఈసిబి ).

2015లో ఈసిబి నెలకు 60 బిలియన్ యూరోలను ముద్రించి ఆర్థిక వ్యవస్థను ఉద్దీపన చేయాలని ప్రయత్నించింది. కానీ ఆశ్చర్యకరంగా ఇది అమెరికాలో లాగా పని చేయలేదు. జర్మనీ వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు ఉన్నప్పటికీ, యూరప్‌లోని ఇతర చిన్న దేశాల ఆర్థిక పరిస్థితులు భిన్నంగా ఉండటం వల్ల ఆ డబ్బు ఆశించిన స్థాయిలో ఖర్చు కాలేదు. దీంతో వృద్ధి రేటు పెరగకపోగా, డబ్బులు బ్యాంకుల వద్దే ఉండిపోయాయి.

**రుణ భారం -జీడీపీ నిష్పత్తి :**

ఒక దేశం ఆర్థిక శక్తిని కొలవడానికి ఆ దేశపు అప్పుకు మరియు దాని జీడీపీకి ఉన్న నిష్పత్తిని చూస్తారు. సాధారణంగా ఇది 100% మించితే ప్రమాదకరమని భావిస్తారు. కానీ ఇక్కడ కూడా నిబంధనలు దేశాన్ని బట్టి మారుతున్నాయి.

అమెరికా: దీని అప్పు జీడీపీలో 124.9% (2021 నాటికి). అయినా అమెరికా ఆర్థిక వ్యవస్థ కూలిపోలేదు. ఎందుకంటే అది తన అప్పును తన సొంత కరెన్సీ (డాలర్) లోనే తీర్చగలదు.

బంగ్లాదేశ్: దీని అప్పు కేవలం 20.8% మాత్రమే. అయినప్పటికీ అది శ్రీలంక వంటి పరిస్థితి వస్తుందేమోనని భయపడుతోంది. ఎందుకంటే బంగ్లాదేశ్ తన అంతర్జాతీయ అప్పులను డాలర్లలో చెల్లించాలి. డాలర్లు కావాలంటే ఆ దేశం ఎగుమతులు చేయాలి లేదా విదేశీ పెట్టుబడులు ఆకర్షించాలి. అంటే కరెన్సీ ముద్రించి అంతర్జాతీయ అప్పులు తీర్చే అవకాశం వీరికి లేదు.

**డీ-డాలరైజేషన్: ప్రపంచంలో వస్తున్న మార్పు :** అమెరికా తన డాలర్ శక్తిని ఆయుధంగా వాడుతూ ఇతర దేశాలపై ఆంక్షలు విధిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచ దేశాలు ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఇది మరింత వేగవంతమైంది.చైనా, రష్యా: తమ మధ్య జరిగే వాణిజ్యాన్ని యువాన్ మరియు రూబుల్స్ లో జరుపుకుంటున్నాయి.

భారత్: యూఏఈ మరియు ఇతర ఆగ్నేయాసియా దేశాలతో రూపాయిలోనే వాణిజ్యం చేయడానికి ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.

బంగారం నిల్వలు: ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు డాలర్లను తగ్గించుకుని, బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. 2022లో బ్యాంకులు రికార్డు స్థాయిలో సుమారు 400 టన్నుల బంగారాన్ని కొన్నాయి.

ఖచ్చితంగా, భారతదేశానికి సంబంధించి కరెన్సీ ముద్రణ, ఆర్థిక వ్యూహాలు మరియు రూపాయి ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ప్రత్యేకంగా రూపొందించిన వ్యాసం ఇక్కడ ఉంది:

**భారతదేశం** : : ప్రపంచంలోని ఇతర దేశాల వలె భారతదేశం తన సొంత కరెన్సీ అయిన రూపాయిని ముద్రించే అధికారాన్ని కలిగి ఉంది. అయితే, భారతదేశం అమెరికా వలె ఇష్టానుసారంగా డబ్బును ముద్రించదు.

భారతదేశం డబ్బును ఎలా ముద్రిస్తుంది?

భారతదేశంలో కరెన్సీ ముద్రణను భారత రిజర్వ్ బ్యాంక్ నియంత్రిస్తుంది. మన దేశంలో డబ్బు ముద్రణ అనేది కేవలం ఒక యంత్రం ద్వారా జరిగే పని కాదు; దీనికి ఒక శాస్త్రీయ పద్ధతి ఉంటుంది.

కనీస నిల్వల పద్ధతి: భారత రిజర్వ్ బ్యాంక్ ఒక నిర్దిష్ట పరిమితి వరకు కరెన్సీని ముద్రించడానికి తన వద్ద ఎల్లప్పుడూ కనీసం 200 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కలిగి ఉండాలి. ఇందులో 115 కోట్లు బంగారం రూపంలో, మిగిలిన 85 కోట్లు విదేశీ కరెన్సీల రూపంలో ఉండాలి.

ఆర్థిక వృద్ధికి అనుగుణంగా: దేశంలో వస్తువుల ఉత్పత్తి మరియు సేవలు (జీడీపీ) ఎంత పెరుగుతున్నాయో దానికి అనుగుణంగానే కొత్త నోట్లను ముద్రిస్తారు. ఒకవేళ వస్తువులు తక్కువగా ఉండి, ప్రభుత్వం కేవలం నోట్లను ఎక్కువగా ముద్రిస్తే మన దేశంలో ద్రవ్యోల్బణం పెరిగి రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది.

**సంక్షభ సమయంలో భారత్ ఎందుకు డబ్బు ముద్రించదు?:** ఆర్థిక మందగమనం లేదా కోవిడ్ వంటి సంక్షభాలు వచ్చినప్పుడు, సామాన్యులు "ప్రభుత్వం నోట్లు ముద్రించి అందరికీ పంచవచ్చు కదా?" అని ఆలోచిస్తారు. కానీ భారత్ వంటి దేశాలకు ఇది ప్రమాదకరం.

**రూపాయి విలువ పతనం**: మనం విపరీతంగా నోట్లు ముద్రిస్తే, అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ తగ్గిపోతుంది. దీనివల్ల మనం విదేశాల నుండి కొనుగోలు చేసే పెట్రోల్, డీజిల్ మరియు గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతాయి.

**విదేశీ అప్పుల భారం:** భారతదేశం చేసే అంతర్జాతీయ అప్పులు డాలర్లలో ఉంటాయి. మనం రూపాయిలను ఎక్కువగా ముద్రిస్తే రూపాయి బలహీనపడి, మనం కట్టాల్సిన అప్పు భారం మరింత పెరుగుతుంది.

**రూపాయి అంతర్జాతీయీకరణ (డీ-డాలరైజేషన్) :** ప్రస్తుతం భారతదేశం డాలర్‌పై తన ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి సరికొత్త వ్యూహాలను అమలు చేస్తోంది.

**స్థానిక కరెన్సీలో వాణిజ్యం:** రష్యా, యూఏఈ మరియు మరికొన్ని ఆగ్నేయాసియా దేశాలతో భారత్ నేరుగా రూపాయిల్లోనే వాణిజ్యం చేయడానికి ఒప్పందాలు చేసుకుంది. అంటే మనం విదేశాల నుండి చమురు కొన్నప్పుడు డాలర్లకు బదులుగా రూపాయలను చెల్లించవచ్చు.

**డిజిటల్ రూపాయి:** భారత రిజర్వ్ బ్యాంక్ 'సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ'ని ప్రవేశపెట్టింది. ఇది భౌతిక నోట్ల ముద్రణ ఖర్చును తగ్గించడమే కాకుండా, అంతర్జాతీయ లావాదేవీలను సులభతరం చేస్తుంది.

**ప్రధాన వ్యూహం :** విదేశీ మారక నిల్వలను పెంచడం మరియు దిగుమతులను తగ్గించడం

**యుద్ధాలు- కరెన్సీ ముద్రణ :** అమెరికా తన సైనిక అవసరాల కోసం మరియు మధ్యప్రాచ్యంలో చేసిన యుద్ధాల కోసం అపరిమితంగా నిధులను ఎలా ఖర్చు చేయగలుగుతోంది? అనే ప్రశ్నకు సమాధానం 'మనీ ప్రింటింగ్' లోనే ఉంది. యుద్ధ వ్యయం పెరిగినప్పుడు పన్నులు పెంచడం ప్రజా వ్యతిరేకతకు దారితీస్తుంది. కాబట్టి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ అదనపు నగదును సృష్టించి ప్రభుత్వం జారీ చేసే బాండ్లను కొనుగోలు చేస్తుంది.

దీని వల్ల అమెరికా తన సరిహద్దులకు ఆవల కూడా అపారమైన ప్రభావాన్ని చూపగలుగుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇలాంటి యుద్ధాలు చేయాలంటే భారీగా అప్పులు చేయాల్సి వస్తుంది, కానీ అమెరికా మాత్రం తన కరెన్సీకి ఉన్న గ్లోబల్ డిమాండ్‌ను అడ్డం పెట్టుకుని ఈ ఖర్చును ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేస్తుంది. అంటే, డాలర్ విలువ తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని డాలర్లను నిల్వ ఉంచుకున్న అన్ని దేశాలు పంచుకుంటాయి.

| భారత ఆర్థిక గణాంకాల పట్టిక | |
|---|---|
| అంశం | ప్రస్తుత స్థితి |
| అప్పు-జీడీపీ నిష్పత్తి | సుమారు 80% నుండి 85% వరకు |
| కరెన్సీ నియంత్రణ | భారత రిజర్వ్ బ్యాంక్ ద్వారా |
| ద్రవ్యోల్బణ లక్ష్యం | సాధారణంగా 4% నుండి 6% మధ్య ఉంచడం |

**బ్రిటన్ అనుసరించిన విధానం :** అమెరికా లాగే బ్రిటన్ కూడా కోవిడ్ సమయంలో భారీగా నిధులను ముద్రించింది. బ్రిటన్ అనుసరించిన కొన్ని పథకాలు ఇక్కడ గమనించదగ్గవి:

**ఫర్లో స్కీమ్ :** దీని కోసం బ్రిటన్ సుమారు 70 బిలియన్ పౌండ్లను వెచ్చించింది. ఉద్యోగులు పని చేయలేకపోయినా వారికి వేతనాలు అందేలా చూసింది.

ఈట్ అవుట్ టు హెల్ప్ అవుట్ : రెస్టారెంట్ రంగాన్ని ఆదుకోవడానికి సుమారు 849 మిలియన్ పౌండ్లను ఖర్చు చేసి, ప్రజలకు రాయితీలు ఇచ్చింది. అయితే, ఈ చర్యల ఫలితంగా 2022 నాటికి బ్రిటన్ ద్రవ్యోల్బణం 9% కి చేరుకుంది. ఇది అమెరికా కంటే కూడా ఎక్కువ. అంటే, ఎంతటి బలమైన ఆర్థిక వ్యవస్థకైనా అపరిమితంగా డబ్బు ముద్రించడం అనేది చివరకు ధరల పెరుగుదలకే దారితీస్తుందని బ్రిటన్ పరిస్థితి నిరూపించింది.

**బంగ్లాదేశ్ వర్సెస్ అమెరికా:** ఆర్థిక వ్యవస్థలో గణాంకాల కంటే "నమ్మకం" అనేది అత్యంత శక్తివంతమైనది. ఒక దేశం ఎంత అప్పు చేసినా, ఆ అప్పును తిరిగి తీర్చగలదు అనే భరోసా ప్రపంచానికి ఉంటే, ఆ దేశం ఆర్థికంగా సురక్షితంగా ఉన్నట్లే లెక్క. ఇక్కడే అమెరికాకు, బంగ్లాదేశ్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తుంది. 2021 గణాంకాల ప్రకారం అమెరికా యొక్క అప్పు-జీడీపీ నిష్పత్తి 124.9% కి చేరుకుంది. ఇది ప్రమాదకర స్థాయిని దాటినా కూడా అమెరికా ఆర్థిక వ్యవస్థ పతనం అయ్యే సూచనలు కనిపించలేదు. ఎందుకంటే డాలర్ అనేది ప్రపంచ కరెన్సీ, దానిపై ప్రపంచ దేశాలకు మరియు పెట్టుబడిదారులకు తిరుగులేని నమ్మకం ఉంది. మరోవైపు, బంగ్లాదేశ్ వంటి దేశాలు తమ అప్పు-జీడీపీ నిష్పత్తి కేవలం 20.8% ఉన్నప్పటికీ, శ్రీలంక వంటి ఆర్థిక సంక్షోభం ఎదురవుతుందేమోనని నిత్యం ఆందోళన చెందుతుంటాయి. దీనికి కారణం, అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉండదు. ఒకవేళ ఆ దేశంలో చిన్న రాజకీయ లేదా ఆర్థిక అస్థిరత ఏర్పడితే, విదేశీ పెట్టుబడిదారులు వెంటనే తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటారు. దీనివల్ల ఆ దేశ కరెన్సీ విలువ ఒక్కసారిగా పడిపోయి, దిగుమతులు ప్రియమై, విదేశీ నిల్వలు హరించుకు పోతాయి. ఫలితంగా దేశం ఆర్థికంగా కుప్పకూలిపోతుంది. అమెరికాకు తన సొంత కరెన్సీని ముద్రించుకునే లగ్జరీ ఉంది, కానీ బంగ్లాదేశ్ వంటి దేశాలు అంతర్జాతీయ అప్పులు తీర్చాలన్నా, పెట్రోల్ కొనాలన్నా డాలర్లను సంపాదించాల్సిందే తప్ప ముద్రించలేవు.

కరెన్సీ ముద్రణ అనేది ఏ దేశానికైనా ఒక శక్తివంతమైన ఆర్థిక అస్త్రం మాత్రమే కాదు, అది అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన బాధ్యత కూడా. అమెరికా వంటి దేశాలు తమకున్న భౌగోళిక రాజకీయ బలం మరియు డాలర్ పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకం వల్ల సంక్షభ సమయాల్లో భారీగా నిధులను ముద్రించి బయటపడగలుగుతున్నాయి. దీనినే "అపరిమితమైన ప్రత్యేక హక్కు" అని పిలుస్తారు. కానీ, అదే సమయంలో జింబాబ్వే లేదా శ్రీలంక వంటి దేశాల అనుభవాలు మనకు ఒక చేదు నిజాన్ని గుర్తుచేస్తున్నాయి: దేశ ఆర్థిక ఉత్పాదకతను (జీడీపీ) పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం నోట్లను ముద్రిస్తూ పోతే అది దేశాన్ని దారిద్ర్యంలోకి మరియు వినాశకరమైన ధరల పెరుగుదలకే దారి తీస్తుంది.

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక కీలక మార్పు మొదలైంది. అమెరికా తన డాలర్ శక్తిని ఇతర దేశాలపై ఆంక్షలు విధించడానికి వాడుతుండటంతో, భారత్, చైనా మరియు రష్యా వంటి దేశాలు ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నాయి. డాలర్ ఆధిపత్యం క్రమంగా తగ్గుతూ, దేశాలు తమ సొంత కరెన్సీలలో వాణిజ్యం చేసుకోవడం పెరిగితే, అమెరికా కూడా భవిష్యత్తులో తన ఇష్టానుసారం నోట్లను ముద్రించలేకపోవచ్చు. చివరికి ఒక దేశం యొక్క ఆర్థిక సుస్థిరత అనేది ఆ దేశం ముద్రించే నోట్ల సంఖ్యపై కాకుండా, ఆ దేశం చేసే ఉత్పత్తి, ఎగుమతులు మరియు పాటించే ఆర్థిక క్రమశిక్షణపైనే ఆధారపడి ఉంటుంది.

# సంజయ్ నగర్ నుంచి కోట వరకు.. చర్చంతా రిజర్వేషన్ల పైనే!

ఫిరోజ్ ఖాన్,
9640466464

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ క్షేత్రం రణరంగంగా మారింది. ఆదిలాబాద్‌లోని సంజయ్ నగర్ గల్లీల నుంచి చారిత్రక కోట ప్రాంతం వరకు ఇప్పుడు ఎక్కడ చూసినా 'రిజర్వేషన్ల' చిక్కుముడిపైనే ఉత్కంఠ సాగుతోంది. ఈ నెల 12న విడుదల కానున్న తుది ఓటర్ల జాబితా అభ్యర్థుల జాతకాలను తేల్చనుంది. ముఖ్యంగా గత ఎన్నికల రిజర్వేషన్లను పక్కన పెట్టి, ఈసారి 'రొటేషన్' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుండటంతో సిట్టింగ్ కౌన్సిలర్ల వెన్నులో వణుకు మొదలైంది. ఏ వార్డు ఎవరికి కేటాయిస్తారో తెలియక, ప్రచారానికి వెళ్లాలో లేదో అర్థం కాక ఆశావహులు తలలు పట్టుకుంటున్నారు. ఇది కేవలం ఎన్నికల ప్రక్రియ మాత్రమే కాదు, క్షేత్రస్థాయి నాయకుల రాజకీయ మనుగడను నిర్ణయించే చావోరేవో తేల్చుకోవాల్సిన కీలక ఘట్టం.

**ఆశావహుల్లో మొదలైన వణుకు :** పారదర్శకతకు పెద్దపీట మున్సిపల్ రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ రాజ్యాంగబద్ధమైన 73, 74వ సవరణలకు అనుగుణంగా అత్యంత పకడ్బందీగా జరగనుంది. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఎస్సీ, ఎస్టీ మరియు బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వార్డుల వారీగా జనాభా దామాషా పద్ధతిని అనుసరిస్తూనే, 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించడం ద్వారా సామాజిక సమతుల్యతను కాపాడనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం రొటేషన్ పద్ధతిని పాటిస్తే, గతంలో జనరల్ కేటగిరీలో ఉన్న స్థానాలు ఈసారి బీసీ లేదా మహిళా కోటాలోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ సాంకేతిక మార్పులే రాజకీయ పార్టీల వ్యూహాలను తలకిందులు చేస్తున్నాయి, పాత రిజర్వేషన్లనే నమ్ముకున్న నేతలకు ఇప్పుడు దిక్కుతోచని స్థితి ఏర్పడింది.

**ఎమ్మెల్యేలకు సీఎం అల్టిమేటం :** అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 'గాంధీభవన్' వేదికగా వ్యూహరచన చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసారి అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు; మున్సిపల్ గెలుపు బాధ్యతను నేరుగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు అప్పగించి వారి పనితీరుకు 'ర్యాంకులు' కేటాయించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీని మున్సిపల్ వార్డుల్లో నిలబెట్టుకోలేకపోతే భవిష్యత్తులో టికెట్లు, పదవులపై ఆశలు వదులుకోవాల్సిందేనని సీఎం తేల్చిచెప్పారు. 'గల్లీ ప్రచారం కాదు.. ఇంటింటి ప్రచారం' అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ 'ర్యాంకింగ్ సిస్టమ్' ఎమ్మెల్యేల్లో కొత్త టెన్షన్‌ను నింపింది, గెలుపు కోసం వారు సర్వశక్తులు ఒడ్డాల్సిన పరిస్థితి నెలకొంది.

**కేంద్రంపై కాంగ్రెస్ యుద్ధం:** ఉపాధి హామీ చట్టం మార్పుపై పోరు మున్సిపల్ ఎన్నికల వేళ కేంద్రం తీసుకొచ్చిన వీబీజీ రామ్ జీ చట్టం (ఉపాధి హామీ మార్పులు) కాంగ్రెస్ పార్టీకి కొత్త ఆయుధంగా మారింది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉనికిని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తోందని, ఇది కూలీల పొట్ట కొట్టే చర్య అని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ అంశంపై ఫిబ్రవరి 2 నుంచి తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర విపక్షలను ఎండగట్టాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సమస్యలతో పాటు జాతీయ స్థాయి అంశాలను ప్రచారంలోకి తీసుకురావడం ద్వారా ఓటర్లను ఆకర్షించాలని భావిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలు చేసే అసత్య ఆరోపణలను సాక్ష్యాధారాలతో సహా తిప్పికొట్టేందుకు సోనియా, రాహుల్ గాంధీలను సైతం బహిరంగ సభలకు ఆహ్వానించడం రాజకీయ వేడిని పెంచుతోంది.

**విపక్షల వ్యూహ ప్రతివ్యూహాలు :** రసవత్తరంగా మారిన రాజకీయం మున్సిపల్ పోరులో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు సైతం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతు రుణమాఫీ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్నాయి. ఏపీ అక్రమ నీటి ప్రాజెక్టుల విషయంలో రేవంత్ సర్కారు మౌనాన్ని బీఆర్ఎస్ అగ్రనేతలు ఆయుధంగా మలుచుకుంటున్నారు. గత అసెంబ్లీ ఫలితాలను




తిరగరాయాలని బీజేపీ కమలనాథులు తహతహలాడుతున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ తర్వాత రాజకీయ వాతావరణం పీక్ స్టేజ్‌కి చేరుకోనుంది. సామాజిక మాధ్యమాల వేదికగా సాగుతున్న అసత్య ప్రచారాలను అడ్డుకుంటూనే, ఓటర్ల నాడిని పట్టేందుకు ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. గెలుపు ఎవరిని వరిస్తుందో తెలియని ఉత్కంఠ ప్రతి వార్డులోనూ కనిపిస్తోంది.

**పట్టణ అభివృద్ధికి దిక్సూచి** మున్సిపల్ ఎన్నికలు కేవలం పదవుల పంపకం కాదు, ఇది పట్టణాల భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రక్రియ. రిజర్వేషన్ల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, చట్టబద్ధంగా అర్హులైన వారికి అవకాశం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యానికి సార్థకత లభిస్తుంది. ఎమ్మెల్యేల ర్యాంకులు, పార్టీ పదవుల కంటే స్థానిక సమస్యల పరిష్కారమే పరమావధిగా అభ్యర్థులు పనిచేయాలి. అభివృద్ధి పథకాలు, సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయి పేదలకు అందుతున్నాయా లేదా అనేదే ఎన్నికల అసలు ఎజెండా కావాలి. ఓటర్లు సైతం ప్రలోభాలకు లోనుకాకుండా, వార్డు అభివృద్ధిని కాంక్షించే నాయకులకే పట్టం కట్టాలి. తెలంగాణ రాజకీయాల్లో పెనుమార్పులకు సంకేతంగా నిలిచే ఈ పురపోరులో అంతిమంగా ప్రజాస్వామ్యమే గెలవాలి. ఎందుకంటే, ప్రజల తీర్పే శిరోధార్యం.

## హిందీ భాషలో తియ్యదనాన్ని ఆస్వాదించలేమా !

మొదటి 'ప్రపంచ హిందీ సమావేశం' నాగ్‌పూర్‌లో 10 జనవరి 1975న జరిగింది. ఈ ముఖ్యమైన సంఘటనను గుర్తుచేసుకునేందుకు, భారత ప్రభుత్వం 2006 నుండి ప్రతి సంవత్సరం జనవరి 10న 'ప్రపంచ హిందీ దినోత్సవం'ను నిర్వహించాలని నిర్ణయించింది, ఇది ప్రపంచ వేదికలలో హిందీ భాషను ప్రోత్సహించడానికి, గౌరవించడానికి ఉద్దేశించబడింది. ఈ రోజు హిందీ యొక్క సాంస్కృతిక, భాషా ప్రాముఖ్యతను కూడా నొక్కి చెబుతుంది. ఇది ఇంగ్లీష్, మాండరిన్ చైనీస్ తర్వాత ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో 3వది. గొప్ప సాంస్కృతిక వారసత్వం గురించి అవగాహన కల్పించడానికి, విద్య, పాలన మరియు మీడియాతో సహా వివిధ రంగాలలో దాని వాడకాన్ని ప్రోత్సహించడానికి ఈ వేదికను ఉపయోగించవచ్చు. ఈ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా హిందీ మాట్లాడే సమాజాల మధ్య ఐక్యతను పెంపొందించగలవు. ప్రపంచ హిందీ దివస్-2026 యొక్క ఇతివృత్తంగా "హిందీ: సాంప్రదాయ విజ్ఞానం నుంచి కృత్రిమ మేధ వరకు" అనబడే థీమ్ ఈ డిజిటల్ యుగంలో హిందీ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది, సాంకేతికత ప్రపంచ ప్రేక్షకులకు దాని పరిధిని ఎలా విస్తరించిందో చూపిస్తుంది.



**అత్యధికంగా మాట్లాడే 3వ ప్రపంచ భాష - హిందీ:** ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలు ఇంగ్లీష్ (1,456 మిలియన్లు), మాండరిన్ చైనీస్ (1,138 మిలియన్లు), హిందీ (610 మిలియన్లు) స్పానిష్ (559 మిలియన్లు), ఫ్రెంచ్ (309 మిలియన్లు, అరబిక్ (274 మిలియన్లు), బెంగాలీ (273 మిలియన్లు) మరియు రష్యన్ (255 మిలియన్లు). ఇండో-యూరోపియన్ భాషా కుటుంబంలో ఇండో-ఆర్యన్ సమూహంలో సభ్యుడైనా హిందీ భాష. దక్షిణాఫ్రికా, మారిషస్, యెమెన్, ఫిజి, అమెరికా, ఉగాండాలో కూడా హిందీ మాట్లాడే ముఖ్యమైన సంఘాలు కనిపిస్తాయి. హిందీ భాష దేవనాగరి లిపిలో వ్రాయబడింది, సంస్కృతం ద్వారా బలంగా ప్రభావితమైంది. హిందీ భాష భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాషగా విస్తృతంగా గుర్తించబడింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశం యొక్క ప్రధాన భాషగా పరిగణించబడుతుంది. ప్రపంచంలోని దాదాపు 4.46 శాతం మంది ప్రజలు హిందీ మాట్లాడతారు. హిందీలో దాదాపు 16 మాండలికాలు, భారతదేశంలో దాదాపు 528 మిలియన్ల మంది స్థానికంగా మాట్లాడే ప్రజలు ఉన్నారు, ఇది భారతదేశ మొత్తం జనాభాలో 43 శాతం అని గమనించాలి. ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహించడంలో ప్రధాన ఉద్దేశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు, సాంస్కృతిక పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అంతర్జాతీయ ఐక్యత అని తెలుసుకోవాలి. ఈ రోజు వేదికగా తీసుకోవలసిన కార్యకలాపాల్లో సాహిత్య పోటీలు, విద్యా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మీడియా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 1949లో భారతదేశ అధికారిక భాషలలో ఒకటిగా హిందీని స్వీకరించిన జ్ఞాపకార్థం ఏటా సెప్టెంబర్ 14ని "జాతీయ హిందీ దినోత్సవం"గా కూడా జరుపుకుంటామని తెలుసుకోవాలి.

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి 9949700037

# బిజినెస్

## నీరు భారత వృద్ధికి కొత్త బంగారం



భారతదేశంలో రాబోయే ఆర్థిక వృద్ధిని పెట్టుబడులు కాదు, నీరే నిర్ణయిస్తుందని హైదరాబాద్‌కు చెందిన కేఈపీ ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ మాలు కాంబ్లే అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న పరిశ్రమల అవసరాలు, నీటి కొరత కారణంగా నీటి భద్రత పరిశ్రమల పోటీ సామర్థ్యం, పట్టణ స్థిరత్వం, స్థిరమైన అభివృద్ధికి కీలకమవుతుందని తెలిపారు. శుద్ధి చేసిన మురుగునీటిని మళ్లీ వినియోగించాల్సిన నిబంధనలు పరిశ్రమలకు తప్పనిసరిగా మారాయని, ఇది కేవలం పర్యావరణ బాధ్యత కాక వ్యాపార అవసరమని చెప్పారు. నదుల్లోకి నీటిని వదలడం కాకుండా పరిశ్రమలు, నిర్మాణం, సాగు వంటి రంగాల్లో పునర్వినియోగం చేయాలని సూచించారు. కేఈపీ ఇంజినీరింగ్ ఆధునిక ద్రవ వ్యర్థ నిర్వహణ సాంకేతికతలతో అనేక రంగాలకు సేవలందిస్తూ, నీటి పునర్వినియోగం ద్వారా ఖర్చులు తగ్గించి పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.

### మకర సంక్రాంతి పండుగకు పోషక విలువల కొత్త ఉత్సాహం



మకర సంక్రాంతి భారతదేశమంతటా కొత్త పంటలు, పొడవైన పగళ్లు, ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగగా నిలుస్తూ, పోషకాహారాన్ని పండుగ వంటకాలతో మేళవించుకునే అవకాశాన్ని ఇస్తుంది. పొంగల్, లోహ్రీ, ఉత్తరాయణ్, మాఘ్ బీహు వంటి రూపాల్లో జరుపుకునే ఈ పండుగలో కాలిఫోర్నియా బాదంలను వంటల్లో చేర్చడం ద్వారా ఆరోగ్యాన్ని కూడా సంరక్షించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. బాదంలు శక్తి, రోగనిరోధక శక్తి, దీర్ఘకాల ఉత్సాహాన్ని అందించడంతో పాటు ఆయుర్వేదంలో శరీర బలాన్ని, ఓజస్సును పెంపొందించే ఆహారంగా గుర్తింపు పొందాయి. లడ్డూలు, చట్నీలు, పండుగ వంటకాల్లో లేదా నేరుగా తీసుకున్నా, బాదంలు రుచితో పాటు పోషణను పెంచుతాయని పోషకాహార నిపుణులు, ఆయుర్వేద వైద్యులు, సినీనటి సోహా అలీ ఖాన్ కూడా తెలిపారు. సంప్రదాయం, ఆధునిక పోషక విజ్ఞానాన్ని కలిపి, మకర సంక్రాంతిని ఆరోగ్యకరంగా, ఆనందంగా జరుపుకోవడానికి బాదంలు సహజమైన మార్గమని ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

### జల సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ సిమెంట్ కర్మాగారానికి గౌరవం




ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రి వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ సిమెంట్ కర్మాగారం కరవు ప్రభావిత అనంతపురం, నంద్యాల జిల్లాల్లో చేపట్టిన సమర్థవంతమైన జల సంరక్షణ కార్యక్రమాలకు గాను భారత వాణిజ్య పరిశ్రమల మండలి జల నాయకత్వ సదస్సు రెండువేల ఇరవై ఐదులో గౌరవించబడింది. తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలతో బాధపడుతున్న ఈ ప్రాంతాల్లో జల సంరక్షణ కట్టడాలు, వర్షపు నీటి నిల్వలు, శుద్ధి నీటి కేంద్రాలు, మట్టి ఆరోగ్య సలహాలు, మహిళలకు జీవనోపాధి శిక్షణ వంటి కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా నీటి లభ్యత పెరిగి, పంట దిగుబడులు గణనీయంగా మెరుగుపడి, భూగర్భ జల మట్టాలు పెరిగాయి. రైతులు, మహిళలు, వ్యవసాయ భూములకు ప్రత్యక్ష లాభం చేకూర్చిన ఈ కార్యక్రమాలు స్థానిక సమాజాల స్థిరత్వాన్ని పెంపొందించడంతో పాటు నీటి సంరక్షణపై అవగాహనను బలోపేతం చేశాయి. ఈ విజయాలు సంస్థ సమాజాభివృద్ధి, జల వనరుల పరిరక్షణ పట్ల ఉన్న దీర్ఘకాల నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

### క్రికెట్ అనుభవానికి కొత్త ప్రయాణ భాగస్వామ్యం




ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు ప్రత్యేకమైన అనుభవాలను అందించేందుకు మారియట్ బోన్వాయ్ మరియు అంతర్జాతీయ క్రికెట్ మండలి దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా రాబోయే పలు అంతర్జాతీయ క్రికెట్ టోర్నీలకు మారియట్ బోన్వాయ్ అధికారిక వసతి భాగస్వామిగా వ్యవహరించనుంది. భారతదేశం సహా అనేక దేశాల్లో జరిగే ప్రపంచ స్థాయి క్రికెట్ పోటీల సమయంలో అభిమానులు, జట్లు మారియట్ హోటళ్లలో ఉండే అవకాశాన్ని పొందడంతో పాటు ప్రత్యేక ప్రయాణ, ఆతిథ్య అనుభవాలను ఆస్వాదించగలుగుతారు. ఈ భాగస్వామ్యం క్రికెట్‌పై ఉన్న కోట్లాది అభిమానుల ప్రేమను ప్రయాణం, ఆతిథ్యంతో మేళవిస్తూ, క్రీడా అనుభూతిని మైదానం దాటి జీవనశైలిగా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

### గ్రో మ్యూచువల్ ఫండ్ చిన్న కంపెనీల నూతన పథకం




గ్రో మ్యూచువల్ ఫండ్ చిన్న స్థాయి కంపెనీలలో పెట్టుబడుల కోసం గ్రో స్మాల్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ పథకం నాణ్యత, సమంజసమైన ధర వద్ద వృద్ధి అనే పెట్టుబడి విధానాన్ని ఆధారంగా చేసుకుని, బలమైన వ్యాపార నమూనాలు మరియు దీర్ఘకాల వృద్ధి సామర్థ్యం ఉన్న చిన్న కంపెనీలను ఎంపిక చేస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విస్తరణ, రుణ లభ్యత పెరుగుదల వల్ల చిన్న సంస్థలకు కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. విశ్లేషకుల కవరేజ్ తక్కువగా ఉండటం వల్ల పరిశోధన ఆధారిత పెట్టుబడిదారులకు ముందుగానే మంచి సంస్థలను గుర్తించే అవకాశం కలుగుతుంది. దీర్ఘకాల పెట్టుబడి దృష్టి కలిగి, తాత్కాలిక ఒడిదుడుకులను భరించగల పెట్టుబడిదారులకు ఈ పథకం అనుకూలంగా ఉండి, పెద్ద మరియు మధ్య స్థాయి పెట్టుబడులకు తోడుగా చిన్న కంపెనీల రంగంలో భాగస్వామ్యం కల్పిస్తుంది.

## అథర్ ఎనర్జీ 5000+ వేగవంతమైన చార్జర్లు

అథర్ ఎనర్జీ రైడర్స్ భారత్‌లో 5000కంటే ఎక్కువ పబ్లిక్ ఫాస్ట్ చార్జర్లకు యాక్సెస్ పొందుతున్నారు, వీటిలో 3,675 చార్జర్లు నేరుగా అథర్ చేత నడిపించబడుతూ, 1,400 చార్జర్లు భాగస్వామ్య నెట్‌వర్క్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. ఈ చార్జర్లు 395ం నగరాలపై విస్తరించి, మెట్రోలు, టియర్ 2, టియర్ 3 నగరాలు, అంతరనగర మార్గాల్లో ఏర్పాటు చేయబడ్డాయి. అథర్ రూపొందించిన లెసిసిఎస్ కనెక్టర్ 2-మూడ్ వీలర్‌ల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేయబడింది, 2023-24లో బిఐఎస్ ప్రమాణాలు పొందింది, మరియు హీరో విడా, మ్యాటర్ వంటి ఓఈఎంలు, బోల్ట్.ఎర్త్, కజామ్, ఈవాంప్ వంటి చార్జ్ పాయింట్ ఆపరేటర్ల ద్వారా విస్తృతంగా దత్తత పొందింది. గూగుల్ మ్యాప్స్‌లో చార్జర్లు కనిపించడం ద్వారా యజమానులు ఎక్కడైనా సులభంగా చార్జ్ చేసుకోవచ్చు, దీని వల్ల ఎలక్ట్రిక్ వాహనాల యజమాన అనుభవం మరింత సౌకర్యవంతం అవుతుంది.

## చిన్న స్టాక్ బ్రోకర్లకు సెబీ సడలింపు ప్రకటించింది



సెబీ తక్కువ పరిమాణ క్లయింట్లు కలిగిన స్టాక్ బ్రోకర్ల కోసం సడలింపు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ప్రకారం, చిన్న బ్రోకర్ల ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ వ్యవస్థలలో సాంకేతిక లోపాలు తలెత్తినా, అన్ని నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం లేదు. నిబంధనలను సరళతరం చేయడం, జరిమానాలను తగ్గించడం, మరియు చిన్న బ్రోకర్లను కొన్ని నియమాల నుండి మినహాయించడం ద్వారా వారి వ్యాపారాన్ని సులభతరం చేయడమే లక్ష్యం.

సవరించిన నియమావళి ప్రకారం, బ్రోకర్ నియంత్రణలో లేని లోపాల కారణంగా వారి మీద ఏ విధమైన బాధ్యత ఉండదు. ఇది మార్కెట్ ఇంటర్‌మీడియరీస్ కు వ్యాపారం మరింత సులభంగా జరగడానికి సెబీ ఇచ్చిన కీలక మినహాయింపు. టెక్నాలజీ పై తక్కువ ఆధారపడే చిన్న బ్రోకర్లను నిర్దిష్ట ప్రమాణాల ద్వారా మినహాయింపులో చేర్చారు.

ఈ నియమావళి 10,000 కంటే ఎక్కువ క్లయింట్లు ఉన్న బ్రోకర్లకు మాత్రమే వర్తిస్తుంది. భారతదేశంలోని బ్రోకర్లలో పెద్ద సంఖ్యలో క్లయింట్లు కలిగిన వారు తక్కువగా ఉన్నందున, సుమారు 60% మంది బ్రోకర్లు ఈ నిబంధనల నుండి మినహాయింపు పొందతారు. ట్రేడింగ్ వ్యవస్థలో లోపాలు ఉన్నా, క్లయింట్లకు నేరుగా ప్రభావం తక్కువగా ఉంటే, బ్రోకర్లపై కఠిన చర్యలు ఉండవు.

ఏదైనా సంఘటన చోటుచేసుకుంటే, బ్రోకర్లు రెండు గంటల్లో ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇవ్వాలి. ఎక్స్ఛేంజీలు ఆ సమాచారాన్ని తమ వెబ్‌సైట్‌లలో ప్రచురిస్తాయి. బ్రోకర్లు తమ యాప్, వెబ్‌సైట్, ఇ-మెయిల్,ఎస్ఎంఎస్, పాప్-అప్ అలెర్ట్‌ల ద్వారా క్లయింట్లకు సమాచారాన్ని అందించాలి. టి౦1 రోజులో ఎక్స్ఛేంజీలకు ప్రాథమిక నివేదిక సమర్పించాలి, సెలవు రోజు అయితే సమయం పొడగించవచ్చు.

సమగ్ర నివేదికలు ఘటనా జరిగిన 14 రోజుల్లోగా మాన్‌చ్ పోర్టల్ ద్వారా సమర్పించాలి. జరిమానాలు ఘటన తీవ్రత, ఫ్రీక్వెన్సీ ఆధారంగా నిర్ణయించబడతాయి. సవరించిన నిబంధనలు వెంటనే అమల్లోకి వచ్చాయి మరియు చిన్న బ్రోకర్లు, మార్కెట్ సౌకర్యం కోసం ఈ మినహాయింపులను ఉపయోగించుకోవచ్చు.

సెబీ ఇచ్చిన ఈ సడలింపుల వల్ల చిన్న బ్రోకర్లు సాంకేతిక లోపాల కారణంగా ఏర్పడే నష్టాల బాధ్యత నుంచి ఉపశమనం పొందుతారు. దీని ద్వారా వారు వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడానికి, ట్రేడింగ్ వ్యవస్థలను మెరుగుపర్చడానికి దృష్టి పెట్టవచ్చు. మార్కెట్‌లో చిన్న బ్రోకర్ల వ్యాపారం ప్రోత్సహించబడటం, మదతు పొందటం ద్వారా మొత్తం స్టాక్ మార్కెట్ వ్యవస్థ స్థిరత్వానికి తోడ్పడుతుంది.

సడలింపు అమలు అయిన తర్వాత, సెబీ చిన్న బ్రోకర్ల కోసం నియంత్రణను మరింత సమర్థవంతంగా, లక్ష్యప్రాయంగా చేస్తూ, పెద్ద బ్రోకర్లకు కఠినమైన నియమాలను కొనసాగిస్తుంది. దీని ద్వారా విభిన్న పరిమాణంలో ఉన్న బ్రోకర్లు సౌకర్యవంతంగా వ్యవహరించగలుగుతారు, ట్రేడింగ్ లోపాల నివారణ, క్లయింట్ సంతృప్తి, మరియు మార్కెట్ నాణ్యతను మెరుగుపరచగలుగుతారు.

## భారత్ ఫోర్జ్-అజైల్ రోబోట్స్ ఏఐ ఆటోమేషన్ ఒప్పందం



భారత్ ఫోర్జ్ మరియు జర్మనీ ఆధారిత అజైల్ రోబోట్స్ ఎస్.ఇ. మేధావి కర్మాగార ఆటోమేషన్ మరియు ఏఐ ఆధారిత రోబోటిక్ పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. ఈ భాగస్వామ్యం ఆటోమోటివ్, హెల్త్‌కేర్ మరియు కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల కోసం ఆధునిక పరిష్కారాలను అందించడం లక్ష్యం.

భారత్ ఫోర్జ్ యొక్క విస్తృత పరిశ్రమ నైపుణ్యం మరియు అజైల్ రోబోట్స్ యొక్క బుద్ధిశాలి రోబోటిక్ పరిష్కారాలు కలసి ఇండియా మరియు దక్షిణ తూర్పు ఆసియా మార్కెట్లలో ప్రత్యేక, కస్టమ్ ఉత్పత్తి, తయారీ, లాజిస్టిక్స్ మరియు సిపిజి పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహకరిస్తాయి.

ఈ భాగస్వామ్యం ప్రత్యేకంగా పౌర పరిశ్రమ మరియు తయారీపై కేంద్రీకృతమై ఉంటుంది. రెండు కంపెనీలు ఆధునిక విజన్ మరియు ఏఐ ఆధారిత రోబోటిక్ పరిష్కారాలను అభివృద్ధి చేసి పూర్తి ఆటోమేటెడ్ (“డార్క్”) ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తాయి.

భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కల్యాణి ప్రకారం, ఈ భాగస్వామ్యం భారత తయారీ రంగంలో ఆధునిక, మాడ్యులర్ మరియు బుద్ధిశాలి ఆటోమేషన్ పరిష్కారాలను అమలు చేయడంలో దోహదపడుతుంది. ఈ ప్రయత్నం భారతదేశంలో తయారీ సామర్థ్యాన్ని పెంచడం, పరిశ్రమలలో సమర్థత మరియు ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడం లక్ష్యం.

అజైల్ రోబోట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోరి సెక్షన్ ప్రకారం, భారత ఫోర్జ్ భాగస్వామ్యం ద్వారా భారత తయారీ రంగంలో వారి స్థానం మరింత బలపడుతుంది. ఏఐ ఆధారిత రోబోటిక్ ఆటోమేషన్ నైపుణ్యం మరియు భారత ఫోర్జ్ పరిశ్రమ నైపుణ్యాన్ని కలిపి మొత్తం ఉత్పత్తి వ్యవస్థల సమర్థత మరియు ఖచ్చితత్వాన్ని పెంపొందించగలుగుతారు.

ఈ భాగస్వామ్యం ద్వారా భారతదేశంలోని చిన్న, మధ్యస్థాయి మరియు పెద్ద పరిశ్రమలకు ప్రత్యేకమైన రోబోటిక్ పరిష్కారాలను అందించగలిగే అవకాశాలు పెరుగుతాయి. తయారీ ప్రక్రియలో ఆటోమేషన్ పెంచడం వల్ల ఖర్చు తగ్గింపు, ఉత్పత్తి వేగం పెంపు మరియు గుణాత్మకతలో మెరుగుదల సాధించవచ్చు.

భారత్ ఫోర్జ్ మరియు అజైల్ రోబోట్స్ భాగస్వామ్యం, భారత పరిశ్రమల్లో ఏఐ ఆధారిత స్మార్ట్ ఫ్యాక్టరీలను అభివృద్ధి చేయడంలో ఒక మైలురాయి. దీని ద్వారా దేశీయ తయారీ సామర్థ్యం, అంతర్జాతీయ స్థాయి సాంకేతికతను అందించగల సామర్థ్యం, మరియు పరిశ్రమలలో ఆధునికతను పెంపొందించడం సాధ్యమవుతుంది.

## మహీంద్రా ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ కొత్త సాంకేతిక ఎస్‌యూవీ ఆవిష్కరణ




మహీంద్రా అండ్ మహీంద్రా వారి కొత్త ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ ఎస్‌యూవీని ఆవిష్కరించింది. దీని ధర రూ. 13.66 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఎక్స్‌యూవీ 700 ద్వారా నెలకొన్న ప్రమాణాలను ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ మరింతగా పెంచుతుంది. అధునాతన డిజైన్, సై-ఫై టెక్నాలజీ, భద్రత మరియు సౌకర్యాలతో ఎస్‌యూవీ విభాగంలో కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేస్తుంది.

ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓలో ప్రపంచంలోనే తొలిసారిగా డావిన్సీ డ్యాంపింగ్ సస్పెన్షన్ సిస్టమ్, ఫ్రంట్ మెక్‌ఫర్సన్ స్ట్రట్ మరియు మల్టీ-లింక్ రియర్ ఇండిపెండెంట్ సస్పెన్షన్ ఉంది. ఇది సాఫీ రైడ్, మెరుగైన హ్యాండ్లింగ్ మరియు అధునాతన డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుంది. 6-వే పవర్డ్ సీట్లు, వెంటిలేటెడ్ సీట్లు మరియు ప్లష్ ప్యాడ్స్‌తో సౌకర్యాలను పెంచుతుంది.

వాహనంలో కోస్ట్-టు-కోస్ట్ 31.24 సెం.మీ ట్రిపుల్ హెచ్‌డీ స్క్రీన్లు, అడ్రినోక్స్ం ఆక్టా-కోర్ చిప్‌సెట్, 16 స్పీకర్ల హర్మన్ కార్డన్ ఆడియో, డాల్బీ ఎట్మాస్ మరియు డాల్బీ విజన్ అనుభూతి వంటి సాంకేతిక ఫీచర్లు ఉన్నాయి. బైయోడ్ థియేటర్ మోడ్, అలెక్సా మరియు చాట్‌జిపిటి ఇంటిగ్రేషన్ ద్వారా వినోద మరియు పనితీరు సమీకరించబడ్డాయి.

ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓలో అత్యుత్తమ ఇంజిన్లు 2.0ఎల్ ఎం స్టాలియన్ టిజిడిఐ గ్యాసోలిన్ మరియు 2.2ఎల్ మహక్ టర్బో-డీజిల్ ఉన్నాయి. మొదటి సారి ఆల్-వీల్ డ్రైవ్ (ఏడబ్ల్యుడి) ఆప్షన్, 5-స్టార్ ఎన్‌సిఎపి భద్రతా రేటింగ్, 7 ఎయిర్‌బ్యాగ్లు, ఏడీఏఎస్ లెవెల్ 2 సౌకర్యాలు, 540లీ సర్‌రౌండ్ వ్యూ కెమెరా, ఆటో హోల్డ్ మరియు ఆటో హైబీమ్ అసిస్ట్ వంటి భద్రతా ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి.

ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓలో ఆధునిక డ్రైవ్ మోడ్‌లు, ప్రత్యేక ఏడీఏఎస్ విజువలైజేషన్, స్మార్ట్ ఫ్రేమ్‌లెస్ ఐఆర్‌విఎం, ఆటో టిల్ట్ ఓఆర్‌విఎంలు, డిజిటల్ వీడియో రికార్డింగ్, మరియు అధునాతన ఇంటీరియర్ లైట్ మరియు ఫినిష్‌లు ఉన్నాయి. ఈ ఎస్‌యూవీ భవిష్యత్ తరపు ఎస్‌యూవీగా రూపొందించబడింది మరియు భారత ఎస్‌యూవీ మార్కెట్‌లో ట్రెండ్ సెట్ చేసే సామర్థ్యం కలిగి ఉంది.

# ఆరు ఐపీఓలు.. ఐదు లిస్టింగ్‌లు..

### భారత్ కోకింగ్ కోల్‌పైనే ఫోకస్!




ప్రైమరీ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి వచ్చే వారమూ కొనసాగనుంది. జనవరి 12 నుంచి 16 మధ్య ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభం కానున్నాయి. ఇందులో అమాగీ మీడియా ల్యాబ్స్ మెయిన్‌బోర్డు కేటగిరీకి చెందినది కాగా.. మిగిలిన ఐదు ఎస్ఎంఈ సెగ్మెంట్‌వి. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ సహా మరో మూడు కంపెనీలు వచ్చేవారం లిస్టింగ్‌కు సిద్ధమవుతున్నాయి.

క్లౌడ్ ఆధారిత యాడ్ టెక్, మీడియా టెక్నాలజీ కంపెనీ అయిన అమాగీ మీడియా రూ.1789 కోట్ల ఐపీఓ జనవరి 13న ప్రారంభం కానుంది. జనవరి 16న ముగియనుంది. ఐపీఓలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.343-361గా నిర్ణయించింది. ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ కానున్నాయి. ప్రస్తుతం కంపెనీ గ్రే మార్కెట్ ప్రీమియం 10 శాతంగా ఉంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.816 కోట్లు సమీకరిస్తుండగా.. వాటాదారులు 972.6 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయిస్తున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను టెక్నాలజీ, క్లౌడ్ ఇన్‌ఫ్రా, కంపెనీ వృద్ధికి వినియోగించనుంది.

**ఎస్ఎంఈ కేటగిరీలో..**

జనవరి 12న నర్మదేశ్ బ్రాస్ ఇండస్ట్రీస్ (షేరు ధర రూ.515), అవానా ఎలక్ట్రోసిస్టమ్స్ (రూ.56-59) పబ్లిక్ ఇష్యూల సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. జనవరి 13న జీఆర్ఈ రెన్యూ ఎనర్‌టెక్ (రూ.100-105), ఇండో ఎస్ఎంసీ (రూ.141-149) ఐపీఓకు రానున్నాయి. 14న ఆర్మర్ సెక్యూరిటీ ఇండియా (రూ.55-57) ఐపీఓ ప్రారంభం కానుంది.

**భారత్ కోకింగ్ కోల్ లిస్టింగ్‌పైనే చూపంతా..**

కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ ఐపీఓకు అనూహ్య స్పందన లభిస్తోంది. శుక్రవారం పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కాగా.. ఇన్‌స్టిట్యూషనల్, నాన్ ఇన్‌స్టిట్యూనల్ ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొన్న వేళ తొలిరోజే 8 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. 13తో సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. జనవరి 16న లిస్ట్ కానుంది. ప్రస్తుతం గ్రే మార్కెట్ ప్రీమియం 39 శాతంగా ఉంది. దీంతో ఎంత ప్రీమియంతో లిస్ట్ అవుతుందోనన్న ఆసక్తి నెలకొంది. ఎస్ఎంఈ కేటగిరీలో గ్యాబియన్ టెక్నాలజీస్, విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్, యజుర్ ఫైబర్స్ లిమిటెడ్ లిస్టింగ్ రానున్నాయి.

## భారతంలో ఏక్యూఐ పెరుగుదలతో శునకాల ఆరోగ్య ప్రమాదాలు



లభారతీయ నగరాల్లో గాలి నాణ్యత తీవ్రంగా క్షీణించగా, మనుషులంతా కాక, పెంపుడు శునకాలు కూడా గాలి కాలుష్యానికి గురవుతున్నాయి. శునకాలు తమ శరీర బరువు ప్రకారం ఎక్కువ గాలి పీలుస్తాయి, పిఎం2.5, పిఎం10 వంటి సూక్ష్మ కణాలు వీటి ఊపిరితిత్తుల్లో చేరి శ్వాసకోశ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. దీని ఫలితంగా క్రమంగా ఊపిరితిత్తుల వ్యాధులు, ఆక్సిడేటివ్ ఒత్తిడి పెరగడం మొదలవుతుంది.

వెంటర్నరేనియన్లు గమనించినట్లు, భారతీయ నగరాల్లో శీతాకాలాల్లో బ్రాంకైటిస్, దగ్గు, కళ్ల సమస్యలు, ఊపిరి తీసుకోలేని పరిస్థితులు పెరుగుతున్నాయి. చిన్న ముక్కు ఉన్న షి జు, పగ్ వంటి బ్రీడ్లు, వయస్సు ఎక్కువైన లేదా గుండె/శ్వాసకోశ సమస్యలున్న శునకాలు ఎక్కువ ప్రమాదంలో ఉన్నాయి. పిఎం2.5 స్థాయిలు డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు పరిమితిని 15-20 రెట్లు అధిగమిస్తున్నాయి. పెంపుడు శునకాల్లో ఏకాయెకిన మార్పులు అరుదుగా జరిగినా, దగ్గు, అలసట, కళ్ల ఎర్రదనం, తరచుగా కళ్ళార్పు, ముక్కు కారడం, తుమ్ములు, శబ్దంతో ఊపిరి తీసుకోవడం వంటి సంకేతాలు గాలి కాలుష్యానికి ప్రాథమిక సూచనలుగా ఉంటాయి. పెట్ పేరెంట్స్ ఈ హెచ్చరిక సంకేతాలు ను పట్టించుకోవాలి.

కాలుష్య ప్రభావం ఉన్న రోజుల్లో బయట వ్యాయామం తగ్గించాలి, రోడ్ల రద్దీ ఎక్కువ ఉన్న ప్రదేశాలు నివారించాలి. ఇంటిలో గాలి, వెలుతురు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి, ఎయిర్ ప్యూరిఫయర్స్ ఉపయోగించడం మంచిది. అవసరమైతే వెటర్నరీ డాక్టరుతో సంప్రదించి ప్రివెంటివ్ ఇన్హేలర్లు, నెబ్యులైజేషన్ ప్లాన్ చేయాలి. ఆక్సిడెంటివ్ ఒత్తిడిని తగ్గించే ఫలితంగా యాంటీ-ఆక్సిడెంట్లు, ఒమేగా-3, ప్రొబయోటిక్స్ వంటి ఆహారాలను ఇవ్వడం లభకరం.

‘వన్ హెల్త్ పరిపాటీ ప్రకారం, గాలి కాలుష్యం మనుషులకే కాక, శునకాలకు కూడా సమానంగా ప్రభావం చూపుతుంది. ఏక్యూఐ ఎక్కువ ఉన్నప్పుడు రొటీన్ పనులను సర్దుబాటు చేసి, నివాసం లోపల కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా శునకాలను రక్షించవచ్చు. ప్రీబయోటిక్స్, విటమిన్లు, ప్రోటీన్లు, మినరల్స్ అందించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచి, శ్వాసకోశ ఆరోగ్యాన్ని పటిష్టం చేయవచ్చు.

కలుషిత గాలి శునకాల జీవన నాణ్యతను క్షీణపరుస్తుంది. దీర్ఘకాలిక ఎక్స్‌పోజర్ వల్ల శ్వాసకోశ సమస్యలు, గుండె వ్యాధులు, అలసట, ఆహారపు ఆకాంక్షల లోపం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ పరిస్థితులు చిన్న బ్రీడ్ల, వయస్కుల, వైద్య సమస్యలున్న శునకాల్లో తీవ్రంగా కనిపిస్తాయి. అందుకే ఏక్యూఐ స్థాయిలను పరిగణనలోకి తీసుకొని, బయటకు తీసుకెళ్లే సమయాన్ని, వ్యాయామం పరిమాణాన్ని సరిచేసుకోవడం అత్యవసరం.

పెంపుడు శునకాలకు ప్రివెంటివ్ అడాప్టేషన్స్ తీసుకోవడం వల్ల తీవ్రమైన సమస్యలు రాకుండా నివారించవచ్చు. ఇంట్లో గాలి, శుభ్రమైన వాతావరణాన్ని సృష్టించడం, ఎయిర్ ప్యూరిఫయర్స్ ఉపయోగించడం, ఆహారంలో యాంటీ-ఆక్సిడెంట్లు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రీబయోటిక్స్, ప్రోటీన్లు, విటమిన్లు జోడించడం ద్వారా శ్వాసకోశాలను బలోపేతం చేయవచ్చు. తద్వారా ఏక్యూఐ ప్రభావాలను తగ్గించగలుగుతాయి మరియు శునకాల ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. పెంపుడు శునకాల ఆరోగ్యంపై గాలి కలుషణ ప్రభావాన్ని గమనించడం ద్వారా ‘వన్ హెల్త్ సిద్ధాంతం స్పష్టంగా కనిపిస్తుంది. మనుషుల ఆరోగ్యం, శునకాల ఆరోగ్యం మరియు పరిసర వాతావరణం అనేవి పరస్పరం సంబంధించినవే. కాబట్టి పెంపుడు శునకాలను కాపాడడం కేవలం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా, కుటుంబ ఆరోగ్యం మరియు సామూహిక పర్యావరణ రక్షణకు కూడా కీలకం అవుతుంది.

### తక్షణ భద్రతా హెచ్చరికలతో ఔషధ నియంత్రణ బలోపేతం



తెలంగాణ డ్రగ్స్ నియంత్రణ పరిపాలన తక్షణమే భద్రతా హెచ్చరికలను జారీ చేయడంపై తీసుకుంటున్న చర్యలు దేశంలో ఔషధ నియంత్రణను మరింత ప్రభావవంతంగా మార్చే ముందడుగులు. భద్రతకు సంబంధించిన సమాచారం వేగంగా అందడంతో క్షేత్రస్థాయిలో నియంత్రణ చర్యలు సమర్థంగా అమలవుతాయి. దీనివల్ల సరఫరా వ్యవస్థలు, ఆరోగ్య సేవాదారులు, రోగుల వరకు కీలక నిర్ణయాలు త్వరగా చేరి కార్యాచరణలోకి వస్తాయి. ఔషధ భద్రతా పర్యవేక్షణలో కొత్త ప్రమాదాలను వెంటనే గుర్తించి స్పందించడంలో ఆలస్యం తగ్గుతుంది. అంతర్జాతీయంగా అమలవుతున్న తక్షణ హెచ్చరికల విధానం తరహాలో దేశవ్యాప్తంగా ఇది విస్తరితే నిబంధనల అమలు పటిష్టమై, అసురక్షితమైన మరియు నాణ్యత లేని ఔషధాల నుంచి రోగులకు మెరుగైన రక్షణ లభిస్తుంది.

## భవిష్యత్తు భారత వృద్ధికి తక్కువ ధర విద్యుత్



అనిల్ అగర్వాల్ ప్రకారం, సరసమైన మరియు భద్రమైన విద్యుత్ భారత భవిష్యత్తు ఆర్థిక వృద్ధిని నిర్ణయిస్తుంది. డేటా సెంటర్లు, ఆధునిక తయారీ మరియు ఖనిజాల ప్రాసెసింగ్ వంటి ఏఐ ఆధారిత రంగాలు అధిక విద్యుత్ ఆధారితంగా ఉన్నందున, విద్యుత్ భద్రత ఆర్థిక ప్రాతిష్ఠ్యానికి కీలకం. చైనా తన చిన్న ఆర్థిక పరిమాణం ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తిలో అమెరికాకు రెట్టింపు శక్తి కలిగి ఉంది, ఇది దీర్ఘకాలిక లాభంగా మారుతుంది. అమెరికా ఇప్పటికే ఏఐ విస్తరణ వల్ల విద్యుత్ సప్లై పరిమితులతో సవాళ్లను ఎదుర్కొంటోంది. భారతదేశం సంప్రదాయ మరియు పునరుత్పాదక శక్తి, ఉత్పత్తి మరియు ప్రసారం సామర్థ్యాలతో సరసమైన విద్యుత్ అందించగల శక్తివంతమైన అవకాశంలో ఉంది. విద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్‌ను సమగ్ర విధానంలో సమీకరించడం ద్వారా భారత్ భవిష్యత్తులో ఏఐ ఆధారిత ఆర్థిక శక్తిగా నిలవగలదు.

### టెక్నో పెయింట్స్ బ్రాండ్ అంబాజిడర్‌గా సచిన్ టెండూక్కర్




టెక్నో పెయింట్స్ అండ్ కెమికల్స్ బ్రాండ్ అంబాజిడర్‌గా ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ నియమితులయ్యారు. మూడేళ్లు ఆయన కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతారు. దేశీయ పెయింట్స్ రంగంలో 25 ఏళ్లుగా సుస్థిర స్థానం సంపాదించి, ఎనిమిది రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న ఈ సంస్థ.. సచిన్ చేరికతో దేశవ్యాప్తంగా విస్తరించాలని ఉవ్విల్లూరుతోంది. 2026-27లో ఐపీఓకు రానున్నట్లు టెక్నో పెయింట్స్ అండ్ కెమికల్స్ చైర్మన్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపారు. 2026-27లోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఐపీఓ ద్వారా రూ.500 కోట్ల నిధులు సమీకరించనున్నట్టు వెల్లడించారు అంతర్జాతీయ స్థాయి నాణ్యత, సమయానికి ప్రాజెక్టులు పూర్తి చేయడం వల్లే మార్కెట్లో టాప్ బ్రాండ్‌గా నిలిచామని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, ఒడిషా, చండీగఢ్‌లో కార్యకలాపాలు సాగిస్తోంది. హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్‌కు ఈ ఏడాది చివరినాటికి విస్తరించాలని కృతనిశ్చయంతో ఉంది. 2026-27లో మధ్యప్రాచ్య దేశాల్లో అడుగుపెట్టాలని టెక్నో పెయింట్స్ నిర్ణయించింది.

### నారా భువనేశ్వరికి ‘అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు




భారత డెయిరీ రంగ అభివృద్ధిలో విశిష్ట సేవలకు హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరికి ప్రతిష్టాత్మక ‘అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు – 2025 లభించింది. ఈ అవార్డును ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (ఐడీఏ) సౌత్ జోన్ ప్రదానం చేసింది. కేరళలోని కోజికోడ్‌లోని కాలికట్ ట్రేడ్ సెంటర్, డాక్టర్ వర్గీస్ కురియన్ నగర్‌లో నిర్వహించిన సదరన్ డెయిరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్ – 2026 ప్రారంభ సమావేశంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. కేరళ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి జే చించు రాణి అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు పాల ఉ డెయిరీ అభివృద్ధి శాఖ మంత్రి టీ మనో తంగరాజ్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి & మత్స్య శాఖ మంత్రి కింజరపు అచ్చన్నాయుడు పాల్గొన్నారు.

## నియోలైట్ జెడ్‌డబ్ల్యుకే ఐపీఓ ఫైల్




నియోలైట్ జెడ్‌డబ్ల్యు కాంతుల లిమిటెడ్, ఒక ప్రముఖ ఆటోమోటివ్ లైటింగ్ ఉత్పత్తుల తయారీదారు, సిబిసి సర్వే ప్రకారం 2025లో ఎణిజ్య ఎ హ౦ ల లైటింగ్ మార్కెట్‌లో 34.43% ఎ టా కలిగి ఉంది, 6,000 కోట్ల ఐపీఓ కోసం డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ఎబీ వద్ద దాఖలు చేసింది. ఈ ఐపీఓలో 4,000 కోట్ల నూతన షర్స్ విడుదల మరియు 2,000 కోట్ల షర్స్ అమ్మకానికి ఉన్నాయి. నిధులు కొత్త కాంచీపురం ఫ్యాక్టరీ నిం ్మణం, ప్రస్తుత సౌకం ్యల విస్తరణ, అప్పుల చెల్లింపు కోసం ఉపయోగించబడత యి. కంపెనీ మూడు సాంకేతిక మరియు సెమీ-ఆటోమేటెడ్ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేస్తుంది, 50 దేశాలకు ఎగుమతులు చేస్తూ, 40కంటే ఎక్కువ ఓఈఎంలకు సరఫం చేస్తుంది. 2025లో ఆదాయం 5,120.75 మిలియన్, నికర లాభం 528.24 మిలియన్, ఆర్ఓఈ 33.90%గా ఉంది, తద్వాం కంపెనీ ఆర్థిక స్థిరత్వం మరియు వ ద్ధిని చూపిస్తుంది.

### డబ్ల్యూఓజి టెక్నాలజీస్ ఐపీఓ & ఆర్‌హెచ్‌పి దాఖలు

WOG
WATER • OIL • GAS

డబ్ల్యుఓజి టెక్నాలజీస్ లిమిటెడ్, పం ్యవరణ ఇంజనీరింగ్ మరియు సాంకేతికతలో సమగ్ర ఎవలు అందించే కంపెనీ, ఎబీ వద్ద ఐపీఓ కోసం డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. కంపెనీ 375 కోట్ల రూపాయల నూతన షర్స్ విడుదల మరియు 43,28,000 షర్స్ అమ్మకానికి ప్రతిపాదిస్తోంది. నిధులు ప్రధానంగా వర్కింగ్ క్యాపిటల్ కోసం 220 కోట్లు, బెల్ కూలింగ్ టవర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో అదనపు 50% ఎ టా కొనుగోలు కోసం 45 కోట్లు మరియు మిగిలిన మొత్తం సామాన్య కార్పొరేట్ అవసం లకు ఉపయోగించబడత యి. షర్లు బిఎస్ఇ మరియు ఎన్ఎస్ఈ లో లిస్టింగ్ చేయబడత యి, మరియు యూనిస్టోన్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుంది.

### ఎన్ఎస్ఈ-ఐజిఎక్స్ సహకారంలో సహజ వాయువు ఫ్యూచర్స్




భారత ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ-ఐజిఎక్స్ తో సహకరించి భారత సహజ వాయువు ఫ్యూచర్స్ కాంట్రాక్ట్‌ను అభివృద్ధి చేయడానికి చర్చలు జరుపుతోంది. ఈ ఫ్యూచర్స్ మార్కెట్ పాల్గొనేవారికి ధరల మార్పులను ఎదుర్కొనే సామర్థ్యం, రిస్క్ మేనేజ్‌మెంట్ సాధనం, మరియు దీర్ఘకాలిక ప్రణాళిక కోసం పారదర్శకత మరియు సామర్థ్యాన్ని అందిస్తుంది. ఎన్ఎస్ఈ యొక్క డెరివేటివ్స్ మార్కెట్ నైపుణ్యం మరియు ఐజిఎక్స్ యొక్క స్పాట్ గ్యాస్ ట్రేడింగ్ నైపుణ్యం కలసి ఫ్యూచర్స్ ఉత్పత్తిని నమ్మదగిన, ద్రవ్యం ఉన్న మరియు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తాయి. ఈ ప్రాజెక్ట్ భారతంలోని గ్యాస్ ధరలు, వినియోగదారులు, ఉత్పత్తిదారులు, ట్రేడర్లు మరియు వాణిజ్య భాగస్వాములపై సానుకూల ప్రభావం చూపిస్తుంది.




# మాతృభాషను ప్రోత్సహించాలి



● స్వదేశీ వస్తువులను ఉపయోగించాలి
● రాజస్థాన్ జోధ్పుర్లో జరిగిన మహేశ్వరి గ్లోబల్ కన్వెన్షన్లో ప్రసంగించిన అమిత్ షా

జోధ్పుర్ : స్వదేశీ వస్తువులకు, మాతృభాషకు ఉన్న ఔనత్యాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ మరోసారి నొక్కిచెప్పారు. ప్రజలు స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని, అలాగే ఇంట్లో మాతృభాషలోనే మాట్లాడాలని కోరారు. మనం ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే, ఆత్మనిర్భర్ ఏకైక మార్గమని అన్నారు. అయితే దాన్ని విజయవంతం చేయడానికి ఏకైక మార్గం స్వదేశీ తెలిపారు. 2047 నాటికి భారత్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని, స్వదేశీ వస్తువులను తయారు చేయడానికి వ్యాపారులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం రాజస్థాన్ జోధ్పుర్లో జరిగిన మహేశ్వరి గ్లోబల్ కన్వెన్షన్లో ఆయన ప్రసంగించారు.

"మనం అన్ని రకాల భాషలను నేర్చుకోవాలి, ఇది పురోగతికి అవసరం. కానీ మనం మన మాతృభాషను మర్చిపోకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడాలి. భారత సంస్కృతి, చరిత్ర గురించి వారికి తెలియజేయాలి. మాతృభాషతో పాటు అన్ని భాషలను నేర్చుకోవాలి. మహేశ్వరి సమాజానికి చెందిన దాతల జాబితా చాలా పెద్దది. దేశానికి అవసరమైనప్పుడల్లా దోహదపడిన సమాజం. వారు ఉద్యోగ అన్వేషకులు కాదు, ఉద్యోగ సృష్టికర్తలు. స్వాతంత్ర్యం తర్వాత రామాలయ ఉద్యమంలో ప్రాణాలను త్యాగం చేసిన మొదటి ఇద్దరు సోదరులు మహేశ్వరులు అనే వాస్తవం నుంచి సాంస్కృతిక పునరుజ్జీవనానికి వారి సహకారం ప్రాముఖ్యతను అంచనా వేయవచ్చు." కేంద్ర హోం మంత్రి - అమిత్ షా, అన్నారు.

ఈ సందర్భంగా అమిత్ షా ఒక స్టాంపును కూడా విడుదల చేశారు. అందరం ఐక్యతతో ముందుకు నడవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్లాల్ శర్మ రాష్ట్ర పురోగతికి సమాజం చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. భారత్ పెద్ద ఎత్తున జరిగే సామాజిక వర్గాల సమావేశాలు దేశాన్ని విడదీయవని, పైగా అవి దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అన్ని వర్గాలు స్వయం సమృద్ధి సాధించినప్పుడే దేశ స్వావలంబన సాధ్యమన్నారు.

"కొందరు తమకు తామే ప్రగతిశీలవాదులమని చెప్పుకునేవారు, 'మహేశ్వరి ఎక్స్పో' లాంటి పెద్ద ఎత్తున జరిగే సామాజిక సమావేశాలను విమర్శిస్తుంటారు. వ్యక్తిగతంగా నేను కూడా అలాంటి విమర్శలను చాలా ఎదుర్కొన్నాను. కానీ నా నమ్మకం ఏమిటంటే, ఇలాంటి సామాజిక నిర్మాణాలు భారత్ను మరింత బలపరుస్తాయే కానీ, ఏనాడూ విడదీయవు. ప్రతి సామాజిక వర్గం తమలోని అణగారిన వర్గాల సంక్షేమం, భద్రత పట్ల బాధ్యత తీసుకుంటే, దేశం మొత్తానికి మేలు జరుగుతుంది." అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

దేశానికి స్వతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ల ఉత్సవాలు జరుపుకున్నాం. ఈ ఉత్సవాల వెనుక 4 ప్రధాన లక్ష్యాలు ఉన్నాయని అమిత్ షా పేర్కొన్నారు. అవి: ఒకటి 1857 నుంచి 1947 వరకు జరిగిన స్వాతంత్ర్య సంగ్రామం గురించి యువతకు తెలియజేయడం. రెండోది గత 75 ఏళ్లలో దేశం సాధించిన అద్భుత విజయాలను వివరించడం, మూడోది 140 కోట్ల భారతీయుల్లో జాతీయ భావాన్ని, భారతీయతను బలోపేతం చేయడం. నాలుగోది 2047 ఆగస్టు 15 నాటికి, భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి ప్రపంచంలోని అన్ని రంగాల్లో భారత్ అగ్రస్థానంలో నిలవాలనే ప్రధాని మోదీ సంకల్పాన్ని నెరవేర్చడం. ఇక చివరిగా సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలి. అప్పుడే 2047 నాటికి భారత్ ప్రతి రంగంలోనూ, ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మారుతుందని అమిత్ షా పేర్కొన్నారు.



## అయోధ్య రామ మందిరంలో
# కశ్మీర్ యువకుడు హల్చల్
, టెంపుల్లో నమాజ్ చేస్తుండగా పట్టుకున్న పోలీసులు



అయోధ్య: అయోధ్యలోని ప్రతిష్ఠాత్మక రామ మందిర ప్రాంగణంలో శనివారం ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. కశ్మీర్కు చెందిన ఒక యువకుడు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించి హల్చల్ సృష్టించాడు. నిందితుడిని కశ్మీర్ నివాసి అహ్మద్ షేక్గా పోలీసులు గుర్తించారు. పోలీస్ సెక్యూరిటీని దాటుకుని లోపలికి వెళ్లిన ఈ యువకుడు, అక్కడ నమాజ్ చేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం.ఆలయ భద్రతా సిబ్బంది, అక్కడున్న భక్తులు యువకుడి ప్రవర్తనను గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అయోధ్య పోలీసులు అహ్మద్ షేక్ను అదుపులోకి తీసుకున్నారు. ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా ప్రవర్తించాడన్న ఆరోపణలతో అతనిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు అతడిని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. అసలు ఆ యువకుడు అయోధ్యకు ఎందుకు వచ్చాడు..? ఆలయంలో నమాజ్ చేయడానికి గల కారణాలేంటి? దీని వెనుక ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. అయోధ్య వంటి భక్త పరవశమైన ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

# ఈడీ, బంగాల్ ప్రభుత్వం మధ్య ముదిరిన వివాదం



● సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసిన టీఎంసీ సర్కార్ ● ఐప్యాక్ కేసులో సుప్రీంకోర్టును ఈడీ ఆశ్రయించవచ్చనే ఊహాగానాలు ● - ఈ నేపథ్యంలో ఈడీ కంటే ముందుగానే సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమత సర్కార్

న్యూఢిల్లీ : పశ్చిమ బంగాల్లో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), టీఎంసీ ప్రభుత్వం మధ్య వివాదం శనివారం సుప్రీంకోర్టుకు చేరింది. ఐప్యాక్ కార్యాలయాలు, డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసాలపై ఈడీ దాడుల వ్యవహారం ఇప్పుడు న్యాయపోరాటానికి దారితీసింది. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కావియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చుననే ఊహాగానాల మధ్య మమతా సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా గురువారం కోల్కతాలోని ఐప్యాక్ కార్యాలయం, ప్రతీక్ జైన్ ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ దాడుల సమయంలో బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడికి చేరుకోవడం తీవ్ర కలకలం రేపింది. సీఎం మమతా బెనర్జీ దాడులు జరుగుతున్న చోటుకు చేరుకుని, తమ ఆధీనంలో ఉన్న కీలకమైన భౌతిక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను బలవంతంగా తీసుకెళ్లారని ఈడీ ఆరోపించింది. పోలీసుల సాయంతో ఆమె దర్యాప్తుకు ఆటంకం కలిగించారని, సాక్ష్యాలను మాయం చేశారని పేర్కొంటూ ఈడీ శుక్రవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని కోరింది.

ఈ ఆరోపణలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తాను అక్కడికి వెళ్లడాన్ని ఆమె సమర్థించుకున్నారు. ఈడీ అధికారులు దర్యాప్తు పేరుతో ఓటర్ల రహస్య సమాచారాన్ని, బూత్ లెవల్ ఏజెంట్ల వివరాలు, సామాన్య ప్రజల విన్నపాలను తీసుకెళ్లే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఉదయం 6 గంటలకే అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించారని, తాను కొన్ని గంటల తర్వాత అక్కడికి వెళ్లానని చెప్పారు.

# చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలి



● శక్తిమంతమైన భారత్ను నిర్మించడమే లక్ష్యం ● అవమానం, నాశనం, అణచివేత చరిత్రను మర్చిపోవద్దన్న జాతీయ భద్రతా సలహాదారు ● - యువతలో ఆవేశం, తపన అవసరమని సూచించిన అజిత్ ధోబాల్

న్యూఢి?లీ : భారతదేశ స్వాతంత్ర్యం ఎన్నో త్యాగాల ఫలితమని, వాటి వెనుక ఉన్న బాధ, అవమానం, జరిగిన నష్టాలను యువత ఎప్పటికీ మరిచిపోవద్దని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ సూచించారు. దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, భారత స్వాతంత్ర్యం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకొని శక్తిమంతమైన భారత్ను నిర్మించాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు.

**తీవ్రమైన అవమానాలను ఎదుర్కొన్న తర్వాతనే!**

భారత స్వాతంత్ర్యం ఒక్కరోజులో సాధించిన విజయం కాదని అజిత్ డోభాల్ స్పష్టం చేశారు. తరతరాల భారతీయులు అపారమైన కష్టాలు అనుభవించారని, అవమానాలు భరించారని చెప్పారు. "ఈరోజు మనం చూస్తున్న స్వతంత్ర భారతదేశం ఎప్పుడూ ఇలాగే లేదు. మన ముందు తరాలు దీనికోసం గొప్ప త్యాగాలు చేశారు. వారు తీవ్రమైన అవమానాలను ఎదుర్కొన్నారు" అని అజిత్ డోభాల్ చెప్పారు. "ఎన్నో సందర్భాల్లో అశక్తతతో చూస్తూ ఉండిపోయారు. ఎంతోమంది ఉరిశిక్షలు ఎదుర్కొన్నారు. మన గ్రామాలు కాలిపోయాయి. మన నాగరికత నాశనం అయింది. మన ఆలయాలు దోచుకున్నారు. అయినా మనం మౌనంగా నిలబడ్డాం" అని వ్యాఖ్యానించారు. ఈ చరిత్రే నేటి యువత ముందున్న అసలైన సవాల్ అని ఆయన అన్నారు. ప్రతి యువకుడి మనసులో ఆవేశం, తపన ఉండాలని చెప్పారు.

**ఆ ప్రతీకారం సాధించాలి!**

ప్రతీకారం అనే పదం సరైనది కాకపోవచ్చని అంగీకరిస్తూనే, చరిత్ర నుంచి వచ్చే ప్రతీకార భావన ఒక శక్తివంతమైన ప్రేరణగా మారాలని ఆయన పేర్కొన్నారు. "మన చరిత్రకు ప్రతీకారం తీర్చుకోవాలి. అది హింస ద్వారా కాదు. మన దేశాన్ని తిరిగి నిలబెట్టడం ద్వారా. మన హక్కులు, మన ఆలోచనలు, మన నమ్మకాలు ఆధారంగా ఒక గొప్ప భారతదేశాన్ని నిర్మించడం ద్వారా ఆ ప్రతీకారం సాధించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.భారతదేశానికి ఎంతో పురాతనమైన, అభివృద్ధి చెందిన నాగరికత ఉందని అజిత్ ధోబాల్ గుర్తు చేశారు. శాంతియుత జీవన విధానమే భారతీయుల సంస్కృతి అని చెప్పారు. "మన నాగరికత ఎప్పుడూ ఇతరుల ఆలయాలను ధ్వంసం చేయలేదు. ఎక్కడికీ వెళ్లి దోచుకోలేదు. ఇతర దేశాలపై దాడులు చేయలేదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలు వెనుకబడి ఉన్న కాలంలోనే మనం అత్యున్నత స్థాయిలో జీవించాం" అని వివరించారు.

**చరిత్ర మనకు గుణపాఠం చెప్పింది!**

అయితే, భద్రతా ముప్పులను గుర్తించడంలో గతంలో చేసిన నిర్లక్ష్యం భారతదేశానికి భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి తీసుకొచ్చిందని అజిత్ ధోబాల్ హెచ్చరించారు. శత్రువులను, ముప్పులను తేలికగా తీసుకోవడం వల్లే చరిత్రలో ఎన్నో చేదు అనుభవాలు ఎదురయ్యాయని అన్నారు. "భద్రత విషయంలో నిర్లక్ష్యం చేసినప్పుడు చరిత్ర మనకు గుణపాఠం చెప్పింది. ఆ పాఠాన్ని మనం నేర్చుకున్నామా? భవిష్యత్ తరాలు దాన్ని గుర్తుంచుకుంటాయా?" అని ఆయన ప్రశ్నించారు. భవిష్యత్ తరాలు ఈ పాఠాన్ని మరిచిపోతే అదే దేశానికి అతిపెద్ద దురదృష్టమని స్పష్టం చేశారు. చరిత్రను మర్చిపోవడమే అత్యంత పెద్ద విషాదమని వ్యాఖ్యానించారు. భద్రత, స్వాభిమానం, జాతీయ విలువల విషయంలో అప్రమత్తత అత్యంత అవసరమని ఆయన యువతకు సూచించారు.

# శాంతే ఉత్తమ మెడిసిన్?

ప్రపంచ సైనిక వ్యయం పెరుగుతోంది

పెరుగుతున్న సైనిక వ్యయంపై డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ కీలక కామెంట్స్

ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాలపై మరింత ఖర్చు చేయాలని పిలుపు

ఘర్షణలు పెంచుకోవద్దని, శాంతే ఔషధమని వెల్లడి



వాషింగ్టన్ : ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సైనిక వ్యయం గురించి డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో కొనసాగుతున్న సంఘర్షణల మధ్య 2024లో రికార్డు స్థాయిలో సైనిక వ్యయం 2.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని అన్నారు. అదే సమయంలో ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాలపై చేసే ఖర్చు గణనీయంగా తగ్గిపోయిందని వెల్లడించారు. ప్రాణాలను కాపాడటంపై దృష్టి పెట్టాలని, ఘర్షణలను పెంచవద్దని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శాంతే ఉత్తమ ఔషధమని పేర్కొన్నారు.

**'ఆరోగ్య కార్యక్రమాలపై ఖర్చు తగ్గింది' :** "కొనసాగుతున్న సంఘర్షణల మధ్య 2024లో ప్రపంచ సైనిక వ్యయం రికార్డు స్థాయిలో 2.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 2025లో కూడా ఇది మరింత పెరుగుతుందని అంచనా. అదే సమయంలో ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాలపై చేసే ఖర్చు గణనీయంగా తగ్గిపోయింది. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది ఘర్షణలను పెంచడం కాదు. ప్రాణాలను కాపాడటంపై ఎక్కువ దృష్టి పెట్టడం. శాంతే అన్నింటికీ ఉత్తమ ఔషధం" అని ఎక్స్?లో డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ వీడియో పోస్ట్ చేశారు.

"సభ్య దేశాలు మాకు విస్తృతమైన లక్ష్యాన్ని అందించాయి. 150 దేశాలలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఒక సంస్థకు రెండు సంవత్సరాలకు 4.2 బిలియన్ డాలర్లు లేదా ఏడాదికి 2.1 బిలియన్ డాలర్లు అనేది పెద్ద లక్ష్యం కాదు. ఇది చాలా తక్కువ. 2.1 బిలియన్ డాలర్లు అనేది ఎనిమిది గంటల కాలంలో ప్రపంచదేశాల ఖర్చు చేసే సైనిక వ్యయంతో సమానం. 2.1 బిలియన్ యూఎస్ డాలర్లు అంటే ఒక స్టీల్ బాంబర్ విమానం ధర, పొగాకు పరిశ్రమ ఏటా చేసే ప్రకటనలు, ప్రచారం కోసం చేసే ఖర్చులో నాలుగో వంతుకు సమానం. మన ప్రపంచంలో నిజంగా విలువైన వాటిపై ఎవరో ధరల ట్యాగ్?లను మార్చినట్లు అనిపిస్తుంది. దేశాలు ఇతర దేశాల దాడుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. కానీ అంతకంటే ఎక్కువ విధ్వంసం, నష్టాన్ని కలిగించే అదృశ్య శత్రువు (అనారోగ్యం) నుంచి తమను తాము రక్షించుకోవడానికి చాలా తక్కువ ఖర్చు చేస్తున్నాయి. "

– టెడ్రోస్ అధనోమ్, డబ్ల్యూహెచ్ఓ చీఫ్

**ట్రంప్ నిర్ణయం వేళ టెడ్రోస్ అధనోమ్ కీలక వ్యాఖ్యలు**

దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. తన 'డ్రీమ్ మిలిటరీ' నిర్మాణం కోసం భారీగా నిధులను వెచ్చించేందుకు రెడీ అయ్యారు. 2027 ఆర్థిక సంవత్సరానికి గానూ సైనిక బడ్జెట్?ను 1.5 ట్రిలియన్ డాలర్లకు (సుమారు రూ.135 లక్షల కోట్లు ) పెంచుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా రక్షణ బడ్జెట్ 1 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా, దీనిని ఏకంగా 50 శాతం పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అమెరికా సైనిక శక్తిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ సైనిక వ్యయం 2.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని, అదే సమయంలో ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాలపై చేసే ఖర్చు గణనీయంగా తగ్గిపోయిందని అన్నారు.

**66 ఇంటర్నేషనల్ సంస్థల నుంచి వైదొలిగిన అమెరికా**

అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం మరో సంచనల ప్రకటన చేశారు. యూఎస్ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అంతర్జాతీయ సంస్థలు, ఒప్పందాలు, కన్వెన్షన్ల నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) ట్రంప్ ఓ మెమోరాండంపై సంతకం చేసినట్లు వైట్ హౌస్ అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ నిర్ణయం ప్రకారం మొత్తం 66 అంతర్జాతీయ సంస్థల నుంచి అమెరికా వైదొలగనుంది. ఇందులో ఐక్యరాజ్యసమితికి (యూఎన్) చెందని 35 సంస్థలు, యూఎన్?కు చెందిన 31 విభాగాలు, సంస్థలున్నాయి. అమెరికా విదేశాంగ శాఖ నివేదికతో పాటు క్యాబినెట్ సభ్యులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ సంస్థల్లో సభ్యత్వం కొనసాగించడం లేదా వాటికి మద్దతు ఇవ్వడం అమెరికా జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమని పేర్కొన్నారు.

అమెరికా వైదొలగిన సంస్థల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా ఉంది. కొవిడ్ వ్యాప్తి సమయంలో డబ్ల్యూహెచ్ఓ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల ఆ సంస్థ నుంచి వైదొలగాలని ట్రంప్ ఏడాది క్రితమే నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఆ నిర్ణయాల మెమోరాండంపై సంతకం చేశారు.

# ఏదో ఒకరోజు హిజాబ్ ధరించిన మహిళే ప్రధాని అవుతుంది

● పాకిస్థాన్ రాజ్యాంగంలా మనది కాదు ● - అంబేడ్కర్ రాజ్యాంగం అందరికీ అవకాశం ఇస్తుందన్న ఎంఐఎం చీఫ్ ● ముందు మీ పార్టీ పగ్గాలు హిజాబ్ మహిళకు ఇవ్వగలరా అని బీజేపీ సవాల్



షోలాపూర్ : "ఏదో ఒక రోజు హిజాబ్ ధరించిన మహిళ కచ్చితంగా భారతదేశానికి ప్రధానమంత్రి అవుతుంది. ఇది నా కల" అని ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మహారాష్ట్రలోని షోలాపుర్?లో శుక్రవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వాన్ని, సమ్మిళితత్వాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ఎవరినైనా అత్యున్నత పదవిలో కూర్చోబెడుతుందని, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా ప్రధాని కావచ్చని ఆయన ఉద్ఘాటించారు. అయితే ఒవైసీ వ్యాఖ్యలపై బీజేపీ, శివసేన నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**పాకిస్థాన్తో పోలిక :** ఒవైసీ తన ప్రసంగంలో పొరుగు దేశం పాకిస్థాన్ రాజ్యాంగంతో భారత రాజ్యాంగాన్ని పోల్చి మాట్లాడారు. "పాకిస్థాన్ రాజ్యాంగం ప్రకారం, కేవలం ఒక మతానికి చెందిన వ్యక్తి మాత్రమే ఆ దేశానికి ప్రధాని కాగలరు. కానీ అంబేడ్కర్ రాసిన మన రాజ్యాంగం అలా కాదు. భారతదేశంలో ఏ పౌరుడైనా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మేయర్ కావచ్చు. అందుకే ఏదో ఒక రోజు హిజాబ్ కట్టుకున్న మా ఆడబిడ్డ ఈ దేశానికి ప్రధాని అవుతుందని నేను నమ్ముతున్నాను" అని ఒవైసీ అన్నారు.

**ప్రేమ గెలుస్తుంది :** ముస్లింలపై జరుగుతున్న విద్వేష ప్రచారంపైనా ఒవైసీ స్పందించారు. "ముస్లింలపై మీరు చిమ్ముతున్న విషం ఎక్కువ కాలం సాగదు. విద్వేషాన్ని వ్యాప్తి చేసే వారి అంతం త్వరలోనే చూస్తాం. ఏదో ఒక రోజు ప్రేమ సాధారణమవుతుంది. అప్పుడు ప్రజలకు అర్థమవుతుంది, తమ మెదళ్లను ఎలా విషపూరితం చేశారో వారు గ్రహిస్తారు" అని వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్పైనా ఫైర్ :** ఇదే సభలో మాజీ కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం, కాంగ్రెస్ పార్టీపై కూడా ఒవైసీ విరుచుకుపడ్డారు. ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్లకు బెయిల్ రాకపోవడానికి కాంగ్రెస్ తెచ్చిన చట్టాలే కారణమని ఆరోపించారు. "కాంగ్రెస్ హయాంలోనే యుఏపీఏ చట్టాన్ని కఠినతరం చేశారు. ఉగ్రవాదం నిర్వచనాన్ని మార్చింది మీరే. ఆనాడు నేను చెప్పాను, ఈ చట్టం దుర్వినియోగం అవుతుందని హెచ్చరించాను. ఈరోజు అదే చట్టం వల్ల ఇద్దరు యువకులు ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్నారు. వారికి బెయిల్ రావడం లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ కాంగ్రెస్ నాయకుడైనా ఐదేళ్లు జైల్లో ఉన్నారా?" అని ప్రశ్నించారు.

**హిమంత కౌంటర్ :** ఒవైసీ వ్యాఖ్యలపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తనదైన శైలిలో స్పందించారు."రాజ్యాంగపరంగా ఎవరికీ అడ్డంకి లేదు. ఎవరైనా ప్రధానమంత్రి కావచ్చు. కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి. భారతదేశం హిందూ నాగరికత కలిగిన దేశం. మేము ఎప్పుడూ ఒకటే నమ్ముతాం. భారత ప్రధానమంత్రి ఎప్పుడూ ఒక హిందువే అయి ఉంటారు. దీనిపై మాకు పూర్తి విశ్వాసం ఉంది" అని హిమంత బిశ్వ శర్మ తేల్చిచెప్పారు.

**మీ పార్టీ అధ్యక్షురాలిని చేయగలరా? – బీజేపీ**

ఒవైసీ వ్యాఖ్యలకు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా గట్టి కౌంటర్ ఇచ్చారు. "రాజ్యాంగం ఎవరినీ అడ్డుకోదు. హిజాబ్ ధరించిన వారు కూడా ప్రధాని కావొచ్చు. కానీ మియాన్ ఒవైసీ, మీకు నేను ఒక సవాల్ విసురుతున్నా. ముందుగా ఒక 'పస్మాండా' ముస్లిం మహిళను లేదా హిజాబ్ ధరించిన మహిళను మీ పార్టీ అధ్యక్షురాలిగా చేయండి. దేశం గురించి తర్వాత మాట్లాడుదురు గాని, ముందు మీ పార్టీలో ఆ పని చేసి చూపించండి" అని 'ఎక్స్' వేదికగా ఎద్దేవా చేశారు.

**పీఎం పోస్ట్ ఖాళీ లేదు – శివసేన**

శివసేన అధికార ప్రతినిధి షైనా ఎన్సీ కూడా ఒవైసీకి చురకలు అంటించారు. "ప్రస్తుతానికి ప్రధానమంత్రి కుర్చీ ఖాళీగా లేదు. నరేంద్ర మోదీ ప్రజాదరణ ఏంటో అందరికీ తెలుసు. ముందు మీ ఎంపీలను గెలిపించుకోండి. ఆ తర్వాత ప్రధాని పదవి గురించి కలలు కనండి. భవిష్యత్తులో మహిళా ప్రధానిని మేము కూడా కోరుకుంటాం. కానీ అది కులం, మతం, వస్త్రధారణ ఆధారంగా కాదు, కేవలం ప్రతిభ ఆధారంగా ఉండాలి" అని ఆమె స్పష్టం చేశారు.




# 'పుతిన్ను కూడా అమెరికా అరెస్ట్ చేస్తుందా?'

● వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్ట్తో ప్రపంచ రాజకీయాల్లో సంచలనం ● పుతిన్పై కూడా ఇలాంటి చర్య తీసుకుంటారా అని ట్రంప్?కు ప్రశ్న ●ఎన్నో ఏళ్లుగా తనకు పుతిన్తో మంచి పరిచయం అని అమెరికా అధ్యక్షుడి జవాబు

వాషింగ్టన్ వెనెజువెలా దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం ఆకస్మికంగా బంధించిన ఘటన అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. ఆ పరిణామం తర్వాత, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్పై కూడా అమెరికా ఇలాంటి సైనిక చర్య చేపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఎన్నో ఏళ్లుగా పుతిన్తో మంచి పరిచయం! :** ఇటీవల డొనాల్డ్? ట్రంప్తో జరిగిన మీడియా సమావేశంలో యూఎస్ మీడియా ప్రతినిధులు కీలక ప్రశ్నలు సంధించారు. మదురో మాదిరిగానే రష్యా అధ్యక్షుడు పుతిన్ను కూడా భవిష్యత్తులో బంధించేందుకు అమెరికా సైనిక చర్యలకు దిగుతుందా? ప్రశ్నించారు. దీనికి ట్రంప్ స్పందిస్తూ, ఎన్నో ఏళ్లుగా పుతిన్తోమంచి పరిచయం, స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

**ఎనిమిది యుద్ధాలను ఆపేశా :** అయితే ఉక్రెయిన్తో కొనసాగుతున్న యుద్ధం విషయంలో పుతిన్ వైఖరిపై ట్రంప్? తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ యుద్ధం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా సైనికులు పెద్ద సంఖ్యలో మరణిస్తున్నారు. ఈ పరిస్థితి నన్ను తీవ్రంగా కలిచివేస్తోంది" అని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను ఆపినట్లు ట్రంప్ మరోసారి గుర్తు చేశారు.

**ఆ ప్రయత్నాలు కొనసాగిస్తూనే! :** అయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాత్రం ఇప్పటివరకు విజయం సాధించలేకపోతున్నానని చెప్పారు. "ఈ యుద్ధాన్ని ఆపడం చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ దీన్ని ముగించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుతిన్పై సైనిక చర్యలు చేపడతారా అనే ప్రశ్నకు ట్రంప్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. పుతిన్ను బంధించేందుకు లేదా రష్యాపై సైనిక చర్యలకు దిగే ఆలోచన తనకు లేదని తేల్చి చెప్పారు. అయితే ఉక్రెయిన్తో యుద్ధం ముగింపు దిశగా రష్యాపై రాజకీయ, దౌత్యపరమైన ఒత్తిడి మాత్రం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సమర్థించిన విషయం తెలిసిందే.

**పుతిన్ను ఉద్దేశించి జెలెన్స్కీ ఇలా! :** ఈ ఘటనపై స్పందించిన జెలెన్స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ అరెస్టు అంశాన్ని ప్రస్తావించారు. "నియంతలను ఇలాగే ఎదుర్కోవడం సాధ్యమైతే, అలాంటి వారి విషయంలో ఏం చేయాలో అమెరికాకు బాగా తెలుసు" అంటూ వ్యాఖ్యానించారు. జెలెన్స్కీ వ్యాఖ్యలు పుతిన్ను ఉద్దేశించి చేసినవేనని అంతర్జాతీయ రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఉక్రెయిన్పై దాడుల పరంపరను కొనసాగిస్తున్న పుతిన్ను కూడా ట్రంప్ ఇదే తరహాలో హ్యాండిల్ చేయాలని ఆయన సూచించినట్లుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఉక్రెయిన్ యుద్ధంపై తీవ్ర అసంతృప్తి**

ఒకవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్తో స్నేహం ఉందని చెబుతూనే, మరోవైపు ఉక్రెయిన్ యుద్ధంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేయడం గమనార్హం. అలాగే సైనిక చర్యలు కాకుండా, దౌత్య మార్గాల్లోనే రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వెనెజువెలా అధ్యక్షుడు మదురో అరెస్టు ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెరలేపగా, పుతిన్పై కూడా ఇలాంటి చర్యలు ఉంటాయా అనే ప్రశ్నలకు ట్రంప్ ఇప్పుడు ఇచ్చిన సమాధానం స్పష్టతనిచ్చినట్లైంది. ఉక్రెయిన్?త– రష్యా యుద్ధం ముగింపే తన లక్ష్యమని, అయితే దానికోసం సైనిక మార్గాన్ని ఎంచుకోనని ట్రంప్ మరోసారి క్లారిటీ ఇచ్చారు.

## వారసత్వాన్ని నాశనం చేసేందుకు నా కుటుంబీకులు చాలు

పట్నా : ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య.. తన కుటుంబ సభ్యులపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. తమ వారసత్వాన్ని కొందరు నాశనం చేస్తున్నారని.. ఇందుకు బయట వ్యక్తులు అవసరం లేదన్నారు. కుటుంబ గౌరవాన్ని, ఉనికిని నిలబెట్టిన వారి మూలాలను చెరిపేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆమె.. ఇది తననెంతో షాక్కు గురిచేసిందన్నారు.

"ఎంతో కృషితో సృష్టించిన గొప్ప వారసత్వాన్ని బయటి వ్యక్తులు నాశనం చేయాల్సిన అవసరం లేదు. ఇందుకు మా ప్రియమైన వాళ్లే చాలు. ముఖ్యంగా మా సొంత వ్యక్తులు సరిపోతారు" అని రోహిణి ఆచార్య (=శీష్ట్రఱఅఱ-ూఎష్ట్రుతీమ్ఖ) పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్లో పోస్ట్ చేసిన ఆమె.. ఎవ్వరి పేరు మాత్రం ప్రస్తావించలేదు. అజ్ఞానం అనే ముసుగు ఉన్నప్పుడు.. అహంకారం తలకెక్కుతుందన్నారు. అప్పుడు వినాశక శక్తులు అప్రమత్తమై.. ఓ వ్యక్తి ఆలోచన, నిర్ణయాలను నియంత్రిస్తారంటూ వ్యాఖ్యానించారు.లాలూ తన కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ను కుటుంబం నుంచి బహిష్కరించడంపై రోహిణి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర పరాజయం పాలైన తర్వాత కీలక వ్యాఖ్యలు చేసిన ఆమె.. రాజకీయాలతోపాటు కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నట్లు ప్రకటించారు.




# నెలలో ఒక రోజు పల్లెబాట పట్టండి

- పేదలకు ప్రాణదాతలుగా నిలవండి!
- వైద్యులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు
- రంగరాయ మెడికల్ కళాశాల నూతన భవనాలకు శంకుస్థాపన
- రూ.10.11 కోట్లతో పూర్వ విద్యార్థుల వితరణ
- మొబైల్ డెంటల్ స్క్రీనింగ్ వాహనాల ప్రారంభం



ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో : వైద్యులు సమాజానికి వెన్నెముక అని, దేవుడితో సమానమైన గౌరవం పొందే వైద్య వృత్తిలో ఉన్నవారు నెలలో కనీసం ఒక్క రోజైనా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వెళ్లి సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. శనివారం కాకినాడలోని చారిత్రాత్మక రంగరాయ మెడికల్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం రాంకోసా ఆధ్వర్యంలో రూ. 10.11 కోట్లతో నిర్మించనున్న నూతన భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు.

**వైద్యో నారాయణో హరి.. :** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ.. "తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారు. అందుకే వైద్యులను దేవుడితో పోలుస్తాం. రంగరాయ మెడికల్ కాలేజీకి ఘనమైన చరిత్ర ఉంది. 1958లో ప్రారంభమైన ఈ సంస్థ ఎందరో మహనీయుల కృషి, దాతల త్యాగాల ఫలితం. నేడు అదే స్ఫూర్తితో పూర్వ విద్యార్థులు తమ సొంత నిధులతో కళాశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం" అని కొనియాడారు.

**గిరిజన ప్రాంతాల్లో సేవలవసరం :** ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత ఉందని, అరకు వంటి ప్రాంతాల్లో మహిళలు సికిల్ సెల్ అనీమియాతో పడుతున్న ఇబ్బందులను తాను స్వయంగా చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "మీరు ఎంతో బిజీగా ఉన్నా, నెలలో ఒక రోజు పేదల కోసం కేటాయించండి. అంకాలజిస్టులు, గైనకాలజిస్టులు, పీడియాట్రిషియన్లు వంటి నిపుణులు పల్లెల్లో శిబిరాలు నిర్వహించాలి. మీ సేవా కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, ప్రధాని నరేంద్ర మోదీ పూర్తి అండగా ఉంటారు" అని హామీ ఇచ్చారు.

**మొబైల్ డెంటల్ స్క్రీనింగ్ వాహనాలు :** అంతకుముందు, పిఠాపురం నియోజకవర్గ ప్రజల కోసం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, నియో సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'మొబైల్ డెంటల్ స్క్రీనింగ్ల వాహనాలను ఆయన ప్రారంభించారు. 3డీ స్కానింగ్ వంటి ఆధునిక సాంకేతికత కలిగిన ఈ వాహనాలు పేదలకు ఉచితంగా దంత వైద్యం అందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు డెంటల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, శాసనసభ్యులు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్, రాంకోసా ప్రతినిధులు మరియు వైద్య కళాశాల అధికారులు పాల్గొన్నారు.

# బండ్ల గణేష్ మహా పాదయాత్ర

- షాద్ నగర్ నుంచి తిరుమల వరకు
- శ్రీవారికి మొక్కుకున్న మొక్కు తీర్చటం కోసమే



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రముఖ నటుడుగా.. నిర్మాత.. కాంగ్రెస్ నేతగా తరచూ వార్తల్లో నిలిచే వ్యక్తి ఇప్పుడు మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆ అంశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. మహాపాద యాత్రకు బండ్ల గణేష్ సిద్దమయ్యారు. ఈ మేరకు ప్రకటన చేసారు. షాద్ నగర్ నుంచి తిరుమల వరకు మహా పాదయాత్ర చేపట్టనున్నారు. అయితే, ఈ నిర్ణయం వెనుక కారణం పైన ఆసక్తి కర చర్చ సాగుతోంది. బండ్ల గణేష్ మహా పాదయాత్ర ఇప్పుడు సంచలనంగా మారుతోంది. బండ్ల గణేశ్ ఈ నెల 19వ తేదీన షాద్‌నగర్‌లోని తన స్వగృహం నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి కాలినడకన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ మహా పాద యాత్రలో రోజూ నిర్దిష్ట దూరం నడవడం, భక్తులతో కలిసి శ్రీవారి నామస్మరణ, భక్తి వాతావరణంలో ప్రయాణమే లక్ష్యంగా ఈ పాదయాత్ర కొనసాగనుంది. ఈ నెల 19వ తేదీన షాద్‌నగర్‌లోని తన స్వగృహం నుంచి భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహించి పాదయాత్రను ప్రారంభించనున్నారు. కాలినడకన తిరుమల చేరుకుని, శ్రీవారిని దర్శించుకుని తన మొక్కును సమర్పించుకుంటారు. అయితే, అసలు ఆ మొక్కు ఇప్పుడు రాజకీయంగానూ ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయిన సమయంలో బండ్ల గణేశ్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చంద్రబాబు నిర్దోషిగా విడుదల కావాలని, తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆయన తిరుమల శ్రీవారికి మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించి చంద్రబాబు మళ్లీ సీఎం అయిన విషయం తెలిసిందే. చంద్రబాబు పట్ల తనకున్న అభిమానాన్ని ఈ యాత్ర ద్వారా బండ్ల గణేశ్ చాటుకుంటున్నారు. ఇప్పుడు చంద్రబాబు పైన అభిమానంతో నాటి మొక్కు తీర్చుకునేందుకు యాత్ర చేస్తున్నట్లు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బండ్ల గణేష్ నిర్ణయం పైన సోషల్ మీడియా వేదికగా స్పందన కనిపిస్తోంది. దీంతో.. బండ్ల గణేశ్ నిర్ణయం రాజకీయ, సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.

# పార్టీలో హోదా లేని, ప్రజల్లో ఆమోదం లేని వార్డు మెంబర్ స్థాయి నేత సజ్జల

- సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వ విధానాలపై మాట్లాడటం సిగ్గుచేటు
- సొంత పార్టీలోనే సజ్జలపై వ్యతిరేకత ఉంది
- సజ్జల ఇచ్చిన సూచనల ఫలితంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయింది
- గతంలో అమరావతిపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేశారు
- పగడ్బందీగా అమరావతిని నాశనం చేశారు
- మళ్లీ అదే రాజధానిపై మాట్లాడటం విడ్డూరం ఎమ్మెల్సీ బీటీ నాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పార్టీలో ఎలాంటి హోదా లేని, ప్రజల్లో కనీస ఆమోదం కూడా లేని వార్డు మెంబర్ స్థాయి నేత సజ్జల రామకృష్ణ రెడ్డి ప్రభుత్వ విధానాలు, శాసనసభ, పార్లమెంట్ అంశాలపై మాట్లాడటం సిగ్గుచేటు అని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ బీటి నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి గురించి వైసీపీ కార్యాలయం నుంచి సజ్జల ప్రెస్‌మీట్ పెట్టారు.. అయితే ఏ హోదాలో ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తున్నారో స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. కనీసం వార్డు మెంబర్ కూడా కానీ వ్యక్తి ప్రభుత్వ విధానాలపై మాట్లాడటం వెనుక ఎవరి ఆదేశాలు ఉన్నాయో ప్రజలకు తెలుసని అన్నారు. ప్రజలు తిరస్కరించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లిలో ఉండి తన మాజీ సలహాదారుడి ద్వారా మాట్లాడిస్తున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సొంత పార్టీలోనే సజ్జలపై వ్యతిరేకత ఉందని, ఆయన వల్లే గత ప్రభుత్వం నాశనం అయిందని వైసీపీ నేతలే బయట చెప్పుకుంటున్నారని తెలిపారు. ప్రధాన సలహాదారుడిగా ఉన్న సమయంలో సజ్జల ఇచ్చిన సూచనల ఫలితంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని బీటీ నాయుడు విమర్శించారు. అమరావతి రాజధాని విషయంలో గతంలో అదే నేతలు భ్రమరావతి అని, స్మశానం అని విరుద్ధ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. పగడ్బందీగా అమరావతిని నాశనం చేసిన వారు ఇప్పుడు మళ్లీ అదే రాజధానిపై మాట్లాడటం విడ్డూరమన్నారు. అమరావతి అభివృద్ధి ఎలా జరుగుతుందో తెలుసుకోవాలంటే మార్కెట్ అనాలిసిస్, నివేదికలను పరిశీలించాలని సూచించారు. రాజధాని ప్రాంత రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన భూముల విలువ సుమారు మూడు లక్షల కోట్ల రూపాయలని, ఆ భూములను బ్యాంకుల్లో భద్రతగా ఉంచి వచ్చిన నిధులతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ప్రస్తుతం సుమారు రూ.50 వేల కోట్లలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇంకా రాజధాని నిర్మాణ పనులు జరుగుతాయని, రాజధానితో పాటుగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. నిధులు ఎక్కడి నుంచి వస్తాయో తెలియదన్నట్లు ప్రజల్లో గందరగోళం సృష్టించడం దురుద్దేశపూరితమని బీటి నాయుడు అన్నారు. ఇది ప్రభుత్వ ధనం కాదని, ప్రజలే రాజధాని కోసం ఇచ్చిన భూముల విలువతో జరుగుతున్న అభివృద్ధి అని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాలనలో చేసిన నిర్వాకాన్ని ప్రజలు చూశారని, అందుకే వైఎస్సార్సీపీకి చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి స్పందిస్తూ, గత ఐదేళ్లలో పనులు నిలిచిపోయాయంటే దానికి అప్పటి ప్రభుత్వమే కారణమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో రాయలసీమ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించగా, వైసీపీ పాలనలో నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించారు. దీనిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అమరావతి రాజధాని అభివృద్ధిని అడ్డుకోవడం, రాష్ట్ర అభివృద్ధిపై విషం చిమ్మడమే లక్ష్యంగా కొందరు కుట్రలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీటీ నాయుడు పిలుపునిచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, యువత ఉద్యోగాలు, ప్రజల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని, అమరావతి రాజధానిగా అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. వైసీపీ నేతల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన తెలియజేశారు.

# ప్రతీ ఒక్కరూ 1098,100,181,1930 పట్ల అవగాహన కలిగి ఉండాలి

- పిల్లలు, మహిళలు ప్రమాదంలో ఉన్నట్టు గమనిస్తే ఈ నెంబర్లకు ఫోన్ చేయాలి
- 'బాలల రక్షణ మానవ అక్రమ రవాణా సదస్సులో అధికారుల సూచనలు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాలల రక్షణ మరియు మానవ అక్రమ రవాణా' అంశంపై ఒక రోజు ప్రాంతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో విస్తృతంగా నిర్వహించారు. తొమ్మిది జిల్లాలకు చెందిన మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. పలువురు ఈ అంశంపై పూర్తి వివరాలు అందించారు. బాలలు, మహిళలపై పెరుగుతున్న అక్రమ రవాణా ముప్పును ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులను మరింత సామర్థ్యవంతులుగా తీర్చిదిద్దడమే ఈ శిక్షణ లక్ష్యంగా పెట్టుకున్నారు. సీడీపీఓలు , జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్లు హాజరై, అనుభవాలు పంచుకుంటూ చురుకుగా పాల్గొన్నారు. ఈ శిక్షణలో ప్రజ్వల ఎన్‌జీఓ నుంచి విచ్చేసిన రిసోర్స్ పర్సన్స్ బలరామకృష్ణ, చంద్రయ్యలు ముఖ్య వక్తలుగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా సైబర్ ట్రాఫికింగ్ కొత్త రూపాల్లో ముందుకు వస్తోందని హెచ్చరించారు. తక్కువ వయస్సు పిల్లలు, పేద కుటుంబాల మహిళలు ఈ మోసాలకు సులభంగా బలవుతున్నారని, అందుకే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ స్థాయిలో ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. సైబర్ ట్రాఫికింగ్ వల్ల కలిగే మానసిక, సామాజిక, ఆర్థిక నష్టాలపై అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ప్రమాద సూచనలు ముందుగానే గుర్తించగలిగితే అనేక కేసులను అడ్డుకోవచ్చని వక్తలు వివరించారు. పిల్లలు లేదా మహిళలు ప్రమాదంలో ఉన్నట్లు గమనిస్తే వెంటనే 1098 చైల్డ్ లైన్, 100 పోలీస్, 181 మహిళా హెల్ప్‌లైన్, 1930 సైబర్ క్రైమ్ నంబర్లను సంప్రదించాలని, సమాచారాన్ని ఆలస్యం చేయకుండా సంబంధిత శాఖలకు చేరవేయాలని సూచించారు. అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన చట్టపరమైన అంశాలపై కూడా శిక్షణలో విస్తృతంగా చర్చించారు. భారతీయ న్యాయ సంహిత , ఇమ్మోరల్ ట్రాఫికింగ్ ప్రివెన్షన్ యాక్ట్, పోక్సో చట్టం, జువెనైల్ జస్టిస్ యాక్ట్‌లలోని కీలక నిబంధనలు, కేసుల నమోదు, బాధితుల రక్షణ, పునరావాసం, పర్యవేక్షణ విధానాలపై అధికారులకు స్పష్టత కల్పించారు. చట్టాల సమర్థవంతమైన అమలుతో పాటు పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల మధ్య సమన్వయం కీలకమని వక్తలు పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం బాధితుల జీవితాలపై చూపే ప్రభావాలను లఘు చిత్రాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, గ్రూప్ డిస్కషన్ల ద్వారా వివరించారు. ముఖ్యంగా సైబర్ ఆధారిత అక్రమ రవాణా కేసుల్లో బాధితులను ఎలా గుర్తించాలి, రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం ఎలా కల్పించాలనే అంశాలపై లోతైన చర్చ జరిగింది. క్షేత్రస్థాయిలో అధికారులు చురుకుగా స్పందిస్తే అక్రమ రవాణాను చాలా వరకు నియంత్రించవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# మరోసారి అమరావతి చుట్టూ రాజకీయాలు

- ప్రకంపనలు సృష్టిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రకటన
- ధీటుగా సమాధానం ఇస్తున్న కూటమి నేతలు
- పారిశ్రామిక వేత్తలు, వ్యాపారుల్లో ఆందోళన
- వేచి చూసే ధోరణిలో రావాలనుకున్న వ్యాపార సంస్థలు



ఎం.గణేశ్, సూర్య ప్రధాన ప్రతినిధి : అమరావతి రాజధాని అంశం మరోసారి రాజకీయాల కేంద్రబిందువుగా మారింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఇచ్చిన స్టేట్మెంట్లతో నిదానంగా సర్దుకుంటున్న అమరావతిలో ఒక్కసారిగా కలకలం ప్రారంభం అయిం. అధికార టీడీపీకూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసీపీ పరస్పర విమర్శలతో రాజకీయ వేడి పెరిగిన వేళ దాని ప్రభావం ఇప్పుడు రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా వ్యాపార, పారిశ్రామిక రంగాలపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అమరావతిని కేంద్రంగా చేసుకుని గత కొంతకాలంగా తిరిగి ఆశలు చిగురిస్తున్నాయి. రాజధాని నిర్మాణం పునఃప్రారంభం అవుతుందన్న సంకేతాలతో పలువురు వ్యాపారులు, రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు, చిన్నాపెద్ద పారిశ్రామికవేత్తలు ముందడుగు వేశారు. ఇప్పటికే కొందరు పెట్టుబడులు పెట్టగా, మరికొందరు పరిశ్రమలు, కార్యాలయాలు ప్రారంభించారు. మరి కొన్ని సంస్థలు స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే తాజా రాజకీయ వ్యాఖ్యలతో ఆ వర్గాల్లో మళ్లీ అనిశ్చితి మొదలైంది. "రాజధానిపై మళ్లీ పాలసీ మారుతుందా?", "మరోసారి మూడు రాజధానుల చర్చ తెరపైకి వస్తుందా?" అన్న సందేహాలు వారిని కలవరపెడుతున్నాయి. ఇప్పటికే పెట్టుబడులు పెట్టినవారు తమ భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేస్తుండగా, రావాలని భావించిన వారు వేచి చూసే ఆలోచనలో ఉన్నారు. ఈ పరిస్థితికి రాజకీయ నేపథ్యం కీలకంగా మారింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమరావతి ఏకైక రాజధాని విధానాన్ని పక్కన పెట్టి మూడు రాజధానుల సిద్ధాంతాన్ని తెరపైకి తీసుకొచ్చారు. అప్పట్లో పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు, శాసన రాజధానిగా అమరావతి అనే ప్రతిపాదనను వైసీపీ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. "వికేంద్రీకృత అభివృద్ధే లక్ష్యం" అంటూ జగన్ పలు బహిరంగ సభల్లో, అసెంబ్లీ వేదికగా కూడా ఈ విధానాన్ని సమర్థించారు. అమరావతి భూముల చుట్టూ రాజధాని కేంద్రీకరణ వల్ల ఇతర ప్రాంతాలు నష్టపోతాయని, రాష్ట్రానికి సమతుల్య అభివృద్ధి అవసరమని ఆయన వాదన. ఇదే సమయంలో అమరావతిలో జరిగిన భూసమీకరణ, ఖర్చులు, మౌలిక సదుపాయాలపై ప్రశ్నలు లేవనెత్తారు. అయితే ఆ మూడు రాజధానుల విధానానికి వ్యతిరేకంగా రైతులు, వ్యాపారులు, ఉద్యోగ వర్గాలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. న్యాయస్థానాల్లో కేసులు, పెట్టుబడుల వెనకడుగు, అంతర్జాతీయ సంస్థల సందేహాలు ఇవన్నీ అప్పట్లో ఏపీకి గట్టి దెబ్బగా మారాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతే ఏకైక రాజధాని అనే స్పష్టమైన స్టాండ్‌తో పనులు మళ్లీ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో జగన్, సజ్జల చేసిన తాజా వ్యాఖ్యలు గత జ్ఞాపకాలను మళ్లీ తట్టిలేపుతున్నాయి. అధికార పార్టీ టీడీపీ ఈ వ్యాఖ్యలను పూర్తిగా రాజకీయ కుట్రగా అభివర్ణిస్తోంది. "రాజధానిపై మరోసారి అనిశ్చితి సృష్టించి పెట్టుబడులను దూరం చేయడమే వైసీపీ లక్ష్యం" అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు వైసీపీ మాత్రం "తాము అమరావతికి వ్యతిరేకం కాదని, ప్రజాధన దుర్వినియోగంపై ప్రశ్నలు వేస్తున్నామంతే" అంటూ సమర్థించుకుంటోంది. కానీ ఈ మాటల యుద్ధంలో నలిగిపోతున్నది మాత్రం రాజకీయాలు కాదు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్ అన్న భావన బలంగా వ్యక్తమవుతోంది. రాజధాని స్థిరత్వం లేకపోతే పెట్టుబడులు రావన్నది వ్యాపార వర్గాల అభిప్రాయం. రాజకీయ పార్టీలు తమ లాభనష్టాల కోసం అమరావతిని మళ్లీ వివాదాల్లోకి లాగితే, దాని ప్రభావం పరిశ్రమలు, ఉద్యోగాలు, అభివృద్ధిపై పడుతుందన్న ఆందోళన పెరుగుతోంది. మొత్తంగా అమరావతి మరోసారి రాజకీయ సమరభూమిగా మారుతుండగా ఈ రాజకీయ యుద్ధం రాష్ట్ర అభివృద్ధిని ఎటు తీసుకెళ్తుందన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల ముందుంది.

# సంక్రాంతి మహాసందడి..

- హైదరాబాద్ విజయవాడ హైవేపై ట్రాఫిక్ ఉక్కిరిబిక్కిరి
- ప్రత్యామ్నాయ మార్గాలు సూచించిన అధికారులు
- ప్రయాణికులకు కీలక సూచనలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సంక్రాంతి పండుగ వేళ తెలుగు రాష్ట్రాల్లో గ్రామాల బాట పట్టిన ప్రజలతో రహదారులు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, గుంటూరు, ఖమ్మం, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో విజయవాడహైదరాబాద్ జాతీయ రహదారి పూర్తిగా వాహనాలతో నిండిపోయింది. సెలవులు కలిసిరావడంతో ఒకేసారి పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కాయి. ఫలితంగా టోల్‌ప్లాజాల వద్ద గంటల తరబడి వాహనాలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. పంతంగి టోల్‌ప్లాజా పరిసరాల్లో వాహనాల రద్దీ అత్యధికంగా కనిపించింది. కార్లు, బస్సులు, లారీలు వరుసగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొన్ని చోట్ల వాహనాలు కదలడానికి అరగంట నుంచి గంట వరకు సమయం పట్టింది. ఈ పరిస్థితిని గమనించిన ట్రాఫిక్ పోలీసులు, జాతీయ రహదారి అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను మోహరించి, వాహనాలను దశలవారీగా ముందుకు పంపిస్తున్నారు. హైదరాబాద్‌విజయవాడ హైవేపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చౌటుప్పల్ సమీపంలోని నారాయణపురం రోడ్డును తాత్కాలికంగా మూసివేశారు. అలాగే హైదరాబాద్ మీదుగా గుంటూరు, ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకోకుండా మార్గనిర్దేశం చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో క్రేన్‌లు, పెట్రోలింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచి, ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను స్పష్టంగా సూచిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే వారు హైదరాబాద్‌నాగార్జునసాగర్ హైవే మీదుగా ప్రయాణిస్తే ట్రాఫిక్ తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగుతుందని, సమయం కూడా ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే వారు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాల చేరుకుంటే ప్రధాన హైవేపై ఉన్న ట్రాఫిక్‌ను తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. భువనగిరి వైపు వెళ్లాలనుకునే వారు మీదుగా ఘట్‌కేసర్ వద్ద ఎగ్జిట్ తీసుకుని వరంగల్ హైవేలోకి వెళ్లవచ్చని తెలిపారు. మరోవైపు సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మార్గాల ద్వారా కూడా భువనగిరి చేరుకునే వీలుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా సంక్రాంతి సెలవుల కారణంగా హైదరాబాద్‌లోని ప్రధాన బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. అదనపు బస్సులు, ప్రత్యేక రైళ్లను నడుపుతున్నప్పటికీ ప్రయాణికుల రద్దీ తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ముందస్తుగా ప్రయాణ ప్రణాళిక చేసుకోవాలని, ట్రాఫిక్ పోలీసులు సూచించే మార్గాలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే ప్రయాణ సమయాన్ని కొద్దిగా మార్చుకోవడం ద్వారా కూడా ఇబ్బందులు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. మొత్తంగా సంక్రాంతి ప్రయాణాలు సురక్షితంగా, సాఫీగా సాగేందుకు పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంది. ప్రయాణికులు సహకరిస్తే రద్దీ లేకుండా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని అధికారులు భరోసా ఇస్తున్నారు.

# తెలంగాణలో జనసేనను బలోపేతం చేస్తాం

- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం
- జిహెచ్ఎంసి ఎన్నికల్లో సైతం బరిలో ఉంటాం
- యువత, మహిళలను చైతన్య పరుస్తాం
- త్వరలో జనసేన శిక్షణ శిబిరాలు
- జనసేన రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర జనసేన ఇంచార్జ్ శంకర్ గౌడ్ అన్నారు. శనివారం జనసేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను బలంగా తీసుకెళ్లే లక్ష్యంతో వీరమహిళ విభాగం, స్టూడెంట్ వింగ్, యూత్ వింగ్‌తో పాటు జీహెచ్ఎంసీ అడ్హాక్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పార్టీ వేగవంతంగా కొనసాగిస్తోంది. ఈ క్రమంలో భాగంగా నేడు కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో అడ్హాక్ కమిటీ సభ్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రౌండ్ లెవల్‌లో చేయాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో అనుసంధానం, రానున్న జీహెచ్ఎంసీ, మున్సిపల్ ఎన్నికలకు పార్టీ ఎలా సిద్ధమవుతున్నది అనే అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని రాష్ట్ర నాయకత్వం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కార్యక్రమం తెలంగాణ జనసైనికుల్లో నూతన ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

తెలంగాణల జనసేన పార్టీని బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో ఆడ్ హాక్ కమిటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీ రామ్ తల్లూరి, పార్టీ వైస్ ప్రెసిడెంట్ బి. మహేందర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, ఎమ్మెల్యే పోటీ చేసిన అభ్యర్థి ఉమ్మారెడ్డి ప్రేమ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాజలింగం, గ్రేటర్ జనరల్ సెక్రటరీ దామోదర్ రెడ్డి తోపాటు ఇతర రాష్ట్రాల నాయకులు పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని వారు సూచించారు. జనసేన పార్టీని ప్రజలకు మరింత దగ్గర చేయాలనే సంకల్పంతో ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా, స్వచ్ఛమైన రాజకీయాలే ధ్యేయంగా జనసేన పార్టీ ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని, పార్టీలో పలువురు జనసేన పార్టీలో చేరారు.

# కెఎల్ యూనివర్సిటీ మొదటి విడత ఇంజనీరింగ్

- ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల
- ఆడపిల్లకు చదువే అసలైన ఆస్తి...
- రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత



ఏపీ స్టేట్ క్రైమ్ బ్యూరో, మేజర్ న్యూస్ : ఆడపిల్లకు చదువే అసలైన ఆస్థి అని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శని వారం నాడు వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కె ఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్ లలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికై జాతీయ స్థాయిలో నిర్వహించిన మొదటి విడత ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆమె విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆమె మాట్లాడుతూ కెఎల్ యూనివర్సిటీలో అడుగు పెట్టగానే రాబోయే తరాన్ని తయారు చేసే ఖర్మాగారంలో అడుగు పెట్టినట్లుగా భావన కలిగిందన్నారు. ఇంత మంది అమ్మాయిలను ఒక దగ్గర చూడటం ఆనందంగా ఉందన్నారు. తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా పెంపొందిస్తున్న కెఎల్ యూనివర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి తనకు చదువే అసలైన ఆస్థి అని చెప్పప్పారని తన భాల్యంలోని సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. తాను డిఎస్సి పాసయి ప్రభుత్వ ఉపాద్యాయినిగా పనిచేసినట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడి ప్రోత్సాహంతో తాను రాజకీయాలలోకి ప్రవేశించి రాష్ట్రానికి హెూం మంత్రి అయ్యానని చెప్పారు. మోటివేషన్ అనేది ఆడపిల్లకి ఎంత ముఖ్యమో.... మగ పిల్లలకి కూడా అంతే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు ఎప్పటికీ మరచిపోకూడదని హితవు పలికారు. టెక్నాలజీలో కూడా కెఎల్ యూనివర్సిటీలో చదువుతున్న బాలికా విధ్యార్థినులు ముందుండి శాటిలైట్ ప్రయోగాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. బాలికలు అపరిచితుల మాయలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఇటీవల తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను ఆమె ఉదహరించారు.

ఇన్ స్టా గ్రామ్ , ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియా పరిచయాలను నమ్ముకుని కన్న వారికి కడుపుకోత మిగల్చవద్దని తెలియజేశారు. తాను హెూ మంత్రిగా భాధ్యతలు తీసుకున్న ఏడాదిన్నర కాలంలో 4 శాతం నేరాల శాతం రాష్ట్రంలో తగ్గిందన్నారు. సోషల్ మీడియా వచ్చాక బాలికలను ట్రాప్ చేసే ఆకతాయిలు ఎక్కువయ్యారని అన్నారు. అలాంటి వారి పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. 18 ఏళ్ళ లోపు బాలికలను వేధించినా , అసభ్య కరంగా ప్రవర్తించిన వారిపైన పోక్సో కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీ షీట్లు నిమోదు చేయస్తామని హెచ్చరించారు.

మీ చుట్టు పక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటే ఈగల్ టీమ్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.. వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. ఒక దశలో తాను కూడా సోషల్ మీడియాలో వేధింపులకు గురయ్యానట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ప్రోత్సాహంతో తాను రాజకీయాలలో విజయం సాదించానట్లు పేర్కొన్నారు.





# పల్లెకెళుతున్న పట్టణం

**హైవేలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద పెరిగిన రద్దీ**

**సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్తున్న వారితో కిటకిట**

**హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై బారులు తీరుతున్న వాహనాలు**

**సంక్రాంతి పండుగకు సెలవులు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. దీంతో బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రభుత్వం ఇప్పటికే తగిన చర్యలు తీసుకుంది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, రైళ్లు, విమానాల ద్వారా దాదాపు 2లక్షల మంది, మరో 2లక్షల మంది తమ సొంత వాహనాలు, క్యాబ్లో వెళ్లారు. విపరీతమైన రద్దీ నేపథ్యంలో చిల్లకల్లు, కీసర టోల్ప్లాజాల వద్ద భారీ సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. వరుస సెలవులు రావడంతో ఉద్యోగులు, పిల్లలు అందరూ పండుగ సంబురాలను సొంతూరులో జరుపుకోవడానికి పట్నం వాసులు పల్లె బాట పట్టారు. హైదరాబాద్లోని ఉప్పల్, ఎల్బీ నగర్, జేబీఎస్లో భారీగా రద్దీ నెలకొంది. కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాల్లోనూ స్వగ్రామాలకు తరలివెళ్తున్నారు. మరిన్ని వివరాలలోకి వెళితే...**

సంక్రాంతి పండుగ సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం నుంచే హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట్ల వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు.

హైదరాబాద్ నగరం నిర్మానుష్యంగా మారింది. సంక్రాంతి పండుగను పల్లెల్లో జరుపుకోవడానికి సొంత గ్రామాలకు లక్షలాది మంది తరలివెళ్లడంతో జనారణ్యం బోసిపోయింది. ప్రజలు నగరాల నుంచి పల్లె బాట పట్టడంతో ఆయా హైవేల్లోని టోల్ ప్లాజాల దగ్గర వాహనాలు కిటకిటలాడాయి. సొంత వాహనాల్లో సొంతూర్లకు వెళుతుండటంతో. టోల్ గేట్ల దగ్గర భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విజయవాడ జాతీయ రహదారిలో పతంగి, కొర్లపహాడ్ టోల్గేట్ల దగ్గర వాహనాలు బారులు తీరాయి. పతంగి టోల్గేట్ వద్ద వాహనాలు అధిక సంఖ్యలో రావడంతో విజయవాడ వైపు గేట్లు తెరిచినప్పటికీ కిలోమీటరు దూరానికిపైగా వాహనాలు స్తంభించాయి. వాహనాలు వేల సంఖ్యలో తరలిరావడంతో.. యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు అర కిలోమీటరు మేర నిలిచిపోయాయి. ఒక దశలో ట్రాఫిక్ కిలోమీటరు దూరానికిపైగా నిలిచిపోయింది. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ.. వాహనాలు పరిమితికి మించి రావడం, కొన్ని వాహనాల ఫాస్టాగ్లు స్కాన్ కాకపోవడం వంటి కారణాలతో టోల్ గేట్ల దగ్గర పండగ రద్దీ అధికంగా కనిపించింది.

మరోవైపు.. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం టోల్ గేట్ దగ్గర కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సంక్రాంతి సెలవులు రావడంతో సొంత ఊళ్లకు బాటపట్టారు. టోల్ గేట్ దగ్గర భారీ



సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సంక్రాంతికి దారులన్నీ గోదావరి జిల్లాల వైపే సాగుతున్నాయి. దీంతో ఏలూరు టోల్గేట్ వద్ద వాహనాల రద్దీ మరింతగా పెరిగింది. సంక్రాంతి పండుగ కోసం హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి లక్షలాదిమంది జనం సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో టోల్గేట్లన్నీ రద్దీగా మారాయి. మరోవైపు ఆర్టీఏ అధికారులూ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కొరడా ఝులిపిస్తున్నారు. పలుచోట్ల స్పెషల్ డ్రైవ్లు ఏర్పాటుచేసి ప్రైవేట్ ట్రావెల్స్ను తనిఖీలు చేశారు. ఇది కూడా వాహనాలు మందకొడిగా



సాగడానికి ఒక కారణంగా కనిపించింది. సొంతూళ్లకు జనం పయనం కావడంతో హైదరాబాద్ నగర రోడ్లు ట్రాఫిక్ ఫ్రీగా మారాయి.

### ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు :

శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ మొదలైంది. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం



రోడ్డును పోలీసులు మూసివేశారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు టోల్ప్లాజా నిర్వాహకులు వివరించారు.

### ట్రావెల్స్ దోపిడీ

. రైల్వే, ఆర్టీసీ బస్సుల రిజర్వేషన్లు ఫుల్ కావడంతో ఇదే అదనుగా భావించి ప్రైవేట్ ట్రావెల్స్ జనాలను దోపిడీ చేస్తున్నాయి. భారీగా చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మ ప్రైవేటు ట్రావెల్స్. డబుల్, ట్రిపుల చార్జ్ చేస్తున్నారు. వెయ్యి రూపాయలు ఉండే టికెట్ ధరను రెండు వేలు, మూడు వేలు ఛార్జ్ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే టికెట్ ధర రూ. వెయ్యి లోపే ఉంటుంది. కానీ రూ. 1500 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.2000ల లోపే ఉంటే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రూ.3వేల నుంచి రూ.5500 వరకు వసూలు చేస్తున్నారు. ఇక స్లీపర్ అయితే రూ.6వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

### సంక్రాంతి రద్దీ దృష్ట్యా 6431 స్పెషల్ బస్లు :

సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా టీజీఎస్ఆర్టీసీ 6432 స్పెషల్ బస్సులను నడిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్కు 1000 బస్సులను, మిగతా వాటిని తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు నడిపిస్తోంది. నిన్నటి నుంచి ప్రారంభమైన ప్రత్యేక బస్సులు ఈనెల 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలత ఇప్పటికే తెలిపారు. తిరిగి 18, 19 తేదీల్లోనూ స్పెషల్ బస్సులు నడుస్తాయని వివరించారు. కాగా ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నారు.

### హైదరాబాద్ ఖాళీ

భారీగా జనాలు పల్లె బాట పట్టడంతో హైదరాబాద్ ఖాళీగా మారింది. ఆది, సోమవారం సిటీలో పూర్తిగా ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది. ఇటు శనివారం ఉదయం నుంచే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. . నిత్యం రద్దీగా ఉండే మాదాపూర్ పరిసర ప్రాంతాలలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్లో ట్రాఫిక్ కష్టాలు తెలియనవి కాదు. అయితే, సంక్రాంతి పండుగ, వరుస సెలవుల నేపథ్యంలో ఈ మారు పూర్తిస్థాయిలో ప్రజలంతా తమ సొంతూళ్ల బాట పట్టారు. ఎల్లవేళలా రద్దీగా ఉండే నగరంగా పేరొందిన హైదరాబాద్ నగరం బోసిపోయింది. శుక్ర, శని వారాల్లో ఒక మోస్తరుగా జనసంచారం కనిపించినా ఆదివారం కావడంతో మిగిలిన వారు కూడా పల్లె బాట పట్టడంతో హైదరాబాద్ నగరం పూర్తిస్థాయిలో ఖాళీ అయ్యిందని చెబుతున్నారు.

### కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు



సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్లో బస్టాండ్లలో రద్దీ పెరిగింది. దిల్సుఖ్నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక జంక్షన్లు సందడిగా మారాయి. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతోంది. మరోవైపు సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులతో రైల్వేస్టేషన్లలో కూడా రద్దీ పెరిగింది. రద్దీకి అనుగుణంగా రైల్వేశాఖ అదనపు రైళ్లు నడుపుతోంది. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను నడిపిస్తున్నట్లుగా ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. పండుగ సందర్భంగా మరిన్ని రైళ్లు నడపాలని దూరప్రాంత వాసులు కోరుతున్నారు.

### ప్రత్యేక రైళ్లు



సంక్రాంతికి ఊరి వెళ్లే వారి సంఖ్యా భారీగా ఉండటంతో దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని రైళ్లను తెలంగాణ, ఏపీ మధ్య నడపాలని నిర్ణయించింది. రేపటి నుంచి హైదరాబాద్- విజయవాడ మధ్య పది అదనపు ట్రైన్స్ నడుపుతోంది. దీనికి సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో వెల్లడించింది. ఈ రైళ్లు ఆదివారం నుంచి 19వ తేదీ వరకు నడపనున్నారు. 11, 12, 13, 18, 19 తేదీల్లో ప్రత్యేక ట్రైన్లు నడుస్తాయి. ఉదయం ఆరు గంటల పది నిమిషాలకు హైదరాబాద్లో బయల్దేరనున్నాయి. మధ్యాహ్నం రెండున్నరకు విజయవాడ నుంచి బయల్దేరనున్నాయి.

ఇప్పటికే నడుస్తున్న 150కిపైగా అదనపు ట్రైన్స్కు ఇప్పుడు చెప్పినవి అదనం అన్నమాట. ఇవి కేవలం విజయవాడ వరకు మాత్రమే నడుపుతున్నారు. ఇప్పటికే నడుస్తున్న ట్రైన్స్ మాత్రం నర్సాపురం, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మచిలీపట్నం, నాందేడ్ను కవర్ చేస్తున్నాయి. వీటి నిర్వహణ విషయంలో కూడా దక్షిణ మధ్య రైల్వే శాఖ కొన్ని జాగ్రత్తలు తీసుకుంది. చాలా ట్రైన్స్ను చర్లపల్లి నుంచి బయల్దేరేలా షెడ్యూల్ చేసింది. దీంతో పునర్నిర్మాణంలో ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్పై భారం పడకుండా జాగ్రత్త పడింది. ఒక్క చర్లపల్లి రైల్వేస్టేషన్ కాకుండా కొన్ని బేగంపేట, హైటెక్ సిటీ, లింగంపల్లి నుంచి కూడా బయల్దేరేలా ప్లాన్ చేసింది.

### పోలీసులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ మార్గాలివే :




వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు ఆ వివరాలివే.

హైదరాబాద్ నగరం నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్పల్లి వరకు వెళ్లి అద్దంకి నేషనల్ హైవేపై నుంచి వెళ్తుంటారు. వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్నగర్, అబ్దుల్లాపూర్మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్ప్లాజా వద్ద ట్రాఫిక్లో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారి మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఔటర్ రింగురోడ్డు మీదుగా వెళ్లాలనుకునేవారు బొంగళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుందని సూచిస్తున్నారు.

ఖమ్మం, విజయవాడ మార్గంలో వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాల చేరుకోవచ్చు. నార్కట్పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ చిక్కులు తప్పినట్లే.

హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఔటర్ రింగు రోడ్డు పైకి వెళ్లి ఘట్కేసర్లో ఎగ్జిట్ తీసుకొని వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరి చేరుకోవచ్చు.

ప్రతి ఆదివారం చౌటుప్పల్లో సంత జరుగుతుంది. ఆ రోజు చౌటుప్పల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ఉత్తమమని సూచిస్తున్నారు.



# భారత్‌పై మరోసారి విజయం లక్ష్యంగా కివీస్





భారత్-న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ఆదివారం(జనవరి 11) నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్లో మొదటి వన్డేకు వడోదరలోని బీసీఏ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. అయితే ఏడాదిన్నర కిందట స్వదేశంలో భారత్ను టెస్టుల్లో వైట్వాష్ చేసిన కివీస్.. ఇప్పుడు అదే ఫలితాన్ని వన్డేల్లో కూడా పునరావృతం చేయాలని పట్టుదలతో ఉంది. ఇదే విషయాన్ని తొలి వన్డేకు ముందు మీడియా సమావేశంలో మాట్లాడిన న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ విల్ యంగ్ స్పష్టం చేశాడు. కివీస్ జట్టులో అద్భుతమైన ఆటగాళు ఉన్నారని, భారత్ను ఓడించగలమని యంగ్ ధీమా వ్యక్తం చేశాడు. కాగా 2024 ఆఖరిలో భారత్ పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ సంచలనం సృష్టించింది. మూడు టెస్టుల సిరీస్ను కివీస్ వైట్ వాష్ చేసింది. బ్లాక్ క్యాప్స్ జట్టు 1955 తర్వాత భారత గడ్డపై టెస్టు సిరీస్ నెగ్గడం ఇదే తొలిసారి. ఈ చారిత్రాత్మక సిరీస్ విజయంలో యంగ్ది కీలక పాత్ర. యంగ్ ప్లేయర్ ఆఫ్ది సిరీస్గా నిలిచాడు. ఇప్పుడు వన్డేల్లో కూడా సత్తాచాటాలని అతడు ఉవ్విళ్లూరుతున్నాడు."ఈసారి భిన్నమైన ఫార్మాట్లో క్రికెట్ ఆడేందుకు భారత్ పర్యటనకు వచ్చాము. మా జట్టు ప్రస్తుతం వన్డేల్లో అద్భుతంగా రాణిస్తోంది. సీనియర్ ప్లేయర్లు దూరంగా ఉన్నప్పటికి మేము మెరుగైన ప్రదర్శన చేస్తామన్న నమ్మకం నాకు ఉంది. ఈ సిరీస్కు ముందు మేము స్వదేశంలో ఇంగ్లండ్, వెస్టిండీస్తో వన్డేల్లో విజయం సాధించాము.గత భారత పర్యటనలో మేము సాధించిన విజయం మాకు ఎంతో నమ్మకాన్ని ఇచ్చింది. ఈసారి కూడా గెలిచేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తాము. భారత్లో మరొక సిరీస్ గెలవడమే మా లక్ష్యం. ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో చివరి మెట్టుపై బోల్తా పడ్డాము. కానీ ఆ ఓటమిని మేము ఎప్పుడో మర్చిపోయాము.ఇప్పుడు మా దృష్టి కేవలం ఈ ద్వైపాక్షిక సిరీస్ పైనే ఉంది" అని పేర్కొన్నాడు. కాగా గతేడాది మార్చిలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ చేతిలో కివీస్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఇక ఈ సిరీస్ భారత పర్యటకు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్,రచిన్ రవీంద్ర వంటి స్టార్ ప్లేయర్లు దూరమయ్యారు. వన్డే సిరీస్కు కివీస్ కెప్టెన్గా మైఖల్ బ్రెస్వెల్ వ్యవహరించనున్నాడు.

### డబ్ల్యూపీఎల్-2026లో

# కొత్త తారల అరంగేట్రం





మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2026 టోర్నమెంట్కు శుక్రవారం తెరలేచింది. సీజన్ ఆరంభ మ్యాచ్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. ముంబై ఇండియన్స్ను గెలుపొంది శుభారంభం అందుకుంది.

**ఆర్సీబీ తరపున అరంగేట్రం :** నవీ ముంబైలో జరిగిన ఈ మ్యాచ్ ద్వారా ఆర్సీబీ తరపున ఇంగ్లండ్ మహిళా క్రికెటర్లు లారెన్ బెల్, లిన్సీ స్మిత్ అరంగేట్రం చేశారు. ఫాస్ట్ బౌలర్ బెల్ నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసి కేవలం 14 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసింది. తద్వారా డబ్ల్యూపీఎల్లో తన ఆగమనాన్ని ఘనంగా చాటింది.మరోవైపు.. లెఫ్టార్మ్ పేసర్ లిన్సీ స్మిత్ మాత్రం రెండు ఓవర్లలో ఏకంగా 23 పరుగులు ఇచ్చి నిరాశపరిచింది. అయితే, అంతర్జాతీయ టీ20లలో సత్తా చాటిన ఈ ఇద్దరు ఎవరికి ఎవరూ తక్కువకారు. తొలి మ్యాచ్లో విఫలమైనా లిన్సీ తిరిగి పుంజుకోగలదు. ఇందుకు గణాంకాలే కారణం.

**ఎన్ని వికెట్లు తీశారంటే :** బెల్ ఇప్పటికి 36 అంతర్జాతీయత టీ20లలో 50 వికెట్లు కూల్చగా.. లిన్సీ 22 మ్యాచ్లు ఆడి 6.6 ఎకానమీతో 22 వికెట్లు తీసింది. వుమెన్స్ 100లో బెల్ ఖాతాలో 60 (41 మ్యాచ్లలో), లిన్సీ ఖాతాలో 42 (37 మ్యాచ్లలో) వికెట్లు ఉన్నాయి ఇక బెల్, లిన్సీలతో పాటు మరో ముగ్గురు ప్లేయర్లు కూడా ఈసారి అరంగేట్రం చేసే అవకాశం ఉంది. వారు మరెవరో కాదు లిజెలి లీ, గొంగడి త్రిష, దీయా యాదవ్.

**లిజెలి :** సౌతాఫ్రికా ఓపెనింగ్ బ్యాటర్ లిజెలి లీ అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికి 82 మ్యాచ్లు ఆడింది. 33 ఏళ్ల ఈ కుడిచేతి వాటం బ్యాటర్ ఖాతాలో 1896 పరుగులు ఉన్నాయి.ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి వైదొలిగినా.. తన విధ్వంసకర బ్యాటింగ్ కారణంగా గత దశాబ్దకాలంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. గతేడాది వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ లిజెలిని రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది. మహిళల బిగ్బాష్ లీగ్లో ఇప్పటికి 104 మ్యాచ్లు ఆడి ఐదు సెంచరీలు బాది.. 2770 పరుగులు చేసిన లిజెలి డబ్ల్యూపీఎల్కు వాచౌట్ ప్లేయర్.

**గొంగడి త్రిష :** తెలంగాణ ఆల్రౌండర్, టీమిండియా అండర్-19 స్టార్ గొంగడి త్రిష. అండర్-19 ప్రపంచకప్ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన మహిళా క్రికెటర్గా ఆమె చరిత్రకెక్కింది.టాపార్డర్లో బ్యాటింగ్ చేయడంతో పాటు.. పార్ట్టైమ్ లెగ్ స్పిన్నర్గా రాణించడం ఆమెకు ఉన్న అదనపు బలం. అయితే, గత రెండు సీజన్లలో వేలంలో పేరు నమోదు చేసుకున్నా ఫ్రాంఛైజీలు ఆమెను పట్టించుకోలేదు.ఈసారి యూపీ వారియర్స్ మాత్రం రూ. 10 లక్షల కనీస ధరకు 20 ఏళ్ల త్రిషను కొనుగోలు చేసింది.
కీలక మ్యాచ్లలో ఫియర్లెస్ క్రికెట్ ఆడగల సత్తా ఉన్న త్రిషకు ఒక్క అవకాశం వచ్చినా తనను తాను నిరూపించుకోగలదు. ఇప్పటి వరకు 33 టీ20 మ్యాచ్లు ఆడిన త్రిష 583 పరుగులు సాధించింది.

**దీయా యాదవ్ :** పదహారేళ్ల దీయా యాదవ్ను రూ. 10 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. తద్వారా అత్యంత పిన్న వయసులో డబ్ల్యూపీఎల్ కాంట్రాక్టు పొందిన ప్లేయర్గా ఆమె చరిత్ర సృష్టించింది.
అండర్ 15 వన్డే కప్లో డబుల్ సెంచరీ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించిన దీయా.. దేశీ టీ20 క్రికెట్లోనూ నిలకడైన ఆటతో ఆకట్టుకుంటోంది. ఈమె కూడా ఈసారి అరంగేట్రం చేసే అవకాశం ఉంది.

# డిక్లెర్క్ విధ్వంసం.. ఆర్సీబీకి థ్రిల్లింగ్ విజయం



ప్లేయర్
ఆఫ్ ద మ్యాచ్
నదైన్ డిక్లెర్క్ 63*
(7×4, 2×6)

- చివరి 4 బంతుల్లో 20 పరుగులు.. ఆర్సీబీకి అనూహ్య గెలుపు
- నదైన్ డిక్లెర్క్ అద్భుత ఆల్రౌండ్ షో: 63 & 4/26
- డబ్ల్యూపీఎల్ సీజన్-4 తొలి మ్యాచ్లే హై వోల్టేజ్ థ్రిల్లర్
- ముంబయిపై 3 వికెట్ల తేడాతో ఆర్సీబీ విజయం

బెంగళూరు విజయానికి చివరి ఓవర్లో 18 పరుగులు అవసరం. తొలి రెండు బంతులకు పరుగే ఇవ్వలేదు నాట్ సీవర్. మహిళల క్రికెట్లో 4 బంతుల్లో 18 పరుగులంటే గెలవడం కష్టమే. కానీ దక్షిణాఫ్రికా ఆల్రౌండర్ నదైన్ డిక్లెర్క్.. ఆఖరి నాలుగు బంతుల్లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. వరుసగా 6, 4, 6, 4 బాదేసి మహిళల ప్రిమియర్ లీగ్ నాలుగో సీజన్ తొలి మ్యాచ్లో తన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు అద్భుత విజయాన్నందించింది. బ్యాటుతో విధ్వంసక అర్ధశతకం సాధించిన ఆమె.. అంతకుముందు బంతితోనూ విజృంభించి నాలుగు వికెట్లు తీయడం విశేషం. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ తొలి మ్యాచే అభిమానులకు బోలెడంత వినోదాన్ని పంచింది. శుక్రవారం చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఆర్సీబీ 3 వికెట్ల తేడాతో ముంబయిపై అనూహ్య విజయాన్నందుకుంది. ఆశల్లేని స్థితిలో నదైన్ డిక్లెర్క్ (63 నాటౌట్; 44 బంతుల్లో 7ఐ4, 2ఐ6) సంచలన ఇన్నింగ్స్ ఆడడంతో ఆర్సీబీ 3 వికెట్లు కోల్పోయి సరిగ్గా 20 ఓవర్లలో 155 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ముంబయి బౌలర్లలో అమేలియా కెర్ (2/13), నికోలా కేరీ (2/35) రాణించారు. మొదట సజీవన్ సజన (45; 25 బంతుల్లో 7ఐ4, 1ఐ6), నికోలా కేరీ (40; 29 బంతుల్లో 4ఐ4) మెరుపులతో ముంబయి 6 వికెట్లకు 154 పరుగులు చేసింది. నదైన్ (4/26) బౌలింగ్లోనూ అదరగొట్టింది. డబ్ల్యూపీఎల్లో ఆమెకిది రెండో మ్యాచ్ మాత్రమే.

**ఓటమి ఖాయమనుకుంటే..:** రెండు నెలల కిందట వన్డే ప్రపంచకప్లో విశాఖపట్నంలో భారత్తో జరిగిన మ్యాచ్లో దక్షిణాఫ్రికాకు ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్లో నదైన్ డిక్లెర్క్ (84 నాటౌట్) ఎలా చెలరేగిపోయిందో తన జట్టును ఎలా గెలిపించిందో భారత అభిమానులకు గుర్తుండే ఉంటుంది. ఆ టోర్నీలో బంగ్లాదేశ్తో మరో మ్యాచ్లోనూ నదైన్ అలాంటి ఇన్నింగ్సే ఆడింది. ఇప్పుడు డబ్ల్యూపీఎల్లోనూ ఆర్సీబీకి ఓటమి తప్పదనుకున్న స్థితిలో ఆమె విధ్వంసక ఇన్నింగ్స్ ఆ జట్టుకు విజయాన్నందించింది. ఆమె బ్యాటింగ్కు వచ్చిన ఓవర్ పూర్తయ్యేసరికి ఆర్సీబీ స్కోరు 65/5. గ్రేస్ హారిస్ (25), స్మృతి మంధాన (18) జట్టుకు మెరుపు ఆరంభాన్నే ఇచ్చినప్పటికీ.. 25 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ పీకల్లోతు కష్టాల్లో పడింది. గొప్పగా బౌలింగ్ చేసిన అమేలియా.. ఎనిమిదో ఓవర్లో 2 పరుగులే ఇచ్చి రాధ యాదవ్ (1), రిచా ఘోష్ (6)లను ఔట్ చేయడంతో ఆర్సీబీ ఓటమి బాటలో సాగింది. అయితే అరుంధతి (20)తో కలిసి పోరాడిన నదైన్.. జట్టును పోటీలోకి తెచ్చింది. 16 ఓవర్లకు 117/5తో ఆర్సీబీ మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ తర్వాతి ఓవర్లో నికోలా కేరీ.. 4 పరుగులే ఇచ్చి అరుంధతి, శ్రేయాంక (1)లను ఔట్ చేయడంతో సమీకరణం కఠినంగా మారింది. తర్వాతి 2 ఓవర్లలో 16 పరుగులే రావడం, అనుభవజ్ఞురాలైన నాట్ సీవర్ చివరి ఓవర్ను రెండు వరుస డాట్స్తో మొదలుపెట్టడంతో ముంబయి గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ చివరి నాలుగు బంతులకు నదైన్ భారీ షాట్లు ఆడి ఆర్సీబీకి అనూహ్య విజయాన్నందించింది.

**మెరిసిన నికోలా, సజన**

మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి ఇన్నింగ్స్ను పేలవంగా మొదలుపెట్టింది. డబ్ల్యూపీఎల్లో తొలి మ్యాచ్ ఆడిన ఇంగ్లాండ్ ఫాస్ట్బౌలర్ లారెన్ బెల్ అద్భుత బౌలింగ్తో ఆర్సీబీకి అదిరే ఆరంభాన్నిచ్చింది. దూకుడుగా ఆడే అమేలియా కెర్ బ్యాటింగ్ చేస్తుండగా తొలి ఓవర్ను లారెన్ మెయిడెన్ వేయడం విశేషం. లారెన్ వేసిన తర్వాతి ఓవర్లోనూ తడబాటు కొనసాగించిన అమేలియా (15 బంతుల్లో 4).. అరుంధతికి తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ప్రమాదకర నాట్ సీవర్ (4)ను నదైన్ బౌలింగ్లో స్టంపౌట్ అయిపోయింది. అయితే మరో ఎండ్లో దూకుడుగా ఆడుతున్న కమలిని (32; 28 బంతుల్లో 5ఐ4)కి కెప్టెన్ హర్మన్ప్రీత్ (20) తోడవడంతో ముంబయి 63/2తో పుంజుకుంది. ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో ఔటైపోవడంతో ముంబయికి మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. పరుగుల వేగం కూడా పడిపోవడంతో 14 ఓవర్లకు 85/4తో నిలిచిన ముంబయి.. 130 పరుగులకు మించేలా కనిపించలేదు. కానీ క్రీజులో కుదురుకున్న నికోలా, సజన చివరి ఓవర్లలో చెలరేగిపోవడంతో స్కోరు అనూహ్యంగా 150 దాటింది. ఆ జట్టు ఇంకా ఎక్కువ స్కోరే చేయాల్సింది. కానీ నదైన్ చివరి ఓవర్లో 5 పరుగులే ఇచ్చి వీళ్లిద్దరినీ ఔట్ చేసింది.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: అమేలియా (సి) అరుంధతి (బి) లారెన్ 4; కమలిని (బి) శ్రేయాంక 32; నాట్ సీవర్ (స్టంప్డ్) రిచా (బి) నదైన్ 4; హర్మన్ప్రీత్ (సి) రిచా (బి) నదైన్ 20; నికోలా (సి) హేమలత (బి) నదైన్ 40; సజన (సి) స్మృతి (బి) నదైన్ 45; అమన్జ్యోత్ నాటౌట్ 4; పూనమ్ నాటౌట్ 0; ఎక్స్ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 154; వికెట్ల పతనం: 1-21, 2-35, 3-63, 4-67, 5-149, 6-154; బౌలింగ్: లారెన్ బెల్ 4-1-14-1; లిన్సీ స్మిత్ 2-0-23-0; అరుంధతి రెడ్డి 4-0-37-0; నదైన్ డిక్లెర్క్ 4-0-26-4; శ్రేయాంక పాటిల్ 4-0-32-1; రాధ యాదవ్ 2-0-21-0

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్**

గ్రేస్ హారిస్ (సి) షబ్నిమ్ (బి) నాట్ సీవర్ 25; స్మృతి మంధాన (సి) పూనమ్ (బి) షబ్నిమ్ 18; హేమలత ఎల్బీ (బి) అమన్జ్యోత్ 7; రిచా ఘోష్ (సి) నికోలా (బి) అమేలియా 6; రాధ యాదవ్ (బి) అమేలియా 1; నదైన్ నాటౌట్ 63; అరుంధతి (సి) అమేలియా (బి) నికోలా 20; శ్రేయాంక (బి) నికోలా 1; ప్రేమ నాటౌట్ 8; ఎక్స్ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 157; వికెట్ల పతనం: 1-40, 2-47, 3-62, 4-63, 5-65, 6-117, 7-121; బౌలింగ్: నాట్ సీవర్ 4-0-47-1; షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-26-1; నికోలా కేరీ 4-0-35-2; అమన్జ్యోత్ 3-0-18-1; అమేలియా కెర్ 4-0-13-2; సైకా ఇషాక్ 1-0-13-0 డబ్ల్యూపీఎల్ సీజన్-4 ఆరంభోత్సవం అదిరిపోయింది. నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ పాప్ గాయకుడు యోయో హనీ సింగ్ పాటలతో మురిపించగా.. బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ నృత్యాలతో అభిమానులను అలరించింది. 2021 మిస్ యూనివర్స్ హర్నాజ్ సంధు మహిళల శక్తిని వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేసింది.



నికోలా కేరీ

# యామగుచిపై విజయం...

### సెమీఫైనల్లో సింధు



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోరీ?నలో భారత స్టార్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అకానె యామగుచి (జపాన్)తో శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు తొలి గేమ్ను 13 నిమిషాల్లో 21-11తో సొంతం చేసుకుంది. అనంతరం ప్రపంచ మూడో ర్యాంకర్ అకానె యామగుచి గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగింది. దాంతో సింధును విజేతగా ప్రకటించారు. ఈ గెలుపుతో ముఖాముఖి రికార్డులో యామగుచిపై సింధు ఆధిక్యం 15-12కు పెరిగింది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 3-2తో ఆధిక్యంలో ఉంది. మరోవైపు పురుషుల డబుల్స్లో సాతి?వక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్--చిరాగ్ ద్వయం 10-21, 21-23తో ఫజర్ అల్ఫియాన్-షోహిబుల్ ఫిక్రీ (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాతివక్-చిరాగ్లకు 9,062 డాలర్ల (రూ. 8 లక్షల 17 వేలు) ప్రైజ్మనీతోపాటు 6600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

### తిలక్ దూరం..

# టీ20 జట్టుకు టెన్షన్



గత రెండేళ్లలో భారత టీ20 జట్టులో ఉత్తమ బ్యాటర్లలో ఒకడిగా ఎదిగాడు తిలక్ వర్మ. ఇంకో నాలుగు వారాల్లో సొంతగడ్డపై మొదలయ్యే టీ20 ప్రపంచకప్లోనూ అతడిపై భారీ అంచనాలే నెలకొన్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతూ ఆ మెగా టోర్నీకి సన్నద్ధమవుతున్న వేళ.. తిలక్ అనూహ్యంగా మైదానానికి దూరమయ్యాడు. వృషణాలకు శస్త్రచికిత్స జరగడంతో కొన్ని వారాల పాటు అతను మైదానంలో కనిపించబోడు. ప్రస్తుతానికి న్యూజిలాండ్తో ఈ నెల 21న మొదలయ్యే అయిదు టీ20ల సిరీస్లో తొలి మూడు మ్యాచ్లకు మాత్రమే దూరమైనట్లు బీసీసీఐ ప్రకటించింది. టీ20 ప్రపంచకప్లోనూ ఆరంభంలో ఒకట్రెండు మ్యాచ్లకు తిలక్ దూరమవుతాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరి అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారన్నది ఆసక్తికరం. గత ఏడాది ఆసియా కప్ ఫైనల్లో తిలక్ వర్మ ఎంత గొప్ప ఇన్నింగ్స్ ఆడాడో అభిమానులకు గుర్తుండే ఉంటుంది. అంతకుముందు ఏడాది దక్షిణాఫ్రికాలో వరుసగా రెండు శతకాలు బాదిన ఘనత తిలక్ సొంతం. ఇటీవల సొంతగడ్డపై ఆ జట్టుతో సిరీస్లోనూ తిలక్ రాణించాడు. ఇలాంటి ఆటగాడు ఇప్పుడిలా అనూహ్యంగా జట్టుకు దూరం కావడం భారత్కు ఎదురు దెబ్బే. న్యూజిలాండ్తో సిరీస్లో తిలక్ స్థానాన్ని భర్తీ చేయడానికి ఉన్న ప్రత్యామ్నాయాలు ఏంటని చూస్తే.. శుభ్మన్ గిల్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ లాంటి ఆటగాళు కనిపిస్తున్నారు. అయితే శుభ్మన్ను టీ20ల్లో భవిష్యత్ కెప్టెన్గా చేసే ఉద్దేశంతో కొన్ని నెలల కిందట కోచ్ గంభీర్.. అతడికి ఉపసారథిగా బాధ్యతలు అప్పగించి తిరిగి టీ20 జట్టులోకి తీసుకొచ్చాడు. కానీ ఈ అవకాశాన్ని శుభ్మన్ ఉపయోగించుకోలేకపోయాడు. పునరాగమనంలో 15 మ్యాచ్లు 24.25 సగటుతో ఆడి 291 పరుగులే చేశాడు. దీంతో టీ20 ప్రపంచకప్నకు అతడిని ఎంపిక చేయలేదు. న్యూజిలాండ్ సిరీస్కూ జట్టులోకి తీసుకోలేదు. విఫల ఆటగాడిగా ముద్ర పడ్డ గిల్ను తిరిగి టీ20 జట్టులోకి తీసుకుంటారా అన్నది సందేహమే. యశస్వి జైస్వాల్కు పరిమిత ఓవర్ల క్రికెట్లో దొరికిన అవకాశాలు తక్కువే. పైగా అతను ఓపెనర్. అభిషేక్ శర్మకు తోడుగా సంజు శాంసన్ ఓపెనర్గా ఖరారైన నేపథ్యంలో అతణ్ని జట్టులోకి ఎంపిక చేస్తారా అన్నది సందేహమే. తిలక్ స్థానంలో మిడిలార్డర్లో ఆడే బ్యాటర్ అవసరం కాబట్టి శ్రేయస్ అయ్యర్ సరైన ప్రత్యామ్నాయం అవుతాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రేయస్కు ఐపీఎల్లో గొప్ప రికార్డుంది. వన్డేల్లో కూడా బాగా ఆడుతున్నాడు. ఇటీవలే గాయం నుంచి కోలుకుని జట్టులోకి పునరాగమనం చేసిన అతను.. న్యూజిలాండ్తో మూడు వన్డేల సిరీస్లో ఆడబోతున్నాడు. ఇందులో రాణిస్తే.. ముమ్ముందు టీ20 జట్టులో ఎంపికకు కూడా శ్రేయస్ పరిగణనలో ఉంటాడు.

# తాతకు అంకితం..

### నిహాల్ రాపిడ్ టైటిల్



హైదరాబాద్: భావోద్వేగానికి లోనైన నిహాల్ సరీన్, జనవరి 9, శుక్రవారం తన తాత మరణించిన మరుసటి రోజే టాటా స్టీల్ రాపిడ్ చెస్ టోర్నమెంట్లో టైటిల్ గెలుచుకున్నాడు. 21 ఏళ్ల ఈ యువకుడు సంయమనం పాటిస్తూ శుక్రవారం టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నమెంట్లో రాపిడ్ టైటిల్ను కైవసం చేసుకున్నాడు మరియు తన విజయాన్ని దివంగత తాతకు అంకితం చేశాడు. చెస్ క్రీడను తనకు పరిచయం చేసిన తన తాతను కోల్పోయిన మరుసటి రోజే, ఒక బలమైన ఆటగాడితో డ్రా చేసుకోవడం ద్వారా అతను ఈ పోటీని గెలుచుకున్నాడు. సరీన్ మొదటి రౌండ్లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన విశ్వనాథన్ ఆనంద్తో డ్రా ఆడి ఓపెన్ రాపిడ్ విభాగాన్ని గెలుచుకున్నాడు. ఈ ఫలితంతో, అతను 6.5 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానాన్ని ఆక్రమించాడు. ముఖ్యంగా, ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ స్థానంలో సరీన్ ఈ టోర్నమెంట్లో ప్రవేశించాడు. ఆనంద్ మొత్తం ఆరు పాయింట్లతో టోర్నమెంట్ను ముగించి, పట్టికలో రెండవ స్థానంలో నిలిచాడు. ఇటీవల దోహాలో జరిగిన ప్రపంచ రాపిడ్ మరియు బ్లిట్జ్ ఛాంపియన్షిప్లలో డబుల్ కాంస్య పతకాలు సాధించిన అర్జున్ ఎరిగైసి, ఐదు పాయింట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. విజయం తర్వాత, సరీన్ తన దివంగత తాత ఎ.ఎ. ఉమ్మర్ను ఈ క్రీడలో తన గురువుగా పేర్కొన్నాడు. తన తాత తన మ్యాచ్లను చాలా దగ్గరగా అనుసరించేవారని కూడా అతను చెప్పాడు. "నిన్న రాత్రి, నాకు చెస్ నేర్పిన నా తాతయ్య చనిపోయారని వార్త అందింది," అని సరీన్ పేర్కొన్నాడు. "అతను చాలా కాలంగా అనారోగ్యంతో ఉన్నారు మరియు... అవును, ముఖ్యంగా గత 12 నెలలుగా, అతని పరిస్థితి నిజంగా క్షీణిస్తోంది. అవును, అది హృదయ విదారకం. అతను దీనిని చూసి సంతోషించేవాడు. అతను ఎల్లప్పుడూ నాకు గొప్ప శ్రేయోభిలాషి, మరియు 80 ఏళు పైబడినప్పటికీ, అతను నా ఆటలను చూసేవాడు మరియు రాత్రంతా చెస్ను అనుసరించేవాడు. ఈ విజయాన్ని నేను అతనికి అంకితం చేయాలనుకుంటున్నాను," అని అతను చెప్పాడు. రష్యాకు చెందిన కటెరీనా లాగ్నో ప్రారంభ రౌండ్ నుండి చివరి వరకు తన ఆధిపత్యాన్ని ప్రదర్శించి మహిళల పోటీని గెలుచుకుంది. ఈ రష్యన్ గ్రాండ్మాస్టర్ ఈవెంట్ అంతటా అజేయంగా నిలిచి, ఇంకా ఒక రౌండ్ మిగిలి ఉండగానే టైటిల్ను గెలుచుకుంది. ఈవెంట్ ముగిసే సమయానికి ఆమె రెండవ స్థానంలో ఉన్న అలెగ్జాండ్రా గోర్యాచ్కినా కంటే 1.5 పాయింట్ల ఆధిక్యంలో ఉంది.

# సంక్రాంతి ఫస్ట్ మూవీకి కలిసి రావడం లేదా?



**సంక్రాంతి అంటే టాలీవుడ్ సినీ ఇండస్ట్రీకి పెద్ద పండుగ. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు తరలివచ్చే ఆ సీజన్ ను టార్గెట్ చేసుకుని స్టార్ హీరోల సినిమాలు బరిలో దిగుతుంటాయి. భారీ అంచనాలు, రికార్డు స్థాయిలో బిజినెస్, గ్రాండ్ ప్రమోషన్లతో విడుదలయ్యే సంక్రాంతి సినిమాలు సాధారణంగా బాక్సాఫీస్ ను షేక్ చేస్తాయని భావిస్తారు. మంచి వసూళ్లు సాధిస్తాయని అంచనా వేస్తారు. కానీ ఇటీవల సంవత్సరాల్లో సంక్రాంతికి మొదటగా విడుదలైన కొన్ని స్టార్ హీరోల సినిమాలు అనుకున్న రేంజ్‌లో రిజల్ట్ అందుకోలేకపోవడం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.**

ఆ లిస్ట్ లో ముందుగా గుర్తుకు వచ్చేది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన అజ్ఞాతవాసి. 2018 సంక్రాంతికి భారీ అంచనాలతో విడుదలైన ఆ సినిమా.. మొదటి షో నుంచే మిక్స్ డ్ టాక్ అందుకుంది. త్రివిక్రమ్ – పవన్ కాంబినేషన్ పై ఉన్న అంచనాలు అందుకోలేకపోయింది. కథ, స్క్రీన్ ప్లే విషయంలో వచ్చిన విమర్శలు సినిమాపై ప్రభావం చూపించాయి. అదే తరహాలో సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన గుంటూరు కారం కూడా 2024 సంక్రాంతి బరిలోకి దిగింది. భారీ బిజినెస్ తో, మాస్ ఎంటర్‌టైనర్ గా తెరకెక్కిన మూవీ నుంచి అభిమానులు ఎక్కువ ఆశించారు. కానీ రిలీజయ్యాక స్టోరీ, టోన్ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చినా, మొత్తంగా సినిమా మిక్స్ డ్ టాక్ కే పరిమితమైంది.



2025 సంక్రాంతికి రామ్ చరణ్ లీడ్ రోల్ లో వచ్చిన గేమ్ ఛేంజర్ పరిస్థితి కూడా అంతే. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పొలిటికల్ డ్రామాపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి. కానీ విడుదల తర్వాత కథలో కన్ఫ్యూజన్, రన్ టైమ్ పై విమర్శలు వచ్చాయి. హైప్ క్రియేట్ అయినా.. సినిమా ఆశించినంత హిట్ గా నిలవలేకపోయింది. తాజాగా 2026 సంక్రాంతికి ప్రభాస్ నటించిన ది రాజా సాబ్ మూవీ విడుదలైంది. డార్లింగ్ నుంచి పూర్తి స్థాయి ఎంటర్టైనర్ కోసం ఎదురుచూసిన అభిమానులకు సినిమా నచ్చింది. కానీ అందరినీ మెప్పించలేకపోయినట్లు తెలుస్తోంది. హారర్ కామెడీ అంశాలతో రూపొందిన ఆ చిత్రం, అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇలా నాలుగు సంవత్స రాల్లో సంక్రాంతికి ముందుగా విడుదలైన పవన్, మహేష్, చరణ్, ప్రభాస్ సినిమాలు మిక్స్ డ్ టాక్ ను సొంతం చేసుకోవడం గమనార్హం. అయితే అది యాదృశ్చికమనే చెప్పాలి. ఎందుకంటే ఏ సినిమా రిజల్ట్ కు అయినా కంటెంటే కీలకం. అది బాగుంటేనే రిజల్ట్ అనుకున్న రేంజ్ లో వస్తుంది.





## చిరంజీవిని అభిమానించే అందరూ వావ్అనే లా మన శంకర వర ప్రసాద్ గారు ఉంటుంది



మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైన్‌మెంట్ మన శంకర వర ప్రసాద్ గారుతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఉత్సాహాన్ని మరింత పెంచుతూ విక్టరీ వెంకటేష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుండగా, శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సినిమా ప్రమోషన్‌లు అద్భుతంగా జరుగుతున్నాయి. ట్రైలర్, పాటలు సినిమా పై అంచనాలను భారీగా పెంచాయి. మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**లాస్ట్ ఇయర్ రిలీజ్ టైం కి నెర్వస్ గా ఉంది అని చెప్పారు.. ఈ ఇయర్ ఎలా అనిపిస్తోంది?**

ఈసారి కొద్దిగా రిలాక్స్‌గా ఉన్నాను. నెర్వస్ పర్సంటేజ్ కొంచెం తగ్గింది. దానికి కారణం చిరంజీవి గారు. ప్రీరిలీజ్ ఈవెంట్లో హుక్ స్టెప్ సాంగ్ రిలీజ్ చేసాము. ఆ పాటకి చిరంజీవి గారు వేసిన డాన్స్, ఆ ఈవెంట్లో ఆయన ముందు నేను వెంకటేష్ గారు చేసిన అల్లరి ఇదంతా తెలియకుండా ఒక పాజిటివ్ వైబ్ తీసుకొచ్చేసింది. దీంతో చాలా రిలాక్స్ అయ్యాను.

**హుక్ స్టెప్ వైరల్‌గా మారింది కదా?**

ఆ సాంగ్ వెనుక ఒక కథ ఉంది. నిజానికి ఆ ప్లేస్ లో ఒక మెలోడీ మాస్ ట్యూన్ అనుకున్నాము. మీసాల పిల్ల, శశిరేఖ ఈ రెండు పాటలు కూడా మెలోడీ సాంగ్స్. చిరంజీవి గారి ఇంట్రడక్షన్ సాంగ్ కూడా మళ్లీ మెలోడీ అయితే ఎలా అని ఆలోచించాను. సాంగ్ అంత సంతృప్తికరంగా లేదని చిరంజీవి గారికి చెప్పాను. సాంగ్ షూట్ చేస్తున్నప్పుడు వర్షం పడి షూటింగ్ ఆగిపోయింది. నేచర్ సిగ్నల్ ఇచ్చిందని చిరంజీవి గారు చెప్పారు. ఆయనే సిగ్నల్ ఇచ్చారు కదా అని.. అప్పుడు ఈ సాంగ్ ని ఆలోచించడం మొదలుపెట్టాం. శశిరేఖ ప్లేస్ లో రిలీజ్ అవ్వాల్సిన పాట ఇదే. మొత్తం షూట్ అయ్యాక లాస్ట్ షెడ్యూల్లో ఈ సాంగ్ షూట్ చేశాం. ఫైనల్ గా మెగా మ్యాజిక్ జరిగింది. భీమ్స్ అద్భుతమైన ట్యూన్ ఇచ్చాడు.చాలా కొత్తగా చేశారు. ఆట సందీప్ ఎప్పటినుంచో చిరంజీవి గారి పాటకి కొరియోగ్రఫీ చేయాలని చూస్తున్నాడు. ఈ సినిమాకి అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని నిలబెట్టుకున్నాడు. అద్భుతమైన కొరియోగ్రఫీ చేశాడు. హుక్ స్టెప్ అనే పదం ఇచ్చింది పాట రాసిన రామజోగయ్య గారే.

**మ్యూజిక్ విషయంలో ఎక్కువగా లోకల్ టెక్నీషియన్ తో పని చేస్తుంటారు.. కారణం?**

భీమ్స్ ఎక్కువగా కొత్త, లోకల్ టాలెంట్ ని ఎంకరేజ్ చేస్తుంటాడు. సంక్రాంతికి వస్తున్నాంలో బ్లాక్ బస్టర్ పొంగల్ పాట పాడింది కూడా లోకల్ సింగర్స్. ఈ సినిమాలో మీసాల పిల్ల సాంగ్ కోసమే ఉదిత్ గారు, హుక్ స్టెప్ బాబా సాహెల్ గారు పాడారు. కొరియోగ్రాఫర్స్‌లో భాను మాస్టర్, విజయ్,. ఆట సందీప్ అద్భుతంగా ప్రూవ్ చేసుకున్నారు. మన లోకల్ టెక్నీషియన్స్ అందరు కూడా వెలుగులోకి వస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

**మీరు సంక్రాంతికి వస్తే తిరుగు లేదనే ట్రాక్ రికార్డు వచ్చింది కదా?**

అలా ఎక్కువగా ఒక ముద్ర పడటం కూడా మంచిది కాదు. ఒత్తిడి పెరుగుతుంది. సంక్రాంతి కొచ్చి మంచి ఎంటర్టైన్మెంట్ ఇస్తున్నాడనే అనే ఫీలింగ్ ఉంటే చాలు. మంచి కంటెంట్ తో ఎవరొచ్చినా సరే ఆ సినిమాలన్నీ ఆడతాయి. నా విషయంలో నేను ఎంచుకునే జోనర్స్ ఎక్కువగా మానవీయ సంబంధాలకి, ప్రతి ఫ్యామిలీ రిలేట్ అయ్యేలాగా ఉంటుంది. అది నాకు ప్లస్ అవుతుంది

**ఈ సినిమాలో మీరు తీసుకున్న ఎమోషనల్ టచ్ ఏమిటి ?**

ఇప్పటి వరకు టీజర్, ట్రైలర్లో ఎక్కడా కూడా రివిల్ చేయాలని ఒక ఎమోషనల్ పాయింట్ ఈ సినిమాలో ఉంది. అది మీరు స్క్రీన్ మీద చూడాలి. కామెడీతో పాటు ఒక బలమైన ఎమోషనల్ రైడ్ ఉంటుంది. చిరంజీవి గారు, నయనతార గారు, పిల్లల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా హృద్యంగా ఉంటాయి. భార్యాభర్తల మధ్య ఒక సమస్య వచ్చినప్పుడు వాళ్ళు ఎలా దాన్ని హ్యాండిల్ చేస్తారనేది చాలా కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించడం జరిగింది. అది కచ్చితంగా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఆ ఎమోషన్ స్క్రీన్ మీద చూస్తున్నప్పుడు ప్రతి ఒక్కరు ఇది కరెక్టే కదా అని ఫీల్ అవుతారు.



## రిజల్ట్ పట్ల మేమంతా హ్యాపీగా ఉన్నాం - టీజీ విశ్వప్రసాద్

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ప్రెస్టీజియస్ మూవీ రాజా సాబ్ నిన్న శుక్రవారం థియేటర్స్ లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ చిత్రాన్ని హారర్ ఫాంటసీ జానర్ లో ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా రూపొందించారు దర్శకుడు మారుతి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై గ్లోబల్ సినిమా స్థాయిలో గ్రాండ్ గా మూవీని నిర్మించారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్ టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ తమ పర్ ఫార్మెన్స్ లు, అందంతో ఆకట్టుకున్నారు. రాజా సాబ్ సినిమా వరల్డ్ వైడ్ హ్యూజ్ కలెక్షన్స్ తో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతున్న నేపథ్యంలో ఈ రోజు మూవీ టీమ్ కింగ్ సైజ్ బ్లాక్ బస్టర్ పేరుతో హైదరాబాద్ లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ – రాజా సాబ్ సక్సెస్ తో హ్యాపీగా ఉన్నాం. తొలి రోజు 100 కోట్ల రూపాయలు వరల్డ్ వైడ్ కలెక్ట్ చేస్తుందని ఆశిం చాం. మా అంచనాలు మించి 112 కోట్ల రూపాయలు వసూళ్లు తొలి రోజు రాజా సాబ్‌కు దక్కాయి. గ్లోబల్ గా కలెక్షన్స్ డీటెయిల్స్ వస్తున్నాయి. ఈ నెంబర్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేస్తాం. కిడ్స్, ఫ్యామిలీస్ మా మూవీకి వస్తున్నారు. ఫ్యామిలీ ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రభాస్ గారు ఓల్డ్ గెటప్ లో చేసిన 4 నిమిషాల సీన్స్ కొన్ని టెక్నికల్ రీజన్స్ వల్ల సినిమాలో చూపించలేకపోయాం. ఆ సీన్స్ ఇప్పుడు థియేటర్స్ కు పంపించాం. ఇక రాజాసాబ్ ప్రతి షోలో ప్రభాస్ గారి ఓల్డ్ గెటప్ సీన్స్ చూస్తారు. హారర్ ఫాంటసీ జానర్ లో ఈ సినిమాను నిర్మించాం. కొందరు ఇంటలెక్చువల్స్ నుంచి మిక్స్డ్ రియాక్షన్స్ వచ్చాయి. హారర్ ఫాంటసీని డీప్ గా వెళ్లి కొందరు విశ్లేషణలు చేశారు. అవన్నీ వదిలేస్తే సినిమా బాగా రన్ అవుతోంది. ఇది ఇలాగే కొనసాగి సంక్రాంతికి మంచి విజయం దక్కుతుందని ఆశిస్తున్నాం అన్నారు.

## పవర్‌ఫుల్ రోల్‌లో అదరగొట్టిన సమంత



సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇది హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా మెప్పించనుంది. సామ్‌ను సరికొత్త పాత్రలో ఆవిష్కరించనున్న సినిమాగా ఇది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రాజ్ నిడిమోరు క్రియేట్ చేసిన 'మా ఇంటి బంగారం'ను నందినీ రెడ్డి డైరెక్ట్ చేశారు. 'ఓ బేబి' తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబోలో వస్తోన్న రెండో చిత్రమిది. టీజర్‌ను గమనిస్తే..కామెడీతో నవ్వించే సినిమా ఉన్నట్లుండి రియలిస్టిక్ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్‌గా జరిగే మార్పును మనం స్పష్టంగా గమనించవచ్చు.

**రెండు భిన్న కోణాలు..**

టీజర్‌లో సమంతను సాధార ణమైన గృహిణి పాత్రలో చూపించారు. అయితే ఆమె తన అత్తగారింటికి వెళ్లిన తర్వాత పరిస్థితులు తలకిం దులవుతాయి. నవ్వుతూ మృదు స్వభావిగా కనిపించే ఆమె ఉన్నట్లుండి ఎదురు దాడి చేసేంత శక్తివంతు రాలిగా మారుతుంది. ఇందులో సమత స్టైలిష్‌గా కాకుండా రియాలిటీకి దగ్గ రగా ఉండేలా చూపించారు. ఆమె యాక్షన్ సన్నివేశాల్లో వేగంగా కదలటమే కాదు.. ఆమెలోని ఎమోషన్స్‌ను కూడా లోతుగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు మేకర్స్. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు, హిమాన్క్ దువ్వూరు కలిసి నిర్మిస్తున్నారు. సమంత లీడ్ రోల్ చేస్తోన్న 'మా ఇంటి బంగారం' చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటిస్తుండగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.

## నారి నారి నడుమ మురారి'లో మంచి క్యారెక్టర్ చేశాను

- సంయుక్త మీనన్

చార్మింగ్ స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నటిస్తున్న హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అద్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్ష వైద్య కథనాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. జనవరి 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.

**సంక్రాంతికి రావడం ఎలా అనిపిస్తుంది ?**

సంక్రాంతికి రావడం చాలా ఆనందంగా ఉంది. సంక్రాంతి చాలా పెద్ద పండుగ. సంక్రాంతికి వచ్చే ప్రతి సినిమాకి మంచి ఆదరణ ఉంటుంది. ఇది చాలా క్లీన్ కామెడీ ఎంటర్టైనర్. పండుగకి పర్ఫెక్ట్ మూవీ.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

ఇందులో నా క్యారెక్టర్ కి చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. ఇద్దరు హీరోయిన్స్ ఉన్నప్పుడు ఆడియన్స్ సహజంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు. కానీ ఇది అలా కాదు. డైరెక్టర్ గారు చాలా యూనిక్ పాయింట్ తో ఈ కథ రాశారు. అది మీరు స్క్రీన్ మీద చూడాలి.

**శర్వా గారితో నటించడం ఎలా అనిపించింది ?**

శర్వానంద్ గారు చాలా అద్భుతమైన టైమింగ్ ఉన్న హీరో. చాలా సపోర్టివ్, హెల్ప్ ఫుల్ గా ఉంటారు. ఆయనతో పనిచేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. ఇందులో నరేష్ గారు, సత్య గారి పాత్రలు కూడా అందరినీ అలరిస్తాయి.

**డైరెక్టర్ రామ్ అబ్బరాజు గురించి?**

డైరెక్టర్ చాలా కూల్ గా ఉంటారు. ఇంత కాంపిటీషన్లో సినిమా వస్తున్న ఆయనకు ఎలాంటి ఒత్తిడి ఉండదు. ఎప్పుడు చాలా కాన్ఫిడెంట్ గా ఉంటారు. ఆయన కోపంలో ఉన్నట్లు ఎప్పుడు చూడలేదు. చాలా క్లారిటీ వున్న డైరెక్టర్.

**సాక్ష వైద్య గురించి?**

మా మధ్య మంచి కాంబినేషన్ సీన్లు ఉన్నాయి. తనంటే నాకు చాలా గౌరవం. తను ప్రతి సీన్ కి ప్రిపేర్ అయ్యే విధానం చాలా బాగుంటుంది. చాలా హార్డ్ వర్క్ చేస్తుంది.

**మీరు ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటారు?**

ఇప్పుడు వరకు వైవిధ్యమైన పాత్రలు చేశాను. నా ప్రతి సినిమాకి వైవిధ్యం ఉంటుంది. నాకు అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంటుంది.

**2025లో మీకు మంచి ఎక్స్పీరియన్స్ ఇచ్చిన సినిమా?**

పూరి జగన్నాథ్ గారితో వర్క్ చేశాను. అది ఫెంటాస్టిక్ ఫిలిం. ఎంత చెప్పినా తక్కువే. యాక్టింగ్ షూటింగ్ ప్రాసెస్‌ని చాలా ఎంజాయ్ చేశాను.

**మీరు ఉంటే సినిమా హిట్ అనే బ్రాండ్ వస్తుంది?**

మనం ఆడియన్స్ కోసం సినిమా చేస్తాము. కంటెంట్ ఉంటే ఆడియన్స్ కచ్చితంగా చూస్తారు.

**సంక్రాంతి పండుగ ఎలా జరుపుకుంటారు**

ఎక్కడున్నా అక్కడ ప్రతి పండుగ జరుపుకోవడం అనేది నాకు అలవాటు. అందరూ కూడా మంచి పిండి వంటకాలు మా ఇంటికి పంపిస్తారని కోరుకుంటున్నాను (నవ్వుతూ).

**బ్లాక్ గోల్డ్ ఎప్పుడు వస్తుంది?,**

ఫిబ్రవరిలో షూటింగ్ పూర్తి కావచ్చు. సినిమా చాలా బాగా వస్తోంది.

ఆల్ ది బెస్ట్

థంక్యూ



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044